UNIVERSAL LIBRARY
OU_204209
UNIVERSAL LIBRARY

OUP—552—7-7-66—10,000

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T83/V46T Accession No. T6[illegible]

Author వేంకటరమణరావు

Title [illegible] 1925

This book should be returned on or before the date last marked below.

# తానీషా

(గోలుకొండరాజ్యవినాశము.)

గ్రంథకర్త:

దూబగుంట వెంకటరమణయ్యగారు.

# కాళిదాసుచరిత్ర.

శ్రీమాన్ శ్రీ చిలకమర్తిలక్ష్మీనరసింహముగారిచే రచియింపబడినది. వెల 1—0—0

# రసపుత్రవిజయము.

గ్రంధకర్త:—ద్రోణంరాజు సీతారామరావు.

ఇది విమలాదేవి నవలననుసరించి వ్రాయబడినగ్రంధము అనేక నాటకసమాజముల వారిచే ప్రదర్శింపబడినది కనుక కథాసారము వ్రాయననవసరము ఇందు రాజమండ్రి చింతామణీనాటకసమాజం యాక్టరు అగు కీర్తిశేషులైన అల్లకచంద్రశేఖరం గారిచే రచియింపబడిన కీర్తనలతో ముద్రింపబడినది. వెల:—1—0—0

మావద్ద అన్నిరకములపుస్తకములు దొరకును కేట్లాగుకోరిన పంపబడును వర్తకులకు మంచిరుసుమియ్యబడును అర్డరులతో 1/4 వంతు అడ్వాన్సుగా పంపవలెను.

పలయువారు.

టి. వి. రమణయ్య అండు బ్రదర్సు

నేషనల్ బుక్ డిపో, రాజమండ్రి.

# తానీషా

(గోలుకొండరాజ్యవినాశము.)

గ్రంథకర్త:

దూబగుంట వెంకటరమణయ్యగారు

ప్రకాశకులు:

టి. వి. రమణయ్య అండు బ్రదర్సు.

నేషనల్ బుక్ డిపో, రాజమండ్రి.

మొదటికూర్పు 1000 ప్రతులు.


కాకినాడ.

స్కేప్ అండు కో.,లో క. సుబ్బారాయుడు బ్రదర్సు వలన ముద్రితము.

1925

కాపీరైటురిజిష్టర్డు.]

[వెల రు 1—0—0.



గ్రంథకర్త.

# పీఠిక

విద్వత్కవీంద్రులారా! ఆంధ్రభాషాభిమానులారా!!

నేనిదివఱలోఁ జరిత్రాత్మకమగు "చాందసుల్తానా" యను నవల నొకదానిని రచించితిని. శ్రీరామవిలాసగ్రంథమాలాధికారులుగను, సద్గ్రంథరచనాధురంధరులుగను, సత్కవిపోషకులుగను నుండి యాంధ్రభాషాసేవాటి దురదృష్టవశమున స్వర్గమలంకరించిన చెలికాని లచ్చారావుగా రా గ్రంథమును బ్రచురించియుండిరి. దానిం జదివిన మిత్రులు పలువురు సదభిప్రాయముల నొసగి, మరలఁ జరిత్రాత్మకమగు గ్రంథము నేనే రచింపుడని కోరిరి. ముఖ్యముగ నైతికశ్రీయు, రసవంతములైనట్టియుఁ జరిత్రాంశము లిదివఱకే చాలమట్టుకు మన యాంధ్రదేశమున వెల్లడియైయున్నందున మరలఁ జరిత్రాత్మకమగు నవల నెట్లు రచింపఁగలనను సంశయము నాకుఁ బొడమినందున గొంతకాలమూరకుంటిని. పిమ్మట నేనొకపరి యముద్రితగ్రంథములవిషయమై భాషాభిమానులును, నా మిత్రులును నగు వారితోఁ బ్రస్తావించుచుండ సందర్భవశమున సత్కవీశ్వరుల విషయమునుగుఱించి కొంతవఱకు మాటలాడవలసివచ్చెను. అట్టితఱి భక్తిశిఖామణులును, కవిశ్రేష్ఠులును నగు పోతన, తిక్కన, రామదాసాది మహాకవుల చారిత్రములఁ గొంతవఱకుఁ జర్చించి, మాటలాడుకొనుచుండ రామదాసుగా రిప్పటి కెంతకాలముక్రిందట నివసించుచుండిరనియు, అక్కన్నమాదన్నలు వారి మేనమామలని మాత్రము తెలియు

గాని వారిసంపూర్ణచారిత్ర మెంతై నగలదా యనియుఁ
ండదఱు నన్ను బ్రశ్నించిరి. కాని, వారికప్పటికంత విశదముగ
సమాధాన మివ్వఁబడలేదు. అప్పటినుండియు నేనావిషయ
లను విశదముగఁ దెలిసికొనఁగోరి దేశచరిత్రలనుగొన్ని
జదివిచూచితిని. కీర్తిశేషులైన కె. వి. లక్ష్మణరావుగా
రాము రచించిన మహమ్మదీయమహాయుగమునం దాకొ
రను దీర్చియుండిరి.

గోలుకొండరాజ్యమున అబుల్ హసన్ కుతుబ్ శాహ
“తానీషా” పరిపాలించు కాలమున నక్కన్న మాదన్న
నికడ నమాత్యశేఖరులై, స్వామికార్యధురంధరులై, హిం
దుమహమ్మదీయైకమత్యముకొఱకు కొనరించిన ఘనకార్యము
తానీషా సహితము హిందూమహమ్మదీయ సఖ్యతకై
పడినవిధమును, నాకాలమున ఢిల్లీపాదుషా మహమ్మదీ
సాయమున గోలుకొండ నెట్లు జయించినదియు మొద
గల చరిత్రాంశములను జదివి తెలిసికొనినది మొదలిట్టి
ంము లింతవిశదముగ నాంధ్రదేశమున వెల్లడికాలేదను
్రాయమున వానినెల్ల నవలరూపమున బయలెక్కింపనెం
ాగ్రంథమును వ్రాయసాహసించితిని. రామదాసు
మా కాలపువాఁడగుటచే నాతని చరిత్రమును గూడ
విపులముగను, రసవంతముగను, జేర్చితిని.

తానీషారాజు పాలనమొనర్చుతఱి గోలుకొండరాజ్య
ంగలుల సామ్రాజ్యమున నంతరించి పోవుటచే నీగ్రం

ధమునకు "తానీషా" లేక (గోలుకొండరాజ్య వినాశము) అని పేరిడితిని.

ఈగ్రంథమునందు హిందూమహమ్మదీయ మతముల సామ్యమునుగుఱించి వ్రాయుపట్ల వేదములలోని కొన్నిఋక్కులును, ఖురానులోని కొన్ని "ఆయెత్" లును భావమునందు సరిపోలుచున్నట్లు నిరూపించుటలో నాకెంతయు సాయపడుటయేగాక గ్రంథమును శ్రద్ధమెయిఁజదివి సదభిప్రాయము నొసంగిన సత్కవీశ్వరులును, భాషాసేవకులును, బీతికాపురవాస్తవ్యులును నగు మ. రా. రా. శ్రీ ఉమర్ అలీషాగారికిఁ గృతజ్ఞతాపూర్వకంబులగు మదీయవందనంబు లర్పించుచున్నాఁడను. గ్రంథమును సాంతముగఁ దిలకించి సదభిప్రాయముల నొసగిన నామిత్రులకందరికిని నేనెల్లవేళల గృతజ్ఞుఁడను.

ఈగ్రంథమించుక దేశాభ్యుదయమునకుఁ దోడ్పడఁ గలదని యెంచి దానిని ముద్రించి ప్రచురించిన మ. రా. రా. శ్రీ. తమ్మన వెంకటరమణయ్యగారికిని, యాతని సోదరులకును నాకృతజ్ఞతావందనము లర్పించుచున్నాఁడను. వారిని దేవుఁడెల్లవేళలఁ గాపాడుగాత!

గ్రంథమందలి రసవైరస్యములను రసజ్ఞులకువదలి, దోసగులున్న క్షమింపఁ బండితవర్యులను బ్రార్థించుచున్నాడను.

శ్రీకాళహస్తి<br>
5—3—1925

ఇట్లు విన్నవించు బుధజనవిధేయుఁడు<br>
దూబగుంట వేంకటరమణయ్య,<br>
గ్రంథకర్త

# పండితాభిప్రాయములు

కం. తానేషాయను నవల మ
హానందము గూర్చెఁ జదివి ♦ నంతన భక్తి
జ్ఞానం బాంధ్రుల శౌర్యని
దానంబున కిదియె మంచి ♦ తార్కాణ మగున్.

కం. కథయును గన వినఁగ సుధా
మధురంబుగనుండు పాత్ర ♦ మార్గము శయ్యా
విధమును లెస్సగనున్నవి
బుధులోహోహోయనుచు మెచ్చఁ ♦ బోలదె దీనిన్.

ఆ. వె. ఒక్కచోట భక్తి ♦ యొక్కచో జ్ఞానంబు
నొక్కచో చరిత్ర ♦ కోవయొగ
ఫక్కిదనరి నవల ♦ పరమానురాగసం
భరిత మగుచుదోఁచు ♦ పాఠకులకు.

తే. గీ. గోలుకొండను గోల్పోయి ♦ గోడు చెడిన
తానెషాకీర్తి హిందూమ ♦ హమ్మదీయ
సఖ్యమును గూర్చుకతన శా ♦ శ్వతయశంబు
నందె నౌరంగజేబట్టు ♦ లందలేదు.

తే. గీ. దూబగుంటవంశ ♦ దుగ్ధాబ్ధిచంద్రసం
కాశ వేంకటరమ ♦ ణయ్య నీదు
యశము శాశ్వతముగ ♦ నవని వర్ధిల్లు నీ
కృతికతాన సుకృత ♦ గతియొసంగి.

పిఠాపురము,  
14—7—24

ఇట్లు,  
ఉమర్ అలీషా

శ్రీ రా మ.

ఈనవల నామిత్రులగు దూబగుంట వెంకటరమణయ్య గారు రచించిరి. దాని నే జదివి నాయుత్సాహమును బ్రకటింప దలంచి నాయభిప్రాయము నిందు బొందుపరచితిని. శైలి మృదుమధురమై విరాజిల్లుచున్నది. తానీషా రాజ్యపరిపాలనము, అక్కన్నమాదన్నల స్వామికార్యధురంధరత్వము, రామదాసుగారి భక్తితత్పరత మొదలగువిషయములు చరిత్రననుసరించి రసవంతముగ వర్ణింపఁబడియున్నవి. తానీషా అక్కన్నమాదన్నలు హిందూమహమ్మదీయసఖ్యతకై యొనర్చిన యద్భుతకృత్యము లెంతయుఁ గొనియాడఁదగియున్నవి. ఇక్కథ మొదలిడి తుదదనుకఁ జదువక నడుమ విడువ మది వొడమదు. మఱియు నీగ్రంథము భక్తివీరాది రసముల కునికిపట్టై శృంగారభావస్థలవిరహితమునై, నీతిబోధకమై విరాజిల్లుటం జేసి పాఠశాలలలోని బాలబాలికామణులకుఁ బఠనీయగ్రంథముగ నుపయోగింపవచ్చును. చరిత్రాత్మకమగు గ్రంథములు మిక్కిలి తక్కువగనున్న నీకాలమున నిట్టిగ్రంథముల వ్రాసి బయలెక్కించు నీగ్రంథకర్తను దేవుఁడెల్లవేళలఁ గాపాడుగాత.

ఇట్లు

విద్వజ్జన విధేయుఁడు.

శ్రీ రాజా దామెర్ల కోదండరామస్వామినాయునింవారు

జమీందార్ ఆఫ్ కరకంబాడు, క్రిష్ణాపురం.

# అంకితము.

(౧)

సీ. పరమపాతివ్రత్య । పద్ధతిశ్రద్ధతో
నిష్ఠావిధులతోడ । నెఱపుసాధ్వి
కలలోననైన న । వ్వులకేనియునునైన
సత్యంబుదప్పని । సచ్చరిత్రి
ధరణియందునక్షమా । తరణిచే సంసార
జలనిధిఁదరియంగఁ । జాలుజనని
తనయాజ్ఞలనుజవ । దాటియెఱుంగని
పుత్త్రులఁగనినట్టి । పూజ్యురాలు

గీ. క్షితినిజనకుఁడు లేఁడను । చింతఁదీర్చి
యన్నిరీతులమమ్ముల । నాదరించు
సుగుణమాలప్రోవు మాతల్లి । సుబ్బమాంబ
కంకితమొనర్తు నీకృతి । నతులభక్తి.

# OPINION.

I read with pleasure the novel written by M. R. Ry. Dubagunta Venkata Ramanayya garu who is endowed with an intense capacity for writing an easy and fluent Telugu prose. In this novel of Tanisha, the author has harmoniously blended facts of history, religion and ethics. It contains vivid descriptions of the old kingdoms of Hydrabad and Golconda. He has well described the patriotism of Akkanna and Madanna and the devotion and heroism of Sivaji. He has brought out fully the tenets of the Hindu and Islamic religions. The plot is well woven and has a unity about it. It is written in classical prose and is readable by all classes of students. The book is particularly fitted for non-detailed study in the high school classes.

Camp Kalahasti.

C. N. KRISHNASWAMI,
B. A., L. T.

శ్రీమత్పరదేవతాయైనమః.

# తానీషా

## మొదటిప్రకరణము.

ఉ. "ఓకమలాప్తయోవరద యో ప్రతిపక్షవిపక్షదూరయో
హూకవియోగివంద్యసుగుణోత్తమ యోశరణాగతామరా
నోకహయోమునీశ్వర మనోహర యో విమలప్రభావరా
వేకరుణింపవేతలఁపవే శరణార్థిని నన్నుఁగావవే."

ఆహా! యేమిభక్తి! యేమిభక్తి! గజేంద్రా! నీవేసరి. అయ్యో! పాపము. శక్తిలేదు—ప్రాణములు చలించిపోవుచున్నవి—ధైర్యమించుకైనలేదు—ఏమిచేయఁగలవు? "లావొక్కింతయులేదు, ధైర్యము విలోలంబయ్యెఁ బ్రాణంబులున్ ఠావుల్ దప్పెను మూర్ఛవచ్చెఁదనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్ ..." ఆహా! యిట్టి దురవస్థలో నీమనంబున నీశ్వరసన్నిధానంబు నెట్లుగల్పించుకొంటివి? మహానుభావా! దీనజనపోషకా! గజేంద్రుని మొరయాలించితివే! ఏమాతొందర! ఏమాయాతురత! గరుడగమనా! గజేంద్రుని మొర నీహృదయమున నంతగాఢముగ నాటినదా?

మ. "సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁడే
పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం
తరధమ్మిల్లముఁ జక్కనొత్తఁడు వివాదప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై."

మఱియు—

మ. "తనవెంటన్ సిరి లచ్చి వెంటనవరోధవ్రాతమున్ దానివె
న్కనుబక్షీంద్రుఁడు వానిపొంతను ధనుఃకౌమోదకీశంఖచ
క్రనికాయంబును నారదుండుధ్వజనీకాంతుండురావచ్చిరో
య్యనవైకుంఠపురంబునన్ గలుగువారాబాలగోపాలమున్."

తండ్రీ! వారందఱు రాకేమి? నీవు దిగ్భ్రమఁజెంది పరుగెత్తుచుండ వారుమిన్నకుందురా? నీవెంటనే చనుదెంతురు. లక్ష్మీనాథా! మానవులు నిన్ను నమ్మరు. వారికి నిశ్చలభక్తి లేదు. అబ్బా! యిదేమి! విపరీతమైన చలిగానున్నది! మహామ్మదీయులు పెట్టుకష్టములవలెనే యీచలిబాధ సహితమొక్కడై నన్ను వేధించుచున్నది. శ్రీరామా! భద్రాచలరామా! దశరథరామా! ఆదుర్మార్గుల నొక్కసారి భూమికిబలి పెట్టలేవుగా? ఏమిదుండగము లేమిదుండగములు! ఓరీ! గోముఖవ్యాఘ్రమా! మానాభిమానవిహీనా! నీక్రూరకృత్యములనింక నుగని పెట్టవలయును. పిమ్మట నీపింఛమూర్పవలయును. ఇప్పటికేమైనది లెమ్ము. సతతాన్నదానధౌరేయా! శాంతమూర్తీ తానీషాచక్రవర్తి! ముందు ముందు మనకెన్ని కష్టములు

గలుగఁబోవునో తెలియకున్నది. "హరేరామ హరేరామ రామరామహరేహరే! హరేకృష్ణ హరేకృష్ణ! కృష్ణకృష్ణ హరేహరే!" ఓహో! తెల్లవాఱవచ్చినదే! మడికోలనును సమీపించితివా? అదిగో సమీపముగనే యున్న"దనుచు నొక నాటి వేకువజామున నొకబ్రాహ్మణుఁడు పోతరాజుగారి గజేంద్రమోక్షగాథలోని పద్యములను గీర్తనలుగఁ బాడుకొనుచు నప్పుడప్పుడు తనపై విరోధమును బూనియున్న మహమ్మదీయులనునిందించుచు బాగుగఁదెల్లవాఱునరికి హైదరాబాదు పట్టణమునకు సమీపమున నున్న మడికోలనను పేరఁ బ్రసిద్ధిజెందుచుండిన నొకకోలనువద్దఁ జేరెను.

ఈకోలను విస్తారము లోతైనది కాదు. దానిలోతు దాదాపుగ నొకనిలువెడుండవచ్చును. దానిచుట్టుఁగొంచెమెత్తైన కట్టయొకటి గలదు. కట్టపైనుండి కోలనులోనికి దిగుచోట నొక స్తంభము నాఁటబడియుండెను. ఆస్తంభమున నొకనల్లపలక వ్రేలాడుచుండెను. దానిమీఁద నీక్రింది విధముగ వ్రాయఁబడియుండెను.

"నిత్యకర్మానుష్ఠానపరాయణులును, దపోధర్మశమదమాదిసద్గుణంబుల కాకరమైన వారును నగుబ్రాహ్మణజాతివారు దప్ప నితరులెవ్వరీ కోలనులోదిగి స్నానాదికృత్యముల నాచరించుటకుఁవీలులేదు. బ్రాహ్మణధనసహాయముచే బ్రాహ్మణులకొఱకే ప్రత్యేకముగ నీకోలను నిర్మింపఁబడినది. పైచట్ట

మునకు వ్యతిరేకముగ నడుచుకొనినవారు నవాబుగారి కప్రి యులగుట యేకాక శిక్షార్హులు గూడ నగుదురు." ఈభావమునను సరించి హిందూస్థానిభాషలో గూడ నాపలకపై వేఱొక వ్రక్కన వ్రాయఁబడియుండెను. కావలివారు సహిత మీకోలనువద్దఁ గావలిగాచుచుందురు. ఇతరజాతులవారికిట్టి కోలంకులైదాతాపరిసరముననే నిర్మింపఁబడియుండెను.

ఆబ్రాహ్మణుఁ డాకోలనుజేరిన తత్క్షణమే చేతనున్న చెంబును గ్రింద బెట్టి తాఁ గట్టుకొని యున్న బట్టను విప్పి పైనున్న చిన్నగుడ్డనుధరించి విప్పినబట్టను నీటిలోనుతుక నారంభించెను. వస్త్రము శుభ్రపఱుపఁబడినది. భూసురుఁడు క్రిందనున్న చెంబునెత్తుకొని హరినామస్మరణగావించుకొనుచుఁ గోలనిలోనికిదిగి మొలలోతునీళ్లలోనిలిచెను. పిమ్మట నతఁడు సంకల్పమొనరించి "హరహరమహాదేవ" యనుచునీటిలోమునిఁగెను. అంతనతఁడు పైకిలేచి యేవోకొన్నిపదముల నుచ్చరించుచు నర్ఘ్యమును విడిచి మఱల నీటిలో మునిఁగి లేచినవెనుక నతఁడురామనామమును స్మరించుచు దేహమును శుభ్రపఱచుకొనుచుండెను. వెంటనేయతఁడు నిశ్చేష్టితుఁడై నలుదెసల పరికించిచూచెను. మఱల నతఁడొకదిక్కునకుఁ జూడ్కినిగిడించెను. అతనికిఁ గోపముమెండైనది. అంతనతఁడు బిఱబిఱగట్టునను సమీపించి "ఓరీ! దుర్మార్గా! నీవా! బ్రాహ్మణులు దప్ప నితరజాతులవారిందెవ్వరున్నానమాడఁగూడదని నీకుఁ దెలియు

దా ? దీనిపేరు మడికొలనని నీవెఱుంగవా ? హిందూమతద్వే
షీ! మీరు హేయమగు బదార్థముల నీనీటఁగల్పుటం జేసి నీ ర
శుభ్రమగుటచే మహమ్మదీయజాతివారును నితరజాతులవారు
నుగూడ నిందుస్నానమాడఁగూడదని నవాబుగారు కట్టుదిట్టము
లఁగావించినది నీవెఱుంగవా ? అక్కడఁ గట్టియుండు పలకమీ
ద నేమివ్రాయఁబడియున్నదో దానినిఁజూడలేదా? ఏమి కయ్యా
మూనకుఁ గాలు ద్రవ్వ గడంగితివా? మీవారందఱు నిన్నిట్లా
చరించుమని నిన్నుబురివెట్టిరా ?" యని యనుచు వాతఁడచ్చట
స్నాన మొనరించుచున్న నొక మహమ్మదీయునిడాసెను.

మహమ్మ—ఓరీ ! బ్రాహ్మణాధమా! నీకింత పౌరుష
మెందులకు ? నీతాత తండ్రులు ద్రవ్వించిన కొలననుకొంటి
వా ? మీబ్రాహ్మణ జాతి లక్షణములన్నియు మాకుఁదెలు
సును. మీసంధ్యావందనములు చట్టుబండలైనట్లే యున్నవి—
మీమడులు మన్నయినట్లేయున్నవి. మోసముచేసి డబ్బు సం
పాదించి యప్పన్నముదినుటయనుకొంటివా ? నీపిల్లజుట్టునూడ
బెఱికి నీజన్నిదమును ద్రెంపి నిన్నుబొర్లించి తన్నెదనూరకుం
డుము. నీటిలోనికివచ్చితివా నిన్నిందేవేసి ముంచెదను.

బ్రాహ్మణుఁడు:— దుర్మార్గా! ఏమి కూసితివిరా !
"నీతాతతండ్రులు త్రవ్వించిన కొలననుకొంటివా" యనియా?
మా తాతతండ్రుల నీవెఱుంగుదువటరా ! ఓరీ ! దీనిని నేనే త్ర
వ్వించితిని. మాజాతివారివసతులకొఱకు త్రవ్వించితిని. ఎవరు

త్రివ్వించిన నీకేమి ? ఓరీదుష్టా! పాపీ ! దౌర్భాగ్యదామోదరా! బ్రాహ్మణహతకా ! మాకులాచారము లెట్లున్న నీకేమిరా షండా నీవా! మమ్మాక్షేపించువాఁడవు ? నేనెవరైనది సహితము గుర్రైయుంగక కాఱుగూఁతలుగూయుచున్నావు. ముందు లెమ్ము—బయటికిరమ్ము రాకుంటివా నీప్రాణములునీవి కావని" చెప్పెను.

మహామ్మదీయుఁడా విప్రునిమాటలకు లక్ష్యపెట్టక నీటియందుస్నానమొనరించుచునేయుండెను. విప్రునకుఁ గోపము హెచ్చయినది. పిమ్మట నతఁడు నీటిలోనికిదిగి యామహామ్మదీయుని నీటినుండిబయటికీడ్చి మెడఁబట్టుకొని ముందునకుఁ ద్రోసెను. ఆత్రోపునకతఁడు క్రిందఁబడి కొంతసేపు కదలక మెదలకుండెను. పిమ్మటఁ గొంతవడికాతఁడు లేచి బ్రాహ్మణునిపైఁబడనుంకించెనుగాని యంతలో నావైపునఁబోవుచుండిన మనుష్యులావిప్రునిచర్యలఁ గనిపెట్టి భయభ్రాంతులై నిమిషమాత్రముననే యాభూసురుని చెంతకరుదెంచి చేతులుజోడించుకొని నిలువఁబడిరి. ఇంతలో నావిప్రుడు వారింజూచి "ఓరీ ! యీయధమునికిరువదిరూపాయ లపరాధమును విధించితినిం ముందు వీనిని గొంపోయి వారమురోజులు ఖైదునందుంచుడు. పిమ్మట వీనివద్దనుండి పైకముచురాఁబట్టుకొనుడు. ఇదే నాయాజ్ఞయైనది. పొండ"ని వారికుత్తరువిచ్చెను. ఆవచ్చినమనుజు లామహామ్మదీయుని బట్టుకొని వెళ్లిపోయిరి.

అంతనాభూసురశ్రేష్ఠుఁడు "కానిమ్ము వీరిపనిబట్టించెదను. శ్రీరామా! నేఁడెట్టి దుర్దినము. తెలువాత నీదుర్మార్గునితోఁ బోట్లాడవలసివచ్చినది. ఇంతకును గావలిగాచువారు నేడింకను రానందున నింతజరిగినది. ఆపద్బాంధవా! కరుణాసముద్రా! రామప్రభో! భద్రాద్రివాసా! శ్రీరామా!" యనుచు నీటిలోదిగి మఱలస్నానమొనరించి సంధ్యావందనాదినిత్యానుష్ఠానముల నెరవేర్చి తడిగుడ్డనుగట్టుకొని చెంబునిండుగ నీరు ముంచుకొని రామనామస్మరణగావించుకొనుచు నాబ్రాహ్మణుఁడు గృహాముపైపుదారిపట్టెను.

# రెండవప్రకరణము.

తెల్లవాఱియైదాఱుగడియల ప్రొద్దెక్కినది. హైదరాబాదుపట్టణములోని జనులెల్లరును సంతోషసాగరంబున నోలలాడుచు వారివారిసియమితకృత్యంబుల నప్రమత్తులైయుండిరి. కాని యాపట్టణములోనిభూసురులునివసించు వీధిలో నొకయున్నతభవనమునవసించుచున్న నొకవిప్రుఁడు మాత్రమా పురజనుల యుత్సాహమునఁ బాల్గొనలేదు. అతఁడాలోచనానిమగ్నుఁడైనటులఁ గన్పట్టుచుండును. ఇంటినుండి వెలుపలముంగిటికిని ముంగిటనుండి యింటిలోనికిని యతఁడూరక తిరుగుచు

నెవరికొఆకోసరీక్షించు వాసవలె వీధి వైపున దనదృష్టి నప్పుడ ప్పుడు మరలించుచుండెను. "శివపూజనమయమాసన్నమైనది. దాదాపు తొమ్మిదిగంటల పొద్దు కావచ్చినది. రాజ్యాంగవ్య వహారములు పెక్కులున్నవి- కాలమతిక్రమించుచున్నదని మా మాదన్నకుఁ దెలియదు కాఁబోలు. తోవలో నేదైన నాపద సంభవించెనాయేమి! మాదన్నకొఆకెవరినైన మడికొలనుయొ ద్దకుఁ బంపుదునా? ఒరే! ఎవరురాయక్కడ?" యనియా విప్రుఁడనునంతలో రామనామస్మరణగావించుకొనుచు మా దన్నగారు లోపలబ్రవేశించిరి. అప్పుడావిప్రుఁడు మాదన్నవం కఁజూచి "మాదన్నా! నేఁడేల యింతయాలస్యమైనది? శివ పూజకు వేళమించిపోయినది. తానీషాగారియాస్థానమున కెప్పు డుపోవలయుననుకొంటివి. నీవు కోపము వహించినట్లున్నది. గతమేమి?

మాదన్న.—అక్కన్నా! నేనేమి చెప్పుదును! తానీ షాగారియాజ్ఞలను మహమ్మదీయు లతిక్రమించుచున్నారు నేఁ డు మనమడికొలనులో నెవఁడో తురుష్కుఁడు స్నానమొనరిం చి జలము నశుభ్రపఱచెను. నేనుస్నానమాడుతఱి వానిం గని పెట్టితిని.

అక్కన్న:—వాఁడెవ్వరైనదియుఁ గనిపెట్టలేకపోతివా?

మాదన్న:—ఆదుండగీఁడెవఁడో క్రొత్తవాఁడుగఁగన్ప టుచున్నాఁడు. ఎవఁడైననేమి బాగుగఁ బ్రాయశ్చిత్తమైనది. నా

దేహామురగులుకొనిపోయినది. కొలనునుండి బయటికి రమ్మని నవాఁడు మనయాచారవ్యవహారములనెత్తి వెక్కిరించుచు బ్రాహ్మణులఁ దూలనాడెను. పిమ్మట వానిచుని నేఁదాకవలసివచ్చినది. వానినీడ్చి యొడ్డునకులాగివైచితిని. వాఁడుక్రిందఁబడి కొంతవడి మిన్నకుండి పిమ్మట నాపైఁ బడ నుంకించెనుగాని యింతలో మనభటులచటికిరాగా వానిని వారివశము గావించితిని. వారమురోజులు ఖైదులోనుండునట్లును, ఇరువదిరూపాయలపరాధమును జెల్లింపవలసినట్లును శిక్షవిధించితిని.

అక్కన్న:—తగినశాస్తిచేసితివి. రామ, రామ, హిందూమహమ్మదీయసఖ్యతకై మనవలెనే తానీషాగారు సహితము పాటుపడుచుండ వీరికిట్టి దుర్బుద్ధిపుట్టినదేమి ? తటాకములందును, బావులందును, కొలనులలోను బూర్వమందఱమును నేయాటంకములునులే స్నానాదికృత్యములొనరించుచుండఁ గయ్యమునకుఁ గాలుద్రువ్వుచునిమహమ్మదీయు లొనరించు దుష్కార్యములకుఁగదా తానీషాచక్రవర్తి యిట్టి చట్టమును గావించుట. రానురాను వీరిదుష్కృత్యములు హెచ్చుచున్నవి. మహమ్మదీయులలోఁ గొందఱొకటిగఁజేరి హిందువుల నందఱిని హింసింపఁ బ్రయత్నించుచున్నారట! వారందఱు మనపైసహితము ద్వేషభావముతో వర్తించుచున్నారనియు మనసైన్యాధిపతియగు నిబ్రహీముసహితము వారిలోఁజేరియున్నాఁడనియు మనయాంతర్యమిత్రుఁడగు రజాకువలనఁ దెలియవచ్చినది.

మాదన్న:—ఇబ్రిహీం మొనరించు కార్యముల నింకను గొంత కాలము గని పెట్టవలయును. పిమ్మట వాని విషయమై యాలోచించెదము.

అక్కన్న:—మాదన్నా! మనకొఱకు తానీషా వేచి యుండును. చక్కబెట్టవలసిన రాచ కార్యములు మిక్కుట ముగ నున్నవి. శివపూజకు వేళ మించి పోవుచున్నది. మఱియు నేఁడింపు వాసరమగుటచే ననేకమంది విప్రవరులును బండితులు ను శివపూజ జరుగు కాలమున మనలను సందర్శింపవచ్చి యు న్నారు. వారిని సత్కరింపవలసి యున్నది. ఆదుర్మార్గుల విష యము వెనుక యోచించెదము. శివపూజకు వేళైనది లెమ్మ" నెను.

వెంటనే మాదన్న యింటిలోని కేగి మడుగువస్త్రముల ను ధరించి దేవతార్చనయొద్దకు వెళ్లి శివపూజ యొనర్చుటకుఁ బ్రారంభించెను. పిమ్మట నొక గంట కాలమునకుఁ బూజావిధా న మంతయుం దెను. అంత మాదన్న యచటికరుదెంచియున్న పండితులకును నితర బ్రాహ్మణులకును వారివారి విద్యాకౌశ ల్యముల ననుసరించి దక్షిణతాంబూలములనొసగి వారి నిం డ్లకనిపి యక్కన్నతోఁ గలిసి భోజనశాల కరుదెంచెను

# మూడవ ప్రకరణము.

ప్రస్తుతము హైదరాబాదని పిలువఁబడుపట్టణము పూర్వము భాగానగరమనికూడఁ బిలువఁ బడుచుండెను. క్రీ॥ శ॥ 1580-1611 వఱకు గోలుకొండరాజ్యమేలిన మహమ్మదుకులీకుతుబ్‌షాహా యీనగరమును గట్టించెను. గోలుకొండపట్టణము దినదిన మభివృద్ధిజెందినను జనసంఖ్య మిక్కిలి యెక్కువగుటచేతను, త్రాగుటకుఁగావలసిననీటివసతితగినట్లు లేనందునను జననివాసమునకు నిబ్బందిగలుగఁజొచ్చెను. ఆ కారణమున నీనవాబు గోలుకొండకు నైరుతిక్రోశములదూరమున మూసియను నేటియొడ్డున నొకపట్టణమును గట్టించెను. అతనిభార్యలలో నొక్కతెకు భాగాయనిపేరుండుటచే నతఁడానగరమునకు భాగానగరమనిపేరుపెట్టెను. గోలకొండకుఁబైభాగమున నొకచోట నీటికినానకట్టగట్టించి యందలినీరు గొట్టములగుండ భాగానగరమునకుఁదెప్పించి యీనవాబు జనులకుఁ గలబాధనుదీర్చెను. ఈతఁడు పెక్కురమ్యహర్మ్యములనుగట్టించి పేరువడసెను. ఈతనిచేఁగట్టింపఁబడిన జుమ్మామసీదు, చార్ మీనార్ రాజసౌధములు, పాఠశాలలు, భిక్షాగృహములు మొదలైన వనేకములిప్పటివఱకునున్నవి. ఈనవాబునకుఁబిమ్మట నితనికుమారుఁడైన హైదర్ అనువానిపేర నీనగరమునకు హైదరాబాదనికూడఁ బేరువచ్చెను. అప్పటినుండియు నిప్పట్టణమే గోలుకొండ

నవాబునకు ముఖ్యపట్టణమాయెను. మన చరిత్రకాలముననగా క్రీ॥ శ॥ 1658-1687 వఱకు దీనిని అబ్దుల్ హసన్ కుతుబ్ షాహా లేక తానీషాయనునవాబు పాలించుచుండెను.

ఇతనికిఁ బూర్వమేలుచుండిన అబ్దుల్లాహుసేన్ కుతుబ్ షాహాకితఁడు మేనల్లుఁడు. ఇతఁడతనికుమార్తెను బెండ్లియాడి సింహాసనమధిష్ఠించెను. ఈతఁడు రాజ్యాంగవ్యవహారవిషయముల నంతశ్రద్ధమెయివిచారింపక సదా విలాసవంతుఁడై యుండెను. అయిననితఁడు బ్రజలను దనబిడ్డలవలెఁ గాపాడుచు హిందూమహమ్మదీయ ద్వేషము లేక మహమ్మదీయులవలెనే హిందువుల యెడసహితము సమానగౌరవమును జూపుచుండెను. అతఁడు హిందువుడును బ్రాహ్మణుడును నగుమాదన్నగారికి ముఖ్యమంత్రిత్వమునొసగి యతనికిబాసటగనుండుటకు అక్కన్నగారిని నియమించెను. ఇట్లిఅబ్దుల్ హసన్ కుతుబ్ షాహా పరమకృపానిరతుండై ప్రజలను గాపాడుచుండినందున జనులెల్లరితనిని 'తాన్ షాహా' అనగా మంచిరాజనిపిలువసాగిరి. ఆమాటయే 'తానీషా' శబ్దముగఁ దెలుగునమారినది.

తానీషా రసికుఁడును, విలాసవంతుఁడును, సదా యానందము నేకోరువాఁడునునయి రాజ్యాఁగసంబంధములగువిషయములలో నంతగాశ్రద్ధవహించిపనిచేయకున్నను అక్కన్నమాదన్నలిద్దఱుగలసి సర్వాధికారమునువహించి, తమపాతబుద్ధిని బారఁద్రోలిదైవభక్తిఁగలవారైస్వామికార్యధురంధరత్వమును

వహించి రాచకార్యములను సరిగ దిద్దుటంబట్టి నవాబుగారి కే కొఱంతయును లేక సర్వకార్యములును నెరవేరుచుండెను. తానీషాసహితము వారిపైఁ బూర్ణవిశ్వాసముంచి వారెట్లు చెప్పిన నట్లొనర్చుచు నప్పుడప్పుడు వారివద్దనుండి సద్విషయములనుగూడ గ్రహించుచుండెను. ఇట్లితఁడు హిందూమతాభిలాషియు బ్రాహ్మణభక్తిపరాయణుఁడగుటచే హిందువులందఱును కొంతవఱకు మహమ్మదీయులుసహిత మాతనియందు బూజ్యభావమునువహించి "ఆహా! యితఁడు పూర్వజన్మమందుఁ దపశ్శాలియగు బ్రాహ్మణుఁడుగా నుండనోపు, తపోభంగముచే నితడు మహమ్మదీయుఁడై పుట్టె" నని యనుకొనుచుండిరి. కాని, పట్టణములోనిమహమ్మదీయులలోఁ గొందఱుమాత్రము తానీషా హిందువులపైఁ జూపుగౌరవమునకును బ్రాహ్మణులయెడనతనికిఁగలప్రీతివిశ్వాసములకును సహింపలేక తానీషాయెడలను, అక్కన్నమాదన్నలయెడలను ద్వేషభావముతో మెలంగుచు హిందువులను గయ్యమునకుఁగాలుద్రువ్వుచుఁ దమపక్షమునఁ జేరనిమహమ్మదీయులను లోఁబఱచుకొనుచు దానీషాగారి కక్కన్నమాదన్నలపై ద్వేషభావమునుగలిగించి రాజ్యాధికారమునుండి వారినిదొలగింప ననేకకుట్రలఁబన్నుచుఁ గాలమును గడపుచుండిరి. కాని తానిషామాత్రము వారి కెన్నడును లోఁబడక అక్కన్నమాదన్నలపై సంపూర్ణవిశ్వాసముంచి రాజ్యమేలుచుండెను.

ఇట్లు తానీషా హైదరాబాదుపట్టణములో రాజ్యమే లుచున్నను దనసైన్యములోఁగొంతభాగమును గోలుకొండకో టలోనుంచియుండెను. మందు, గుండుసామగ్రిలుసహిత మా కోటలోఁ బెట్టబడియుండెను. ఎప్పుడైనను శత్రుసేనలవలన బా ధగలుగుసమయము దటస్థించినయెడల నవాబుసహితముసర్వ సైన్యముతో గోలుకొండకోటలోనికిఁబోయి యచటఁ గొన్నిది నములవఱకు వసించుటకూడఁగలదు.

---

## నాల్గవ ప్రకరణము.

---

రాత్రి దాదాపు రెండుగంటలు కావచ్చుచుండెను. భూ దేవికిఁగాలపురుషుండు పట్టిన శ్వేతాతపత్రమువలెఁ బూర్ణచం ద్రుఁడు గగనతలంబున నలంకరించి గోలుకొండప్రాంతమున నున్న కాంతారమున కొకవింతయగులావణ్యము నొసఁగుచుం డెను. అడవినిగాచిన వెన్నెలయనుసామెతననుసరించి యాఘో రారణ్యమున వెలుఁగురమణీయచంద్రిక లేమానవునికిని లాభ దాయకములు గాకపోయినను నప్పుడావిపినమున నొకజవనా శ్వముపైనెక్కి కడురయంబునజనుచున్న నొకపాంథునికిమాత్ర మవి సంతోషదాయకములుగా నుండెను. కాని దీనికప్పుడప్పు డు కొంతభంగముగలుగుచుండెను. అవ్విపినములోని తరు

బృందము లెత్తుగను గుబురుగను బెఱిగియున్న చోట చంద్రు నికిరణములుభూమిపైసోకకుండుటచే నా బాటసారి యొక్కొక్కచోట చాలదూరమువఱకుఁ జిమ్మచీకటిలో నిమ్మళముగఁ దనహాయమును బోనివ్వవలసియుండెను. అట్లంధకారమునఁబో వలసివచ్చినప్పు డెల్లను నాపాంథుఁడు "ఆహా! యీఘోరకాంతార మింకెంత దవ్వు వ్యాపించియున్నదో! పట్టణమును దాటి సుమారు నాలుగుమైళ్ళువచ్చిన వెనుకనుండియు నీయరణ్యము లోఁబోవుట కారంభమైనది. ఇప్పటికి దాదాపు రెండామడల దూర మీయరణ్యమధ్యమున నెట్లో దారిసాగించినను దీనికంత్య మగుపడకున్నది. ఈ యంధకారమున వేఱొకదారిసహితము గానరాదు. ఇమ్మాడ్కి నేనతిమందముగఁజనుచున్న డిల్లీపట్టణము నెప్పుడు చేరవలయునో తెలియకున్నదనుకొనును నాబాటసారి మఱికొంతసేపటికిఁ జెట్లనీడలులేని వెన్నెలలో దారిసాగించుచు దన్నెవ్వరైనను గనుగొనుటకు వెన్నంటివచ్చుచున్నారేమోయను భీతిచే వెనుకకుఁదిరిగిచూచుచుఁ గొంతవడికి మఱలనంధకారమున దనహాయమును బోనివ్వవలసినవాఁడాయెను. చీకటిలో నడువవలసివచ్చినప్పుడెల్ల హాయశ్వము దారి తెలియకపోవుటచేతనో మార్గమున కడ్డముగబడియున్న కఠినశిలలతా కుడులవలననో లేక గాలివీచుటచే వెదురుపొదలయందుద్భవిల్లు "కిఱ్ఱు" మనుశబ్దముననో మిగులభయపడి బిగ్గరగ సకిలించుచుండును. ఇప్పట్లున నాపాంథుఁడుపోవుచున్నమార్గ మతిదుర్ఘట

మైయుండెను. అంధకారమున దనయశ్వమొక్కయడుగైనని డక యూరక సకిలించుచుండెను. అందుచేనతఁడు సేయునదిలేక "మిత్రమా! ఇబ్రహిమూ! నీవు నాకునియమించినకార్యము ను జేయగలనో లేనో తెలియకున్నది తెల్లవాఱులోపల నేన తిదూరముగనరుగకున్న నాయుదంతమును శత్రువు లొకవేళ గనుగొందురేమో యని యేదోయనబోవునంతలో నతఁడొక శబ్దమునువినెను. ఆసవ్వడెద్దియైనది బాగుగవినగోరి యూశా టసారి తనగుఱ్ఱమును గదలనియ్యకుండ కళ్లెమునుబిగియఁబట్టి వినుచుండెను. అతఁడాశబ్దమును మఱియొకతూరి వినినవెంటనే భయానకమానసుండై తానప్పుడప్పెనుకాన లోని పులికోన లోననున్న లొఱంగి దారిదప్పివచ్చినందుల కెంతయుఁ జింతిల్లు చు బిరబిర తనహయంబునుండి దిగుట కుంకించెను గాని తన గుఱ్ఱముసహితమాశబ్దమునువినినందునగాబోలునది తుల్లిప డుటచే నతఁడట్లొనర్ప లేకపోయెను. వెంటనే యతఁడు తనగుఱ్ఱ మునుండి క్రిందికిదుమికి దానినిబట్టుకొని వేఱొకవంకకు లాగు కొని పోవుట కుద్యమించెనుగాని వారువం బించుకైన గదలలే దు. అతఁడు మఱల నాశబ్దమును మఱింతచేరువనుండి వినెను. "దైవమా! నేఁడు నేనీపులివాతఁబడకతప్పదు. ఏమిచేయుదున ని చెప్పుచు ధైర్యమవలంబించి తనచేతనున్న కొఱడాతోఁదన గుఱ్ఱమును బాదఁగొట్టెను. అంతనది తనకుకొంచెము స్వా ధీనముకాఁగా నాబాటసారి దానిని బలవంతముగాలాగుకొని యరణ్యమునకడ్డముగఁ జెట్లసందులలోఁబడిపోవుచుఁ గుట్టతుద

కు దైవవశమున దానొకబకులుగను ప్రదేశమునఁ జేరెను.

అప్పటికి రాత్రి దాదాపుమూడుగంటలకాలమగుటచే నింకను బిండియారబోసినట్లు వెన్నెలగాయుచుండెను. ఆబయలులో నుత్తరపుదిక్కునకొక చిన్నరస్తా మనబాటసారికగుపడినది. ఆతనియుత్సాహమునకు మేరలేదు. తాఁబోవలసినమార్గమదియని యతఁడు దెలిసికొని వెంటనే తన తురంగము నెక్కి కశాఘాతంబున దానింబోనిచ్చెను! మార్గము చక్కఁగఁ గనుపించుటచే గుఱ్ఱంబును నతిసత్వరంబుగఁ జనుచుండెను. అంతనతఁడారస్తానుజేరి యొకమైలు దూరముపోవునప్పటికిఁ దనకెదురుగా నెవరో నలుగురాశ్వికులు వచ్చుచున్నట్లతఁడు కనుగొని యించుక వెఱగొంది తనయొద్దనున్న యేవో యొకటిరెండు వస్తువులను బదిలపఱచుకొని గమనమును సాగించుచుండెను.

అంతనైదాఱునిముసములలో నావచ్చుచున్న యాశ్వికులు బాటసారిసన్నిధించి వెన్నెలకాంతిచే నతని ముఖవిలాసములఁ బట్టియు,నుడుపులనుబట్టియు, నతఁడొక మహమ్మదీయునిగ నెంచి వెంటనే "నిలునిలుము, నీనివాసమెద్ది? రాత్రి యింతప్రొద్దుండగనే నీవిట్లు ప్రయాణముచేయుటకుఁ గతంబెయ్యది?" యని యతనిని గద్దించి యడుగుచు నడ్డగించిరి. అంత నామహమ్మదీయుఁడు "నానివాసము హైదరాబాదుపట్టణము. ఇక్కడికి సుమారైదాఱుమైళ్ళదూరములోనుండు నొకగ్రామమునకు గొన్నిపనులుండుటంబట్టి వెళ్ళుచున్నాను, నన్నిట్లడ్డగించుటకుఁ గారణంబేమి?

మొదటివాఁడు ;—ఎవరైనను మహమ్మదీయజాతి వాఁడు మాదృష్టిపథమునబడిన వాని విషయమైమాకించుక సందేహముగలిగినచో వానిని బట్టుకొనివచ్చునట్లు మా రాజు మాకాజ్ఞనొసగియున్నాఁడు. మఱియు —

రెండవవాఁడు.—మిత్రమా! యీనీచునితో నింత ప్రసంగమేల; వీనిచర్యలనుబట్టిచూడ నీతఁడెవఁడో గూఢచారునివలెఁ గన్పట్టుచున్నాఁడు. కాకున్న నింతదగ్గరనుండు గ్రామమున కీరాత్రిలోఁబ్రయాణము చేయవలయునా? ముందువీనిని బట్టుకొని రాజుగారివద్దకుఁగొనిపోవలయు"నని యతఁడనునంతలో నామహమ్మదీయుఁడువారి నుండి తప్పించుకొని పాఱిపోఁ బ్రయత్నించుటకుఁ దనగుఱ్ఱమునకు సంజ్ఞచేసెనుగాని మిగిలిన యాశ్వికులిద్దఱును నతనికడ్డమువచ్చి వానిప్రయత్నమునకు భంగముగలిగించిరి. వెంటనే యానలుగురుగుఱ్ఱపురౌతులును గోశోన్ముక్త కృపాణపాణులై "ఓరీ! తప్పించుకొనిపోఁ జూతు వేని నీకుఁజావుమూడినదనుకొనుమని చెప్పుచు నామహమ్మదీయుని వెంటబెట్టుకొని పయనము సాగించిరి.

# అయిదవ ప్రకరణము

పైఁ బ్రకరణమున వచింపఁబడిన ట్లా యాత్రికులున లువురును నామహమ్మదీయుని వెంటబెట్టుకొని తాముచనుచున్న రస్తా మీఁద నేకొంతవఱకుఁ బ్రయాణమై పోయి పిమ్మట నా మార్గము నుండి చీలిపోయిన వేఱొక బాటలోఁ బోవుచుండిరి. వారి వెంట ఖయిదీవలెఁ జను చున్న యామహమ్మదీయునికిఁ జెప్పరాని కోపముప్పతిల్లుచున్నందున దన్నుఁ బరివేష్ఠించివచ్చు నట్టి యానలువురిని భూమికిఁ బలివెట్టనెంచి తనయుడుపులలో క్లుప్తముగ నుంచఁబడిన కృపాణముపైకిఁ దనహస్తములను బోనిచ్చెను గాని యతని కేమి తట్టెనో తత్ప్రయత్నమునుండి యతఁడువిరమించుకొనెను. ఒకవేళనతఁడు ఖడ్గమును బయటదీసి వారితోఁ బోరాడినను తనకంటె బలవంతులుగను. శూరులుగను, యౌవనవంతులుగను గన్పట్టుచున్న యానలుగురొకటియైన నామహమ్మదీయుఁ డేమిచేయగలఁడు? అతఁడు తన స్వాతంత్ర్యమునకై యెన్నియుక్తులఁబన్నినను నవి కార్యరూపమున బరిణమిల్లకుండుటచే నతఁడు సేయునదిలేక యాయువకుల వెంటఁబోవుచు వారు మాట్లాడుమాటలలోఁ గొన్నిటిని మాత్ర మతిజాగరూకతతో వినుచుండెను. అంతఁ గొంతసేపటికిఁ దావిన్న గొన్నిమాటల కతఁడు భయభ్రాంతుఁడై యేమితలచెనో కాని తన చొక్కా జేబునందు

రహస్యముగనుంచబడిన జాబును దనవద్దనున్నవారికిఁ దెలియకుండ బయటఁదీసి చింపివారవేయ నెంచి యాలేఖను మెల్లగ వెలికిఁదీసెను. ఆనలుగురుయువకులలో నొకరు దీనినంతయు బాగుగ గమనించుచు "ఓరీ! యా కాగితమేమని యతనికిసమీప దగ్గరగవచ్చునంతలో నతఁడాజాబును గానకతునకలుగఁ జింపి రస్తాకుఁ బ్రక్కగనున్న ముండ్లపొదలోఁ బారవైచెను. వెంటనే యాశూరుఁడు తన హయంబునుండి క్రిందికిదిగి యాపొదవద్దకుఁబోయి పొదకీవలివైపునఁ బడియున్న రెండుమూడు కాగితపుముక్కలనుమాత్రమేరి పదిలపఱచుకొని తనయశ్వము నెక్కెను. దీనినంతయుఁ గనుచున్న తక్కినవీరులు ముగ్గురును దమ మిత్రునిచేతలకు సంతసించి యామహాస్మదీయుఁడెవఁడో ప్రబల రాజద్రోహియనియు నట్టివానిని దమయేలికకడకుఁ గడుజాగరూకతతోఁ గొనిపోవలయుననియు నెంచి వానివెన్నంటి తమగుఱ్ఱములను నడిపించుచుండిరి. ఆనాలవవాఁడును దానేరి తెచ్చిన కాగితపుముక్కలలోని కొన్నిశబ్దములను గుఱించిన విషయములను వారికిఁ దెల్పుచు వారివెంటఁ బోవుచుండెను.

అట్లు వారందఱు బాగుగఁ దెల్లవాఱుసరికొక మైదానములోఁ బోవుచుండిరి. చూపుమేరదూరములో వారికిఁ గొన్నిగుడారములు గాన్పించినవి. ఆనలుగురువీరులును వారుచేరవలసినస్థలమును సమీపించినందున సంతోషాక్రాంత స్వాం

తులగుచుండిరి. కాని యీమహమ్మదీయుఁడు మాత్రము భయభ్రాంతుఁడగుచుండెను. వారందఱా గుడారములను సమీపించుకొలదిని యీ మహమ్మదీయుఁడు దనచూపును గుడారములవైపు దప్ప వేఱొకవంకకు మరల్పలేదు. రాత్రియంతయు నిద్రించుచుండిన మనుజు లాగుడారములనుండి బయటకరుదెంచుచుండిరి. గుడారములకు దక్షిణపువైపున వేలకొలది గుఱ్ఱములు పచ్చికమేయుచుండినవి. వాటికిఁ జేరువుగనే వందలకొలంది మత్తగజంబులు దమమావటీల యాజ్ఞలకు లోబడివర్తించుచుండినవి. గుడారముల కన్ని వైపులను జనులీమొడకామొడకు బరుగెత్తుచుఁ దామా సమయమునకుఁ జేయవలసిన కార్యములయం దప్రమత్తులై పనిచేయుచుండిరి. కొందఱు శూరశిఖామణులతిత్వరితంబుగఁ బ్రాతఃకాలకరణీయంబులం దీర్చుకొనుచుండిరి. వీటినన్నిటిని చక్కఁగ నవలోకించుచు గుడారముల కతిసమీపముగ వచ్చుచున్న యీమహమ్మదీయుఁడు" ఆహా! ఎన్నిగుఱ్ఱములు; ఎన్నియేనుగులు! ఎంతకాల్బలము! ఔరంగజేబుకు సహితమింత సైన్యముండదని తలంతును ఇంతపెద్దసైన్యము హైదరాబాదుపట్టణమునకు సమీపమున విడిసియున్నందులకుఁ గతంబెయ్యది ? తానీషాచక్రవర్తితో సంగర మొనరింప నిచటికెవ్వరైన నరుదెంచియున్నారా? ప్రస్తుతము నామిత్రవర్గముదప్ప నాతనికెవ్వరును శత్రులులేరు. అయిన నెవరో తెలియుగలదని తలంచునంతలో వా

రందఱాగుడారములను జేరుటచేఁ దమహయంబులనుండి దిగిరి.
వారిరాకకై యెదురుజూచుచున్న సేవకు లాక్షణంబున వారి
కడ కరుదెంచి గుఱ్ఱంబులంబట్టుకొని నిలిచిరి. అంతమఱికొంద
ఱు సేవకు లచటికి రాగా నావీరులలోనొకఁడు వారింజూచి
"ఓరీ! యీమహమ్మదీయుని గొంపోయి రాజుగారున్న గుడార
ముకడ నిలువఁబెట్టుఁడు. ఆతనిగుఱ్ఱమును దీసికొనిపోయి కట్టి
వేయుఁడని" వారి కాజ్ఞయొసఁగి తనసహచరులతోఁగూడఁ దా
నొకగుడారము లోనికిఁ బోయెను.

పిమ్మట నాసేవకు లా మహమ్మదీయునిం దోడ్కొనిపో
యి, నియమితస్థానమున నిలిపి యతనిచుట్టును గావలిగాచు
చుండిరి. ఆవల నొక యరగంటకాలములో గుడారములోనికి వె
ళ్ళిన నలుగురు వీరులును నామహమ్మదీయుఁడు నిలచి యున్న
పెద్దగుడారమువద్దకరుదెంచి ద్వారముకడ నిలిచియుండిరి. ఇం
తలోఁ గొంతసేపటికి "శివాజీరాజుగారికి జయమగుగాక" య
నువాక్యములు లోపలనుండి ప్రతిధ్వనించినవి. వెంటనే యాన
లువురువీరులును నాగుడారములోనికిఁ జనిరి. వారి యేలికయు
నొకగద్దియపైఁగూర్చుండి తద్దయుసంతసంబున దనవద్దనున్న
మంత్రులతో మాటలాడుచుఁ దామాదివసంబున జేయవలసిన
కార్యములను గుఱించి యాలోచించుచుండిరి. అంతనతఁడు
దనకు సమీపమున ముకుళితహస్తులై నిలువంబడియున్న నాన
లుగురుయువకులనుజూచి " మీరఱిగి యొనర్చిన కార్యము

లెన్ని? చక్కఁగఁదెలియఁ జేయుఁడ' నెను. అంతవారిలో నొకఁడు
“రాజచూడామణీ! మీయుత్తరువు మేరకు మేము రాయఘుర్
కోటను జేరితిమి. అందు తిరుమలరావతి జాగరూకతతో మె
లంగుచు రాజ్యమును గాపాడుచున్నాఁడు. మనకువలసినపుడు
సైన్యంబులను దప్పక పంపెదనని వచించి యున్నాఁడు. మఱి
యు మేమచ్చటనుండి మఱలవచ్చునపుడు మార్గమధ్యమున
నొకమహమ్మదీయుని సంధించితిమి, వాఁడెవఁడో రాజద్రోహి
యగు గూఢచారుఁడివలెఁ గన్పట్టుచున్నాఁడు, అతని నివాసము
హైదరాబాదట, అతఁడు మాచేఁజిక్కి మా వెంటవచ్చునపుడ
తని వద్ద రహస్యముగ దాచబడిన జాబునొకదానిని మెల్లఁగఁ
దీసి చించివేయునపుడు దానిని గనిపెట్టి యాలేఖను నూడబె
రుకుటకుఁ బ్రయత్నించితిమి కాని యాకాగితపుముక్కలనతఁ
డొకముండ్లపొదలోఁ బారవేయుటచే నవిమాకుఁజిక్కినవి కావు
అయినను బొదకీవలివైపునబడియున్న రెండుమూఁడుముక్కల
నేరి తెచ్చితిమి. ఏలినవారు వాటిని బరీక్షింపవచ్చునని తనవద్దఁ
బదిలముగ దాచఁబడియున్న కాగితపుముక్కలను దనచేనికి
నొసంగెను. శివాజీరాజా కాగితపుముక్కలను జక్కఁగఁ దిల
కించి కొంచెము సేపాలోచించి “ఆదుర్మార్గుఁ డిప్పుడెక్కడను
న్నాఁడు ? ఈతక్షణమే వానినిచటికిఁ గొనిరమ్మని” వానికా
జ్ఞాపించెను. వెంటనే యాయువకుఁడు వెలుపలనున్న మహమ్మ
దీయుని గొనివచ్చి రాజుకడనిలిపెను. ఆజానుబాహుఁడును

విశాలవక్షుఁడును నై కోరమీసంబులుం గలిగి, కుటిలభ్రుకుటియై, శత్రుజన భయంకరుఁడుగఁ గన్పట్టు శివాజీరాజును నామహమ్మదీయుఁడు చూచినవెంటనే భయభ్రాంతుఁడై గడగడ వణంకుచు నవనతమస్తకుఁడై నిలచియుండెను. అంత శివాజీవానిం జూచి "దుర్మార్గా! నీనివాసము హైదరాబాదు పట్టణమని నీవు మావారితోఁ జెప్పినట్లువింటిని. రామరాజ్యమును బోలిన తానీషారాజ్యమున నీబోటి దుర్మార్గులు సహితమున్నందులకు నాకుదుఃఖము వచ్చుచున్నది. (మఱల నతఁడా కాగితపుముక్కలను వేళ్ళతోఁ జదువుచు) నీచాధమా! యింకదానియందు "ఔరంగజేబునకు మిత్రుఁడ" ని వ్రాయఁబడియున్నది. తరువాత నేమి వ్రాయఁబడియుండెనో తెలియదు. ఓరీ! నాకు గర్భశత్రువగు నౌరంగజేబు మీకెల్లరకునుమిత్రుఁడాయెనా? అతని కివరాజాబు వ్రాసినది. మఱియు నింకొక కాగితపుముక్కపై కాగితముచినుగుటచేఁగొన్నియక్షరములు లోపించగమిగిలినవి "దువ్వులనియు" దానిక్రిందుగ 'దన్నల'నియు వ్రాయఁబడియున్నది. మొదటి శబ్దమునకుముందు 'హిం' అను యక్షరము పోవుటచే నది 'హిందువులని' నిర్ధారణచేయవచ్చును. రెండవ శబ్దమునకుముందు 'మా' యని యుండునుగాఁబోలు. అయిన నాపదము 'మాదన్నల' ని తేలగలదు. ఇంకను దానికిఁ బూర్వము 'అక్కన్న' యని వ్రాయఁబడియుండినందున నాశబ్దమంతయును 'అక్కన్నమాదన్న' లని తేలుచున్నది. ఓరీ! పాతకీ! హిందువులపైఁ దానీషాకుఁగలప్రేమచే నక్కన్నమా

దన్నల కున్నయోద్యోగముల నిచ్చెదనను నభిప్రాయమును దెలియఁ జేయుచుఁ గాఁబోలు నీమిత్రుఁడా నీచునకు వ్రాసినది. ఈమూడవముక్కపై 'నముగల' యని మాత్రమున్నది. 'మానముగల' యనియగునా ? కాదు. 'అభిమానముగల' యనియుండవలయును. ఎవ్వరిపైనభిమానము అదియునుగాదు. ఓహో! తెలిసెను. " మతాభిమానముగల" యని యుండవలయును. ఆక్రూరుఁడు మహమ్మదీయమతాభిమానిగదా ! ఆపదమునకుఁగ్రిందుగ 'న్యమునంపి" అనియున్నది. ఈశబ్దము 'సైన్యమునంపి" యనియుండునని తద్దయుగద్దించి పలుకుచుఁ దనగద్దియనుండి లేచి " ఓరీ ! నీచుఁడా ! స్వమతాభిమానము గలిగివర్తించుచున్న ఔరంగజేబే సైన్యమునంపి మీకుసాయమొనర్చి తానీషానోడఁగొట్టును లెమ్ము. చూచెదనుగాక. మఱల మొగలులతో సంగర మొనరింపఁ గాల మాసన్నమైనదని పలుకుచుఁ జెంతనున్న సేవకులనుజూచి "ఓరీ! యీక్రూరుని యుడుపులనుదీసి చక్కఁగఁ బరీక్షింపుడన వారట్లే యొనర్చిరి. వారికతనివద్ద నొక ఖడ్గము మాత్రమేచిక్కినది. వారుదానిని శివాజికడనుంచిరి శివాజివారింజూచి "ఓరీ ! తానీషారాజుగారునన్ను దర్శింపనేఁడిటకు వత్తురని యతనిప్రధానమంత్రియగు మాదన్న నిన్నటిదినము వచించిపోయెను. వారిచ్చటికి వచ్చువఱకు వారాజద్రోహిని గొంపోయి వేఱొకచోటనుంచుడు. పొండనియుత్తరువుచేసెను.

పిమ్మట శివాజీరాజేంద్రుని కడకొక సేవకుఁడరుదెంచి 'రాజేంద్రా! తూర్పువైపున నున్నడేరా బాగుగనలంకరింపబడినది. బయటనుండివచ్చినమట్టుకుఁ బుష్పఫలాదులను, జందనాదివాసన ద్రవ్యములను సిద్ధముచేసి యుంచితిమి. భోజన పదార్థములన్నియుఁ బ్రత్యేకముగ వండఁబడి సిద్ధముగనున్నవని వచించెను. అందులకు శివాజి కడుసంతసించి "ఓరీ! నీవింకను నొనరింపవలసిన కార్యములం దప్రమత్తుఁడవై మెలంగుము, పొమ్మ" నునంతలో మఱియొక యువకుఁడచటికిఁ బరుగెత్తుకొనివచ్చి "మహాప్రభో! తానీషాచక్రవర్తియు నతని మంత్రులగునక్కన్నమాదన్నలును దమపరివారముతో భవదీయదర్శనార్థమై యరుదెంచుచున్నారను" చుండ నంతలో బంగారు నగలచే నలంకరింపఁబడి పంచకల్యాణి నాబరగు నొకజవనాశ్వము నొకసేవకుఁడు దీసికొనివచ్చి యచట నిలిపెను. అంత శివాజి యావాజినెక్కి మంత్రులుమున్నగువారు దన్ను బరివేష్టించిరాగాఁ దానీషా రాజున కెదురుజని యతనినాహ్వానించుటకు బయలువెడలెను. తానీషారాజును నొకమత్తగజంబుపైన ధిరోహించి వచ్చుచుండెను. ఆతనికిఁ బిరుంద నక్కన్నమాదన్నలు వేఱొక దిగ్గజంబుపై నెక్కి యరుదెంచుచుండిరి. వారి వెనుకఁ గొందఱుద్యోగులుజవనాశ్వములపై నెక్కివచ్చుచుండిరి. వీరినందఱిని శివాజీరాజుమార్గముననే గలసికొని యుచితసత్కారముల వారిని దనగుడారములవద్దకు బిల్చుకొనిపోయెను. పిమ్మట శివాజియు, దానీషాయును, నక్కన్నమాదన్నలును

గలసి వారికై ప్రత్యేకముగ నలంకరింపఁబడియున్న డేరాలో
నికేగి యుచితాసనంబులగూర్చుండి కుశలప్రశ్న పూర్వకంబు
గాఁ గొంత సేపువఱకు మాట్లాడుచుండనప్పటికి దాదాపు పది
గంటల ప్రొద్దగుటచే శివాజి, యక్కన్న మాదన్నలను, తానీ
షానుదిలకించి "భోజనమునకు వేళ మించిపోవుచున్నది. భోజనా
నంతరమున నేను మీతోఁ జెప్పఁదలచుకొన్న విషయముల నె
ల్లవచింతునని" చెప్పుచు దత్కాలోచిత పరిచర్యలనొనర్చుటకుఁ
గొందఱు సేవకులను వారికినియమించి తనస్థానమునుండి లేచెను
వెంటనే యచటనున్న వారందఱును భోజనశాలకరుగుటకై
యాస్థలమును వీడిరి.

వారందఱు భోజనమైన వెనుకఁ గొంతవిశ్రాంతిదీర్చు
కొనునప్పటికి మధ్యాహ్నము దాదాపు మూడుగంటలు కావ
చ్చు చుండెను. శివాజియు. తానీషాయును, అక్కన్నమాదన్న
లును దామిదివఱకుఁగూర్చొని మాట్లాడిన గుడారములోనికిఁ
బ్రవేశించి వారినియమితాసనంబులనలంకరించిరి అంతఁ దానీషా
"శివాజీరాజా ! రాయఘుర్ కోటనుండి మీసైన్యములతోఁ గ
ర్ణాటకముపై దాడివెడలి వచ్చి యున్నను నాయిష్టానుసారము
మీరిచటనిల్చి నాకు దర్శనం బొసంగినందులకు నేనెంతయుఁ గృ
తజ్ఞుఁడను. మీధైర్యసాహసములను, స్వదేశాభిమానమునుబలు
మారు మాదన్నగారివలనవిని యచ్చెరువొంది మిమ్ముల నొక
తూరియైనదర్శింపవలయు ననికోరిక నేటికి సఫలమైనందులకు

సంతసించు చున్నా"న నెను. అందులకు శివాజి "తానీషా రాజా! మీకుఁగలహిందూమతాభిమానమునకును, హిందూమహమ్మ దీయసఖ్యత కై మీరొనరించు యత్నములకును, మీ ప్రధాన మంత్రులగు నక్కన్న మాదన్నలు మీకు సర్వవిధములఁదోడ్ప డుచు మీ యెడ జూపురాజభక్తికిని కడుంగను సంతసించితిని. నాయెడ వాత్సల్యముఁగల మీరు నాకుదర్శనం బొసంగినందులకు సంతసిల్లు చున్నాను. మఱియు మీ పట్టణమున మీ పైఁ గత్తు బూనియున్న రాజద్రోహులు గొందఱున్నట్లు నేఁడే కనుగొంటిని. వారిలో నొకని మీరిప్పుడే చూడఁగలరని చెప్పి వానింగొనివ చ్చుటకుఁ దనసేవకున కాజ్ఞయొసంగెను. వెంటనే వారా రా జద్రోహి ని గొనివచ్చి శివాజీచెంత నిలువఁబెట్టిరి. శివాజీరా జునకుఁబ్రక్కగనే కూర్చునియున్న తానీషాను, అక్కన్న మా దన్నల నతఁడుచూడగనే గుండెఝల్లుమన నతఁడుతనశిరమును వంచి నిశ్చేష్టితుడై నిలువఁబడి యుండెను. వానినిజూడగనే తానీషాకుఁ జెప్పరానికోపముప్పతిల్ల తనకరవాలము నూడ బెఱికి వానిపై కుఱుక యత్నించి "ఓరి! దుర్మార్గా! హామీ రుఖానుఁడా! నీవెట్లీరాజేంద్రుని చేతులలోఁజిక్కితివి? శివా జీరాజా! నీఖడ్గముచే వీని నప్పుడేయమసదనమున కనిపియుం డకపోతిరా" యనునంతలో శివాజియారాజద్రోహునివిషయ మై జరిగిన సంగతినంతయుఁ జెప్పి తనచెంతనున్న కాగితపు ముక్కల నతనికిని, యక్కన్న మాదన్నలకును జూపి యప్పటి

కాముక్కులపైఁ గాఁబడుచున్న శబ్దములయొక్క భావమును దాఁదలఁచినట్లు వారందరికిఁ దెలియఁజేసెను. వారందఱు శివాజీ యూహాలకు మిగుల సంతసించుచుండ పట్టణములోని రాజద్రోహులొనరించు దుష్కార్యములకు మిగుల జింతించిరి. అంత తానీషా మాదన్నతోఁ గొంతసేపు మాటలాడి సేనసేవకుల రావించి "ఈ రాజద్రోహిని పట్టుకొనిపోయి చెఱసాల యందుంచుఁడ" నెను. వారాజాజ్ఞానుసారము తత్క్షణమే హైదరాబాదునకుం గొంపోయిరి. పిమ్మట తానీషా "శివాజీచక్రవర్తీ! మీ రిట్టి రాజద్రోహిని గనిపెట్టి శత్రువుల యంతరంగమును గొంతకనుగొని మాకు దెలిపినందులకు మేమెంతయుఁ గృతజ్ఞులము. ప్రజలహితముకై నాయొనర్పం బూనిన కార్యములన్నియు నీదుర్మార్గులవలన సఫలీకృతంబు లగుట లేదు. తుదకొకవేళ నేనానీచుఁడగు నౌరంగజేబుతో సహితముగా బోరాడవలసి యున్న దేమో! యెవరెఱుంగుదురు. అయినను శత్రుజనభయంకరులును, మహాకరణప్రియులును నగు మీవంటివారి కృప నాపై బూర్ణముగనుండ నా యధముఁడేమి చేయఁగలఁడు" నెను. అందులకు శివాజీ "తానీషా రాజేంద్రా! నాకాగర్భశత్రువగు నౌరంగజేబు మీపైకి దాడి వెడల వచ్చిన నేనూరకుందునా! మీకుఁ దప్పక సాయ మొసఁగెద" నెను. అంతఁ దానీషా "రాజా! మీరు మాయెడఁ జూపిన గౌరవమునకును ననురాగమునకును గారణము మా పురాకృతపుణ్యవిశేషమొక్కటి

దక్క వేఱుగాను. మఱియు మిమ్ముల నొక్కటి గోరుచున్నాను. మీరు మాపట్టణమున కరుదెంచి మేమొసఁగు నతిథిసత్కారములను గైకొని పోవలయును. మీరుమా రాజధానికతి సమీపమునకువచ్చియు నుటచే మేమట్లుకోరెదమనెను. అందులకుశివాజి "మిత్రమా! మీరొసఁగు నాతిథ్యమునుస్వీకరింపఁగూడదసికాదు. ప్రస్తుతము నేను నాసైన్యముల వెంటఁబెట్టుకొనియు చిరకాలములో గర్ణాటకముపై దాడి వెడలవలసియున్నది. వెంకాజియను నాసోదరుఁడు మాతండ్రి కిదివఱకు లోఁబడియున్న రాజ్యమునంతటిని స్వాధీనమొనర్చుకొని, నన్నుదృణీకరించి, గర్వోన్మత్తుఁడై కన్నుగానక, విఱ్ఱవీగుచున్నాఁడు. నేనతనిని సంగరంబుననోడించి యతనికి లోఁబడియున్న రాజ్యమునుగైకొని మఱలివచ్చునపుడు మీరాజధాని కరుదెంచెదనని" చెప్పెను. కాని తానిషాయును నతని ప్రధానులును నందులకియ్యకొనక శివాజిని తమ రాజధానికి విజయము చేయునట్లు పలుమఱు ప్రార్థించుటచే శివాజి యందులకొప్పుకొనెను. అప్పటికి సాయంకాల మయిదు గంటలు కావచ్చుటచే శివాజి యతని ప్రధానమంత్రులను వెంటఁబెట్టుకొని తానీషారాజేంద్రునితోఁ గూడ హైదరాబాదునకుఁ బ్రయాణము సాగించెను.

# ఆఱవ ప్రకరణము.

మడికొలనువద్ద మహమ్మదీయుఁ డొనరించిన దుండగములను మాదన్న తానీషాగారికిఁ దెలియఁజేసి రాజు నాజ్ఞ ననుసరించి వానినింకను నతికఠినముగ శిక్షించినది మొదలు మహమ్మదీయు లొనరించు దుష్కృత్యములు మిక్కుటమగుచుండెను. హామీరుఖానుఁడొనరించిన కార్యమునకు సహితము దమవద్ద సేనాధిపత్యమును వహించియున్న ఇబ్రహీము మూలకారకుఁడని తానీషాయును అక్కన్న మాదన్నలును సూక్ష్మముగఁ దమగూఢచారులవలన నెఱింగిరి. అది మొదలిబ్రహీమును దన యుద్యోగమునుండి తొలగింపవలయునని తానీషా మాదన్నతో నప్పుడప్పుడు చెప్పుచుండెను. కాని మాదన్న తానీషాగారితో "ఇంకను వాడొనరించు దుష్కృత్యముల నెల్లఁ గనిపెట్టవలయును. నిజము నిలుకడమీఁదఁగదా తెలియును. ఇప్పుడే వానిని దన యుద్యోగము నుండి తొలగించిన రాజధానిలో లెక్కకు మిక్కుటంబగు దుండగములు ప్రవర్ధిల్లఁగలవని" చెప్పెను. మఱియు హామీరుఖానుఁడు తానీషాకుఁ జిక్కి చెఱలోఁ బెట్టఁబడెనను సంగతి యిబ్రహీమునకుఁ దెలియవచ్చినది మొదలు 'తోఁకద్రొక్కిన నాగసర్పము'వలె నతఁడు మం

డికొనుచుండెను. వాఁడొనరించు క్రూరకృత్యముల కంతము లేదు. నిరంతరము దన్నెడబాయని స్నేహితులతోఁ గలసి తన యింటివద్ద నేమేమో యాలోచనల సల్పుచుండెను.

ఒకనాటి సాయంకాలమున వాడుక ప్రకారము ఇబ్రహి ము తనయింటివద్దఁ గూర్చుండి తనమిత్రులతో నేమేమోమా టాడుచుండగా దాను జెప్పినమాటల కొకడు "మిత్రమా! మా దన్న విధించినశిక్షకంటెఁ దానిషా హైదరు నతి కఠినముగ శి క్షించెను. రాను రాను తానిషాకు హిందువులయెడ ననురాగము హెచ్చుచున్నది. బ్రాహ్మణులన్న నతనికి దైవసము" లనెను.

మఱియొకఁడు—మాదన్న విధించిన శిక్షకంటె రెండిం తలధికముగఁగదా తానిషా హైదరునకువిధించినది? హైదరును విడిపించుకొని వచ్చితివిగదా?

ఇబ్రహిము:—నేనే నలువదిరూపాయలను జెల్లించి హైదరునువిడుపించుకొని వచ్చితిని. తానిషాయెడలఁ బైకి మం చిగ నటించుచు నాయుద్యోగమునకు సహితము పోవుచున్నా ను. సర్వసైన్యాధిపత్యము నాదేయగుటచే సైనికుల కందఱికిని నిప్పటినుండియు నవాబుపై నప్రియము గలుగఁజేసెదను. ప్రత్య క్షముగ నక్కన్నమాదన్నలకు సహితము లోఁబడినట్లు నటిం చెదను.

వేఱొకఁడు:—ఇబ్రహిము! నిన్ను నీయుద్యోగమునుండి తొలగించి సర్వసైన్యాధిపత్య మక్కన్నగారి కిప్పింపఁబడు

నని యొక వదంతి వ్యాపించుచున్నది. దీనికి నీవెట్లు వర్తింతువో తెలియకున్నది.

ఇబ్రహీము:—అట్లెన్నటికి జరుగదు. నన్ను ద్యోగము నుండి తొలగించిన అక్కన్న మాదన్నలు మని యుండఁగలరా? ఒకవేళ నట్లుజరిగిన దానిషాకు నేను బహిరంగశత్రువునే యగుదును. పిమ్మట నాతలంపులన్నియుఁ జక్కగ నెఱవేరఁగలవు మఱియుఁ దానీషా హిందువులయెడ నభిమానముతో వర్తించుట రాణిగారికించుకైన నిష్టములేదట అక్కన్నమాదన్నలయెడ సహిత మామె దురభిప్రాయమును గలిగియున్నది. అంతఃపురస్త్రీల కందఱికిని హిందువులన్న కడుపునఁ జిచ్చుపెట్టినట్లుండును. స్వమతాభిమానమునందును హిందూమతద్వేషమందును వారందఱౌరంగజేబునకుఁ దీసిపోవువారు కారు. మఱియు మొన్నటిదినము తానీషా మహమ్మదీయమతద్వేషియు, హిందూమతాభిమానియు, ఔరంగజేబునకు గర్భశత్రువునగు శివాజీని మనరాజధానికిఁ గొనివచ్చి యతనికి విందొనర్చుటయు మఱునాఁడు శివాజీ తనసైన్యంబుల వెంటఁబెట్టుకొని కర్నాటకముపైకి దాడి వెడలుటయు మీరు చూచియేయున్నారు. ఇట్లు తానీషా శివాజీతో సఖ్యముం గలుగఁ జేసికొనుట రాణిగారికిని యామె చెలికత్తెయలకును నెంతమాత్ర మిష్టములేదట. మఱియు నంతఃపురస్త్రీ లందఱికిని మా పక్షమునకు లాగవలసినట్లు

ను వారికిఁ దానీషాయెడ నప్రియము గలుగఁజేయవలసినట్లును
నాభార్యతోఁ జెప్పి పంపితిని. మిత్రులారా! అదేమి చిత్రమో
గాని నేనొనరించు యత్నములన్నిటికిని భంగముగలుగుచున్నది.
మనయాంతర్యమిత్రుఁడును నెంతటి దుర్ఘటమగుకార్యమునం
దైనఁదోడ్పడువాఁడునునగు మాదిరాదుష్టనఁడు చెఱయం
దుంచఁబడెనుగదా! ఆదుర్మార్గులగు శివాజీసేవకు లెంతటి
కార్య మొనర్చిరి. అయిననుఫలించినదిలేదు. అతఁడొనర్పవలసిన
పని నేనేయొనరించెదను. అదికడురహస్యమైనది. మీరుదానిని
వెలిఁబుచ్చితిరేని మన కందఱికినిముప్పువాటిల్లును. మఱియత్న
ములు విఫలములవును. జాగ్రత్తగ వినుడు. ప్రస్తుతము ఢిల్లీప
ట్టణము నేలునట్టి ఔరంగజేబు హిందూమతద్వేషి. అతనియు
ద్యోగస్థు లందఱును మహమ్మదీయులే. దేశమంతయునాక్ర
మింపఁదలచి యాతఁడు గోలుకొండను సహితము జయింపనె
త్నించు చున్నాఁడట. ఇదివఱకే గోలుకొండను జయింపఁదలచి
వచ్చి కొన్ని యసందర్భములచేఁబూర్వపురుతుబ్‌శాహాతో సం
ధియొనర్చుకొని వెళ్ళియున్నాఁడట. ఏవోకొన్ని కార్యములున్న
ట్లు మాదన్నతో జెప్పి యాతనికడ శలవుదీసికొని నేనుత్రేపుద
యముననే ఢిల్లీకిఁబ్రయాణమయిపోయి ఔరంగజేబును సంద
ర్శించి తానీషా హిందువులపక్షముజేరి, బ్రాహ్మణులయెడభక్తి
గలిగి, తురుష్కులను శిక్షించుచున్నాఁడనియుఁ దురుష్కరా
జ్యములోఁ దురుష్కులనిట్లు బాధపెట్టుట యన్యాయమనియు"

మొఱపెట్టెదను. దీనినే యొక కారణముగఁ దలచియాతఁడు తానీషాపై దాడి వెడలి రాఁగలఁడు. ఇంతలో మనమందఱము సైన్యమును జీలదీసి సైనికులందఱికిని నవాబుపై ద్వేషమును బుట్టించునట్లొనర్ప వలయును. ఎట్లైన నౌరంగజేబు సహాయమున మన రాజ్యమును మహమ్మదీయ రాజ్యముగఁ జేసినేయువలయునని" వారితో ధీరముగఁబలికెను. ఈయుక్తి కందఱును 'సరి సరి,యని సంతసించిరి. వారియుత్సాహమునకంతము లేదు. వారికి గోలుకొండ రాజ్యమధీనమైనట్లే యుండెను.

---

## ఏడవ ప్రకరణము.

అక్కన్న మాదన్నలను నీయన్నదమ్ముల నామములను మన తెలుగువారు రెండువందల సంవత్సరముల నుండియుగౌరవపూర్వకముగ స్మరించుచున్నారు. వీరియింటిపేరుపింగళివారు వీరిది భారద్వాజసగోత్రము అక్కన్న మాదన్నగారి వంశజులమని చెప్పుకొను పింగళివారిప్పుడు నైజాము రాజ్యములోని యోరుగంటిలో నున్నారు. వారు తెలుగువారు కావున అక్కన్న మాదన్నలను తెలుగుబ్రాహ్మణులనియే నిశ్చయింపవలసియున్నది.

అక్కన్నగారన్నయనియు మాదన్నగారు తమ్ముడనియు జనులుసామాన్యముగ ననుకొనుచున్నారు. కాని యక్క

న్నగారు నిజమైనయన్న కాఁడని యొక యైతిహ్యము గలదు అదెద్దియనిన; అక్కన్న యొక బీద బ్రాహ్మణ కుటుంబమునకు సంబంధించియుండెను. ఉదరపోషణార్థమాతఁడు పలుగ్రామములలోఁ దిరుగుచుఁ దుదకు మాదన్నగారు తానీషాయొద్ద మంత్రి పదవిలోనున్నాఁడని యాతని గృహమునకరుదెంచెను. తన భార్యకు సంబంధించిన చుట్టమని మాదన్నగారును, భర్తయొక్క బంధువుడని తలచి యాతని భార్యయు అక్కన్న గారిని మిక్కిలి మర్యాద చేయుచుండిరి. ఇట్లు చాలా కాలము గడచినది. అక్కన్న వయసులోఁ బెద్దవాఁడగుటచే మాదన్న యతనిని అన్నగారని పిల్చుచుండిరి. లోకులు సహితమట్లే తలంచుచుండిరి. ఇట్లుండ మాదన్నగారొక దివసంబున దనభార్యతో అక్కన్న గారి విషయమై ముచ్చటింపగా నామె యాతఁడు తనబంధువుఁడు గాఁడని తెలిపెను. పిమ్మట మాదన్నగారతనిని జేరఁబిలిచి 'అక్కన్నా! మనకుఁగల బంధుత్వమించుక తెలియఁ జేయుము. ఈవిషయమై మిమ్ముల నడుగఁదలచితిని. నాసప్రీతి దినము మఱచిపోవుచున్నానని చెప్పిరి. అందుల కక్కన్న "నాయనా! చెప్పెదవినుము నేను పెద్దమ్మ కుమారుఁడను. నీవుచిన్నమ్మకుమారుఁడవు. అట్లు మన మక్కసెల్లెండ్రబిడ్డల మగుటచే నన్నదమ్ములముసుమా! ఈరహస్యమునీమనస్సులో నుంచుకొనుము. నమున మెప్పటివలెనే యన్నదమ్ములచందమున బ్రవర్తించెదమని" నుడివెను. మాదన్న అక్కన్నబుద్ధి చాతుర్యమునకు మెచ్చి మిక్కిలి సంతసించియుటుపిమ్మటనక్క

న్నగారిని దనయన్నవలెనే మిక్కిలి ప్రేమించుచుండెనట.

పైవిషయములను గుఱించిన సత్యాసత్యము లెట్లున్నను మనచరిత్రకాలమున మాదన్న తానీషాయొద్ద ముఖ్యమంత్రిగనుండెను. అక్కన్న ప్రథమమున మాదన్నకు సహాయభూతుఁడై యుండెనుగాని పిమ్మట నతనికి సర్వసైన్యాధిపత్య మిప్పింపఁబడినట్లు చదువరు లెఱుంగఁగలరు. వీరిద్ద ఱేకమనస్సులోఁ బనిచేయుచు రాజ్యాంగ వ్యవహారములను జక్కపెట్టుచుఁ దానీషాకుఁ బలువిధముల సహాయ మొనర్చుచుండిరి. వీరుహిందువులయ్యును మహమ్మదీయుల యందభిమానముగలవారై యన్ని విషయములలోను మహమ్మదీయులను హిందువులను సమానముగఁ జూడసాగిరి. మఱియు నున్నతోద్యోగ్యములను మహమ్మదీయులకే యొసంగక హిందువులకుఁగూడ నొసగుచు రెండు జాతులవారికి నైకమత్యము గలిగించుటకై పాటుపడుచుండిరి.

గౌతమగోత్రుఁడగు పింగళి సూరన్నవంశమునకును అక్కన్న మాదన్న వంశమునకును సంబంధము లేదు అక్కన్నమాదన్నలు మహారాష్ట్రులనియు అక్కన్నగారికి "ఏకనాథ్ పంత" నియు, మాదన్నకు పేరు "మదనపంత్" అనియు పేర్కొండెనని కొందఱు మహారాష్ట్రులు వ్రాసియున్నారు. కానియందుకు వారేమియు నాధారము చూపినవారుకారు. పూర్వమహారాష్ట్ర బఖరు గ్రంథాదులలో అక్కన్నమాదన్న నామములే వాడబడియున్నవి అందుచేఁ దెలుఁగువారని చెప్పవలసియున్నది.

* పెద్దమ్మ కుమారుఁడనిన దరిద్రుఁడనియు, చిన్నమ్మయన్న లక్ష్మీదేవియనియు భావించి చిన్నమ్మ కుమారుడన్న లక్ష్మీపుత్రుఁడు అనఁగ ధనవంతుఁడని అక్కన్నగారు భావించియుండవచ్చును.

కాని రాజకులమునకు సంబంధించిన వారనియు, బలపరాక్ర మసంపన్నులనియు, శ్రేష్ఠులమని విఱ్ఱవీగుచు హిందువులను దిరస్కరించుచున్న తురుష్కులుగొందఱుమాత్రము మాదన్న స్థాపించుచున్న హిందూ ముసల్మానుల సామ్యముంజూచి యోర్వలేక పోయిరి. అందుచే నక్కన్న మాదన్నలకనేకమందిశత్రువులుద్భవించిరి. ఏదియెట్లున్నను తానీషామాత్రము వీరియందు దృఢమైన విశ్వాసమును గలిగియుండెను. వీరిమాటకడ్డు లేదు. శత్రుసేనలవలని భయముద్భవించినప్పుడు సహితము వీరేయితరరాష్ట్రముల వారితో సలుపవలసిన యేర్పాటులన్నిటిని స్వాతముగా నెరవేర్చుచుండిరి.

ఇవ్విధంబున నభ్యస్తసమస్తవ్యవహారదక్షు లనిపించుకొనిసర్వాధికారముతోఁ బ్రభుత్వము చేయుచున్న యీమంత్రిపుంగవులయనుగ్రహము వడయవలయునని మనదేశీయులే కాక విదేశీయులగు ఫ్రెంచి యింగ్లీషువారు కూడ మిక్కిలి యత్నించుచుండిరి. ఆకాలమున నీస్టిండియా కంపెనీవారు చిన్న వర్తకులు. వారు మన హిందూదేశములో నంతబాహుళ్యము లేక వర్తకము చేయుచుండిరి. చెన్నపట్టణమపు డొకచిన్నగ్రామము. ప్రస్తుతము జార్జిటవున్ అనఁబడు స్థలముమాత్రము కంపెనీవారి యధీనమందుండెను. మచలీపట్టణమునందుఁగూడ వీరికొకగిడ్డంగియుండెను. ఈస్థలములన్నియు గోలుకొండరాజ్యములోనివగుటచేఁ గంపెనీవారు గోలుకొండ నవాబునకుశిస్తు

చెల్లించుచుండిరి. మఱియు గోలుకొండ రాజ్యమున నిరాటంక ముగ వ్యాపారమొనర్చుటకుఁ గంపెనీవారు నవాబువద్దనుండి యనుమతి పత్రమునుబొందవలసి యుండెను. అందుచే సర్వాధికారమును వహించియున్న యక్కన్న మాదన్నల యనుగ్రహమునుపొందుటకై కంపెనీవారు విశ్వ ప్రయత్నములు చేయుచుండిరి. 1678 సంవత్సరమున తానీషాయును, మాదన్నగారును మచిలీపట్టణమునకు విజయము చేయగా వచ్చుటనుండు యింగ్లీషువారు వారిని మిగులగౌరవించి వారి యనుగ్రహము వడయుటకై వారికనేకబహుమతుల నొసంగిరి మఱియు1679 సంవత్సరముఫిబ్రవరి నెలలోఁ జెన్నపట్టణములోనున్న యింగ్లీషువారు తమకుస్యాంథోం (మైలాపూరు) ఎగ్మూరను స్థలములను గౌలుఁ కిప్పించునట్లుకోరగా మాదన్న నిరాటంకముగ వారుకోరిన ప్రదేశముల నిచ్చెను. ఇదియునుగాక పోడేలు లింగప్పయనువాఁడు చెన్నపట్టణమునకు సరకులను రానివ్వక యడ్డగించినందున నింగ్లీషు వారక్కన్నమాదన్నలతో మొఱ్ఱపెట్టుకొనిరి. అంతవారు దయామయులై కంపెనీ వారినిబాధపెట్టవలదని లింగప్పకు వర్తమానమంపి యాతనినే తమప్రతినిధిగ నేర్పఱచుకొని యున్నవిషయములలోను నింగ్లీషువారితో నుత్తరప్రత్యుత్తరములను జరుపునట్లతనికాజ్ఞాపించిరి సం॥నకు 1200 వరహాలవంతునఁబన్ను చెల్లింపవలసినదనియు, అక్కన్నగారి మోడలవిషయమై యింగ్లీషువారు కోర్ధబుచు

కొని కొంతసహాయము చేయవలసినదనియు 1682 సంవత్సరము జులై నెలలోఁ జెన్నపట్టణములో నున్నగవర్నరునకు హాడేలులింగప్ప యొక్కయుత్తరము వ్రాసెను. ఇందువలన అక్కన్నగారికి యోడలుండినవనియు నాతఁడు సహితము వర్తకము చేయుచుండెననియు మనమూహింపవచ్చును.

ఇట్లనేకపర్యాయము లక్కన్న మాదన్న లింగ్లీషువారికి సాయమొనర్చిరి. ఇంగ్లీషువారును వారికిఁ బలుమారులు గొప్పబహుమానములనంపి వారిదయకుఁ బాత్రులగుచుండిరి. అట్లువారు సర్వవిషయములయందారితేఱి నిపుణులగుటయే కాక, ధర్మశాస్త్రములయందును, గావ్యనాటకాదులయందును, జాపచక్రకృపాణాదిసాధనంబులయందును, గజతురగారోహణములయందును గౌశలంబుగాంచి, భగవద్భక్తపరాయణులై ప్రతిదినమును బ్రాతఃకాలమందు జాముప్రొద్దెక్కువఱకు శివపూజచేయుచుండిరి. అట్టి సమయమునఁ బెక్కుమందివిద్వాంసులు సహితమచ్చటికరుదెంచి తమవిద్యానైపుణ్యమునుజూపివారు తగిన బహుమతులందుచుండిరి.

# 8 వ ప్రకరణము.

మనచరిత్రకాలమున బ్రసిద్ధికెక్కిన ఢిల్లీనగరమును ఔరంగజేబను మొగలాయిచక్రవర్తి పాలించుచుండెను. ఈతడు విద్వాంసుఁడును, బ్రజ్ఞావంతుఁడును, ధైర్యశాలియునైయుండెను. మఱియు నీతనియందుఁగల సద్గుణములలో నింద్రియనిగ్రహమనునదియొకటి. ఈతఁడెన్నఁడును మద్యపానము చేయలేదు. మహమ్మదీయులెవ్వరును దన రాజ్యములో మద్యపానము చేయఁగూడదని యితఁడు శాసించెను. అట్లు చేయువారి గాలుసేతులు ఖండింపఁబడునట్లాజ్ఞాపించెను. మఱియునతడు ప్రజలను బాధపెట్టిన యధికారులను గఠినముగ శిక్షించెను.

ఇఁక నితని దుర్గుణముల నెంచి చూచిననవి యసంఖ్యాకములుగలవు. కాపట్యమీతనియందుఁగల మొదటిదుర్గుణము. మనోవాక్కాయ కర్మములను బరిపరి విధములుగ నుంచుట యాతని స్వభావవిశేషమైయుండెను. కృతజ్ఞతయనునదెట్టిదో యతఁడు గలలోనైన నించుకరుచిచూచియుండఁడు. వీటికన్నిటికంటెను హిందూమతద్వేష మను చెడ్డగుణ మీతనియెడల మిగులఁ బెంపొందియుండెను. ఈచక్రవర్తి హిందువులయెడ నొనరించిన యసురకృత్యములను దలంచుకొన్న నేజాతివానికైనఁగుండెలవియకమానవు. ఇతఁడు హిందువుల పాఠశాలలను, దేవాలయములను బడగొట్టించి యాప్రదేశములలో గొప్పమసీదులనుగట్టించెను. హిందువులందఱు పండుగలను జేసికొన

కూడదనియు, యాత్రికులకుఁ బోవుటతగదనియు నితఁడునిర్బంధించెను. వీరినెల్లను నవమానపఱచుటయే యతనిప్రథమకర్తవ్యముగానఁ గులమున హిందువులగుటచేవారందఱు "జిజియా" యనుపట్టుపన్ను చెల్లింపవలసినట్లు చక్రవర్తి యాజ్ఞాపించెను. ఇట్టిపన్నును విధించుట యన్యాయమనియుఁబన్నును జెల్లించుటకష్టమనియు హిందువులు మొఱపెట్టుకొనగా నౌరంగజేబు వారి నేనుఁగులచేఁ ద్రొక్కించెను. అయ్యో! పాపము ! ఎవరేమిచేయఁగలరు ? ఆతనికిఁగల యిట్టి మూర్ఖపుబట్టుదలయే పెక్కుమందిరాజులను, నితరక్షత్రియవతంసులను నతని ప్రబలశత్రువులుగఁ జేసినది. మహోన్నతవైభవమున విరాజిల్లుచు నతివిశాలమైయొప్పుచుండిన మొగలాయిరాజ్యము శిథిలమై కడపటఁ దుత్తునియలగుటకుఁగూడ నాతనికిఁగలహిందూమతద్వేషమును, రాజ్యతృష్ణయును బ్రధానహేతువులు.

ఇట్టి సద్గుణదుర్గుణపుంజములమిశ్రమమున కాకరమైన ఢిల్లీచక్రవర్తియగు నౌరంగజే బొకదినమున దనసింహాసనంబునంగూర్చుండితనప్రధానమంత్రులతో నిక్రిందివిధమున సంభాషించుచుండెను.

ఔరంగజేబు:—ప్రధానమంత్రులారా! దక్షిణదిగ్విజయయాత్రకై వలయుసన్నాహములను జేయుచున్నారా? కాలమతిక్రమించుచున్నది. ఒకవారమురోజులలో మనప్రచండసైన్యంబులను గదలించుకొని దక్షిణహిందూస్థానము దాటివెడల

వలయును. ముందుగ బీజపురముపైఁబడ నెంచి యున్నాను. ఆవల గోలుకొండను సహితము లోఁబఱచుకొన నెంచియున్నాను.

మంత్రులలో నొకఁడు:—రాజేంద్రా! సైన్యాధిపతులందఱికిని తమతమ సైన్యంబుల సిద్ధపఱచియుంచు నట్లాజ్ఞాపించితి. దండయాత్రకై వలయు భోజనపదార్థములన్నియు సేకరింపబడినవి. ఆజ్ఞయైన వెంటనే బయలుదేరుటకు సర్వము సిద్ధముగ నున్న" దనునంతలో నొక సేవకుఁడచటి కరుదెంచి "రాజా! భవదీయదర్శనార్థమై యరుదెంచి ద్వారముకడ నెవఁడో వేచి యున్నాడని" ఔరంగజేబుతో విన్నవించెను. అంత నౌరంగజేబు వచ్చినవానిని తనవద్దకు వచ్చునట్లుత్తరువొసంగెను. పిమ్మట నొక మహమ్మదీయుఁడచటి కరుదెంచి ఔరంగజేబునకు వంగి సలాములొనరించి "రాజేంద్రా! నానివాసము హైదరాబాదు. నాపేరిబ్రహీము. ప్రస్తుతము గోలుకొండరాజ్యమును దానీషా యను మాఱుపేరుగల అబుల్ హాసన్ కుతుబ్ శాహా పరిపాలించుచున్నాఁడు. అతఁడు హిందూమతాభిమానియై బ్రాహ్మణులగు అక్కన్న మాదన్నల కున్నతోద్యోగములనిప్పించి మమ్ములనందఱిని హింసపెట్టుచున్నాఁడు. మహమ్మదీయ రాజ్యమైనను మహమ్మదీయులు కఠినముగ శిక్షింపబడుచున్నారు. తానీషా పేరునకు మాత్రమే రాజు. అక్కన్న మాదన్నలే నిరంకుశాధికారముతో రాజ్యమేలుచున్నారు. అంతఃపుర స్త్రీలుసహితము తానీషా యిట్లొనర్చుచుండుట కెంతయు నిష్టపడక యతనికి

వ్యతిరేకముగ వర్తించుచున్నారు. మఱియు మీకుఁగలస్వ మతాభిమానమునకు వారెంతయు సంతసించుచున్నారు. మఱియు మీకుఁబ్రబలమైన శత్రువగు శివాజీతోఁ దానీషా స్నేహ మొనరించి యతనిని హైదరాబాదున కాహ్వానించి విందొనర్చెను. కాన మీరు మీసైన్యము నంపి తానీషా నోడఁగొట్టి రాజ్యమును గైకొని మహమ్మదీయమతమును బునరుద్ధారణగావింపవలయునని." ఔరంగజేబీమాటలను విన్నతోడనే కోపారుణితలోచనుండై "ఏమీ! తానీషా మహమ్మదీయమత ద్వేషియు నాశత్రువగు శివాజీతో స్నేహ మొనరించుట యా! తానీషాతో నేను సంగర మొనర్చుటకిది రెండవకారణమైనది. నేనివఱకు నీరాజ్యమునుజయుంప నెత్నించియుఁ గొన్ని కారణములచే నప్పటికుతుబ్ శాహాతో సంధియొనర్చుకొని యుంటిని. సంధిషరతు లెట్టివనిన:—

(1) యుద్ధవ్యయము నంతటిని గుతుబ్ శాహా యిచ్చునట్లును.

(2) అతఁడు తనకూతును నాకుమారునికిచ్చి రామగడమను పరగణా నామెకు నరణమీయవలయుననియు;

(3) అతని రాజ్యములోని నాణెములమీఁద ఢిల్లీశ్వరుని పేరు వేయించవలసినట్లును,

(4) జుమ్లాయను వానియొక్క సొత్తునంతటిని వానికిచ్చి వానికిష్టము వచ్చినచోటికిఁ బోనియ్యవలయునను నీపద్ధతులనే

ర్పఱచితిని. కానికుతుబ్ శాహా మరణానంతరమున నాకిచ్చు చుండినకోటిరూపాయలకప్పమును దానీషాక్రమముగఁ జెల్లిం చుటకుమాని వేయుచు నాసేనలపై నాపేరునుసహితముచే యించక నాకులోఁబడక వర్తించుచున్నాఁడు, ఇది మొదటికా రణము. మఱియు నితఁడు మహమ్మదీయుఁడై బ్రాహ్మణులను మంత్రులుగాబెట్టుకొని ముసల్మానుల నన్యాయముగ శిక్షించు టయు శివాజితోఁ జెలిమిచేయుటయు రెండవకారణము, ఆనీ చునిపనియింకఁదెలియగలదు. నేనునాసైన్యముల వెంటఁబెట్టు కొని దక్షిణదిగ్విజయయాత్రకై బయలుదేరనెంచియున్నాను. ముందుగబీజపూరునుజయించి యావలగోలుకొండను స్వాధీన పఱచుకొందును.ముందుగ నాపుత్రుడైనమహమ్మదుకొంత సైన్యమునిచ్చి పంపెదను. పిమ్మట నేనుసహితము మిమ్ముఁ గలసికొందును. కాఁబట్టి నీవుతానీషాసైన్యమునుజీలఁదీసి వారి లోవారికాంతర్యకలహములనుగలుగఁజేసి, అక్కన్నమాదన్నల పై జనులకందఱకిని నసూయగలుగునట్లొనర్చి వారిగడతేర్చు పాయమును వెదకి, సర్వకార్యములందప్రమత్తతనువహించి మె లంగుచుండుమని చెప్పెను.

ఈమాటలనువిన్న యిబ్రహీము పరమానందభరితుఁడ య్యెను ఔరంగజేబు సహితము, దనకుసహాయమొనరూడినవం దులకు మిగులసంతసించెను. అతఁడుతనసైన్యమునకుఁ గావల సినవసతులేర్పాటు గావింపవలసినదని యిబ్రహీమునకుఁజెప్పి

బీజపురమును శీఘ్రముగ జయించి లోఁబఱచుకొనుయత్నములఁ జేయఁదలచెను. ఇబ్రహీముసహితము తనకార్యములనెరవేర్చుటకై జౌరంగజేబువద్ద సెలవుబుచ్చుకొని గోలుకొండకుఁబయనముసాగించెను.

---

## 9 వ ప్రకరణము.

తానీషాచక్రవర్తి ప్రతిదినముదయముననే రాచకార్యములవిషయమై యాలోచించుటకొకసభచేసి మధ్యాహ్నము మూఁడుగంటల మొదలు విలాసచర్యలయందుఁ గాలముగడపుచుండును. వాడుకచొప్పున సభజరిగినయనంతర మొకదినమున తానీషా తనకుసమీపమున నగ్రాసనోపవిష్టుఁడును బృహస్పతింబోలి సకలనీతిశాస్త్రపారంగతుఁడునునగు మాదన్నగారితో "మాదన్నగారూ! హామీరుఖానుని చెఱయందిడినందులకు మహమ్మదీయు లెట్లువర్తించుచున్నారు. ఇబ్రహీమువిషయమై మఱియేవైనసంగతులు తెలియవచ్చినవా?" యనెను.

మాదన్న—అతఁడుద్యోగమునకువచ్చుచున్నాఁడు. కాని, యాంతర్యమున మనపై విరోధమునుగల్పించుకొని హీనమానవపదాశ్రయులగుఁ గొందఱు తురుష్కుల కాశ్రయమొసంగి లెక్కలేనిదుండగములనొనరించుచున్నాఁడు.

అక్కన్న — మొన్నటిదినమా తఁడు నాకు మితిలేనినష్టమును గలుగఁ జేసెను. కంపెనీవారిసహాయమున నావడవలం గొన్నిటిని సరకులతో నింపి వర్తకమునకుఁ బంపియుంటిని. అవి విదేశమునుండి మఱలివచ్చునపుడా దుర్మార్గుఁడు దురుష్కులను గొందఱిని బురికొల్పి పంపెను. ఆనీచులు నావడవలనన్నిటిని గ్రిందుమీఁదుచేసి సామానులనన్నిటిని నీటిలోఁగల్పి వడవవాండ్రి నిద్దఱినిజంపి మిగతవారికి గొప్పగాయములనుగలుగఁ జేసిరి. ఆ నీచునిఁబరిమార్చినఁగాని నాకోపముచల్లారదు వాని సహాయము లేకున్న వారట్లొనర్చి యుండరు.

తాసిషా—(కోపముతో) మాదన్నగారూ! మీరింకను నాలస్యముచేయుటతగదు. నేనిదివఱకే యాక్రూరునిగఠినముగశిక్షించమంటిని. మీరింకన యోర్చియుండవలయునంటిరి. ఆలస్యమమృతంవిషమ్మను న్యాయ మసత్యమవునా! గతజలసేతుబంధనమని నట్లుమించిన దానికిఁ జింతించినప్రయోజనము లేదు. ఇప్పుడైన మీరేమందురు.

మాదన్న—ఏమనఁగలను అతని నుద్యోగమునుండి తొలగించియే తీరవలయును. హామీరుఖానుని చెఱయందుంచినందులకుఁ దాఁ జేయఁబూనిన కార్యములు విఫలములగుటచే గాఁబోలు నుద్యోగమునకువచ్చినపుడెల్ల నాతఁడు మమ్ములను జూచుతఱి మండిపడుచుండును. మఱియు నతఁడు మన సైన్యములోని సైనికులను గొందఱినొకటిగఁ జేర్చి మనవిషయమై వారికి లే

నిపోనివి కల్పించి చెప్పుచుండునట. మఱియు నతఁడు నావద్ద నాలుగురోజులు సెలవుగైకొనిపోయియింతవఱకును రాకున్నాడు. కారణము తెలియదు.

తానీషా—అతఁడు మనశత్రువులతో నేవో కొన్నిరహస్యాలోచనలు సలుప నెచటికో వెళ్లియుండును. అతని నింక సైన్యాధిపతిగనుంచిన నతఁడు మనసైన్యములోని సైనికులను జీలఁదీసి శత్రుపక్షమునఁ జేర్పగలఁడు. కావున నతనిసైన్యాధిపత్యమునుండి వెంటనే తొలగింపుము.

మాదన్న—"క. ఆద్యావస్థనె రిపులను
భేద్యులఁ జేయునది తడవుసేయుటసఖ
చ్ఛేద్యము ముదిరినఁ దార
చ్ఛేద్యంబగునండ్రు రాజసిద్ధాంతవిదుల్."

అని వక్కాణింపఁబడినట్లు నేనుమీయాజ్ఞానుసారము నిర్వర్తింపవలసి యున్నది. అట్లుకాక ప్రస్తుత మిబ్రహీమును శిక్షింపక వదలితిమేని రాజ్యము భ్రష్టుపట్టఁగలదు. అతనినిశిక్షించి యక్కన్నగారికి సేనానాయకత్వమిచ్చితిమేని "అగ్నికి వాయుదేవుఁడు సాయమైనట్లు" మహమ్మదీయులకు ముందుండిన ద్వేషము వృద్ధియగును. ఆపనిని యితరమహమ్మదీయుల కెవరికైన నిచ్చెదమనిన అక్కన్నగారికిమించిన సమర్థుఁ డిబ్రహీముదప్ప వారిలోమఱెవ్వరునులేరు. ముందఱిగిన నూయి వెనుకగొయ్యియనినట్లు నాకేమియుఁ దోచకున్నది ఎట్లనను,

“క. పతికలిగి తానపాలియును
పతినలిగించియును దానె భంగము నొందున్
బతిమతమెఱిగి భటునకుఁ
బతితో నాగ్రహము చనదు బద్ధినరేంద్రా.”

అని చెప్పఁబడినట్లు దీనికెవ్వరేమి చేయఁగలరు. “రాలకుఱ్ఱిన వానిని బూలరువ్వరు” గదా! శిక్షించియే తీరవలయును.

తానీషా—మాదన్నగారూ! మీ కాకూర్కుని విషయమై యింకను బశ్చాత్తాప మెందులకు. రాజద్రోహ మొనరించుచు నుద్యోగమును గ్రమముగఁ జేయనందులకై యిబ్రహీము సైన్యాధిపత్యమునుండి తొలగింపఁబడినట్లును, సర్వసైన్యాధిపత్య మక్కన్నగారి కియ్యఁబడినట్లును బట్టణమంతయుఁ జాటించునట్లు చేయుడు. ఇబ్రహీమును యతని యనుచరులును నొకవేళ నితరులసాయమునుగొని మనపై కెత్తివచ్చిన మనపరాక్రమమునుజూపి శత్రువుల నుక్కడంచి వారిసర్వస్వమును మనము స్వాధీనపఱచుకొనవచ్చునుగదా? ఇందుఁ దప్పేమున్నది. మీరేల యిందులకింత యోచింపవలయును.

మాదన్న—చక్రవర్తీ! అవక్రవిక్రమంబునఁ రాజచక్రంబు నాక్రమించుట యక్రమంబని యెవ్వరువచింపఁగలరు! అవశ్యము శత్రుసేనలనోడించి వారిసర్వస్వమును స్వాధీనపఱచుకొనవచ్చును. ఇన్నిటికిని యబ్రహీమును సైన్యాధిపత్యము

నుండి తొలగించినంతనే యాందుర్మార్గులు తలగిల్లి మొలవవే యుదురని భీతిల్లను. కాని మహామ్మదీయులపై నేను ద్వేషభావముతో వర్తించుచున్నానని లోకులనుకొనెదరని తలంచుచున్నాను. నిజమేవ్వరెఱుంగుదురు?

తానీషా—మిమ్ముల నెవరేమియనుకొని యేమిచేయగలరు? నేను మీకుఁజెప్పినట్లొనర్పుఁడు.

అక్కన్నమాదన్నలు—చిత్తమనివచించుచుఁ దమ నివాసంబుల కఱిగిరి.

---

# 10 వ ప్రకరణము.

ఇబ్రహీము సైన్యాధిపత్యమునుండి తొలగింపఁబడెనని తానీషాగారి యుత్తరువయినట్లు పట్టణమంతయు ఘోషితమయ్యెను. జనులలోఁగలవరము మిక్కుటమయ్యెను. ఎచ్చటఁజూచినను జనులుఱచ్చవడి గుంపులుగగూడుచు నేమేమో మాటాడుకొనుచుండిరి. ఇబ్రహీమువలన బాధపడుచుండిన హిందువులందఱును వానికిఁ దగినశాంతియైనదని సంతసించుచుండిరి. మఱికొందఱు తానీషా పక్షపాతబుద్ధి లేనివాడనియు, మఱికొందఱు నవాబక్కన్నగారికే సైన్యాధిపత్య మొసగుటవలన నతఁడు బ్రాహ్మణపక్షపాతి యనియు వారివారికిఁ దోచినట్లెల్ల

చెప్పుకొనుచుండిరి. మాదారిద్ర్యవ్యథ నేటితోఁ దీరినదని కొందఱు సైనికులు సంతసించుచుండిరి. అక్కన్న సైన్యాధిపత్యమునకుఁ దఁగినవాఁడని కొంతమంది మహమ్మదీయులు వాదించుకొనుచుండిరి. మఱికొందఱు తురుష్కులు రుద్రావతారమూర్తులైరి. వారినేత్రములనుండి యగ్నికణములు రాలుచున్నట్లుండెను. కాలుగాలినపిల్లులవలె వారూర నాయెడకీయెడకుఁ బర్వెత్తుచుండిరి. వారితాఁకుడులచే వీధులలోఁ నడయాడుచుండు జనులుసహితముఁ గ్రిందఁబడిపోవుచుండిరి. క్రోధమూర్తులైన నాతురకలనందఱి జనులనెల్లరిని భీతావహమున ముంచివైచినది.

అట్లునల్దిక్కులకును బర్వెత్తుచున్న మహమ్మదీయులందఱు నొకరహస్యప్రదేశముఁ జేరిరి ఇబ్రహీము వారికి నాయకుఁడై యుండెను. తన మిత్రులందఱు నొకచోటఁ జేరిన వెంటనే యతఁడు తనచోటునుండి లేచితనసహచరులతో "మిత్రులారా! తానీషా నన్నుద్యోగమునుండి తొలగించినది మీకెల్లరకును దెలిసిన విషయమే. అతఁడు క్రమముగ నన్నియుద్యోగములను హిందువులకే యొసగుచున్నాఁడు. అక్కన్న మాదన్నలనింక మననివ్వరాదు. వీరున్నంతవఱకుఁ దానీషాతనదుష్టమతమును వీడఁడు. నేనిప్పుడాతనికి బహిరంగశత్రువు నయితిని. ఢిల్లీపట్టణమున కధిపతియగు నౌరంగజేబెప్పుడో యొకదినమున దానీషానుగాటువేయక మానఁడు. కొంతకాలములో నాతఁడు పట్ట

ణాముల పైఁబడఁగలఁడు. నేనాతనికడకు వెళ్లి "మనకష్టములన్ని నాతనికిఁ దెలియఁజేసితిని. అందులకతఁడు తనకుమారునివద్ద నొకగొప్పసైన్యము నొసఁగి మనకు సాయముగాఁ బంపెదన వాగ్దానమొసఁగెను. అచిరకాలముననే యాసైన్యమిచటికి రాఁగలదు. మీరు కడుజాగ్రతను వహించియుండవలయును. కంపెనీవారివద్ద మీరికమీఁద సరకులను దీయవలదు. వారు తానీషాతో మిగులస్నేహభావమున మెలంగుచున్నారు. వారివ్యాపారములను కుదముట్టింపవలయును. అక్కన్నగారి పడవల నాశన మొనరించి యతనివర్తకమును నిర్మూలము చేయవలయును. తానీషాకికమీఁదమీరుశిస్తు చెల్లింపవద్దు. నిర్బంధించినఁ జెల్లించుటకు వీలులేదని నిర్భయముగాఁ బల్కుఁడు. తురుష్కరాజ్యములోఁ దురుష్కులకే యవమానము గలుగుచున్నపుడు వన్నెందుకు? శిస్తువసూలు చేయువారితలలనుబ్రద్దలుగఁబగులఁగొట్టుఁడు. తానీషా మారాజు కాఁడని వారికిఁ బ్రత్యుత్తరమొసంగుఁడు—లెండు—వేగమే మీరందఱు సమ్మెకట్టవలయును. మనకుఁ లోఁబడిన వారికందఱకి నీవర్తమానమును జెప్పివారికిఁ దానీషాయెడల నప్రియమును గలుగఁజేయుఁడు. సాధ్యమైనంతవఱకనేకమందిని మనపక్షమునఁ జేర్పవలయును. మనజాతివారిలోఁ గొందఱింకను అక్కన్నమాదన్నలకు లోఁబడి వారికి దాసానుదాసులై వర్తించుచున్నారు. సైన్యములోనుండు మహామదీయు లందఱును దమతమయుద్యోగములనుమానుకొనవల

యును. ఆక్రూరుఁడగు నబ్దుల్ రజాకు దీనినిసాగనివ్వఁడు. స్వమ
తమునందుసహితము వానికించుకైన బత్తి పాతము లేదు. ఆదు
ర్మార్గుఁడు మనకు డొక్కలోని బల్లెమువలె నున్నాఁడు. వాని
నిసహితము దుదముట్టింప వలయును. ఇహిమానూ! యీవిష
యమున నీకుమించినవాఁడెవ్వఁడుండఁడు హుసేను, దస్తగిరు
లు సహితము తానీషాయెడలను అక్కన్నమాదన్నలయెడల
ను ద్వేషభావముతో వర్తించుచున్నారట ; తానీషాచర్యల న
న్నిటిని దమభార్యల కెఱిఁగించి రాణిగారికిని నంతఃపురస్త్రీల
కును దెలియఁజేయుమని చెప్పిపంపుచున్నారట. తానీషాభార్య
యగు సితారాయును భేదబుద్ధిని వదలి రాణి యనుగర్వమించు
కైన లేక మనకెల్లవిషయములను దన చెలికత్తియలమూలమున
నెఱిగించుచునే యున్నది. కాఁబట్టి మీరు శ్రద్ధవహించి
మీకార్యములను జక్కబెట్టుడు. లెండు-లెండు నమ్మకట్టుడ"
ని తనతావునఁగూర్చుండెను. ఇబ్రిహిము వచించినవాక్యముల
కందఱును సంగసించిరి. వారివారికిఁ దగిన ట్లుత్సాహపూర్వక
ముగ నేమోపలుకుచుండిరి. అందఱును దమకువీలైనంతవఱకు
సాయమొనర్చెదమని ప్రమాణపూర్వకముగఁ బల్కిరి.

ఇట్లిబ్రిహి మందఱికిని బరాకులుచెప్పి చేయవలసిన
సన్నాహముం జేసి లేచిపోయెను. అందఱు నాస్థలమును వీడి
తమ గృహములకేగిరి. ఆహా! కాలవిపరీత మెట్టిదోగాని రామ
రాజ్యమువంటి బంగారురాజ్య మీదుర్మార్గులకు విషతుల్యము

య్యెగా! చిరకాలమునుండియు రాజ్యమున నెలకొల్పఁబడిన శాంతిస్థాపనము భిన్నాభిన్నమైపోయి రాద్రిరసరంగస్థలము గాఁబోవుచిహ్నములుగొన్ని సూచించుచుండినవి.

---

# పదునొకండవ ప్రకరణము.

పట్టణములోని రాజద్రోహులొనరించు దుష్కృత్యములన్నియుఁ దానీషాకు బాగుగఁ దెలియు వచ్చుచుండినవి. హిందూమహమ్మదీయసఖ్యతకై తానొనరించు యత్నములన్నియు బూడిదలోఁ బన్నీరు వోసినట్లు వ్యర్థములగుటచే నతఁడూరక చింతించుచుండెను. అతఁడు పలుమారు మహమ్మదీయులకైకమత్యములోని సారమును బోధించుచు హిందువులపైఁ దమకుఁగల ద్వేషభావము నశించునట్లొనర్పఁ బ్రయత్నించుచుండెను గాని యెక్కరైనను దానిని బాటింపకుండిరి. అక్కన్నమాదన్నల స్వామికార్యధురంధరత్వమునకును, రాజ్యవ్యవహారనిపుణత్వమునకును వారిని గొనియాడుచుఁ దనకుఁదానే పలుమాఱు సంతసించుచుండెను. ఆజన్మాది యతఁడు శాంతస్వభావుఁడగుటయే కాక మూఁదుమిక్కిలి యతనికి ధర్మగుణము ప్రధానమై యుండెను. మఱియు నితఁడు పూర్వపు నవాబుల రాజ్యపద్ధతుల నాచరణలోనికిఁ దెచ్చుటయందు మిగులఁగుతూహలుఁడై యుండెను.

అతఁడొక్కొక్కపరి యేకాంతముననున్నతఱి తనకుఁ బూర్వమందున్న నవాబుల గుణములను వర్ణించుకొనుచుండెను. వారిదాతృత్వము నూరకఁ గొనియాడుచుండెను. వారిభాషాపరిజ్ఞానమునకును, భాషాభిమానమునకు నచ్చెరువొందుచుండెను. వారికాలమున నెలకొల్పఁబడియున్న హిందూముహమ్మదీయసఖ్యతకెంతయు సంతసించుచుండెను. ఆమహామహులకాలములోని యాంధ్రకవిశిఖామణులను నీతఁడప్పుడప్పుడు జ్ఞప్తికిఁ దెచ్చుకొనుచుండెను. గంగాధరకవివర్యుఁడు తపతీసంవరణ మనుకావ్యమును రచించి పూర్వపుకుతుబ్ శాహీని "మల్కిభరాం" అనివాడి యాతని కాకావ్యము నంకితము చేయుచు నందు నా నవాబు నిట్లువర్ణించి యున్నాఁడు.

సీ. సకలవేదపురాణ । శాస్త్రపారగులైన
యొంటరివిద్వాంసు । లొక్కచోట
నష్టభాషలయందు । నాధ్యంబులేకుండ
హరాంతకారకవీంద్రు । లొక్కవంక
గజపతినరపతి । క్షోణిభర్తలంపిన
యొడికంపురాయబా । రొక్కదండ
మేరుమందరముల । మించఁగల్గినమన్నె
యులుదండనాథులొ । క్కొక్కమొనల

గీ. జేరికొల్వభద్రాసనా । సీనుఁడగుచు
రమ్యగుణహారిమల్కిభ । రామశౌరి

608

భారతక్షీరమయసింధు బంధమధ్య
లలితపుణ్యకథాసుధా లహరిఁదేలి."

మఱియు నీకుతుబ్ శాహియొక్క యాస్థానమందుండిన యితరతురుష్క సర్దారులుగూడ నాంధ్రకవులను గౌరవించుచుండిరి. ఆకవులందఱు బ్రాహ్మణులే. అమీర్ ఖానుఁడను సైన్యాధిపతి యొకఁడాంధ్రభాషాభిమానియై పొన్నగంటి తెలగనార్యుఁడను నియోగిబ్రాహ్మణునిచే రచియింపఁబడిన యయాతిచరిత్రమను నచ్చ తెలుఁగు కబ్బమును గృతినందెను.

తానీషా యిట్టి సామ్యములను బెక్కులనేఱి యేఱి పూర్వపు నవాబులు హిందూమహమ్మదీయ సఖ్యతకై పాటుపడిన విధమును, హైందవులును, బ్రాహ్మణులును నగు వారియెడల వారికిఁగల గౌరవమును గూర్చియుఁ దెలిసికొని మిక్కిలి సంతసించుచు నతఁడు నట్లేయొనర్చుటకుఁ బ్రయత్నించుచుండెను గాని, యతఁడు విఫలమనోరథుఁడగుచుండెను. అక్కన్న మాదన్నల వద్దనుండి యతఁడప్పుడు రాజనీతి సేవకనీతి మొదలుగాఁగల సద్విషయములను గ్రహించుటయే కాక, తానుచక్కఁగఁ జదివియున్న మహమ్మదీయ మతగ్రంధమగు ఖురాన్ అఖిలలోకకల్యాణదాయకమనియు, హిందూమతమునకు సంబంధించిన వేదములలోని సూక్తములకును, ఋక్కులకును, ఖురానులోని (సూరా) సూక్తములకును, (ఆయెత్) ఋక్కులకును భావమున నేభేదములు లేవనియు, వేదములవలెనే

ఖురాను సహితము ధర్మశాస్త్ర, న్యాయశాస్త్ర, విజ్ఞానశాస్త్ర మంత్రిశాస్త్రాది సమస్తవిశ్వమానవ ప్రపంచ వ్యవహార సంగ్రహము సమగ్రభావయుక్తముగ రచింపఁబడిన దనియు, దయామయుఁడగు పరమేశ్వరుఁడు లోకకళ్యాణార్థము సంస్కృతభాషలో వేదమును, అరబ్బీభాషలో ఖురానును నిర్వచించియుండవచ్చుననియు, వేదమును, ఖురానును భాషలు వేఱుగానున్నను భావములు వేఱుగాఁజాలవనియు నందుచే మహమ్మదీయమతమునకును హిందూమతమునకును నేలాటిభేదములు లేవని యతఁడు కనుగొని తనయభిప్రాయములను దనరాజ్యములోని జనులకుసహితము వెల్లడి చేయుచు హిందూమతద్వేషమును మానుఁడని మహమ్మదీయులకుఁ జెప్పుచుండెను. కొందఱందులకు సమ్మతించినను మఱికొందఱు మహమ్మదీయులు "తానీషా తురుష్కుల నందఱిని హిందూమతమునఁ గలిపివేయుచున్నాఁడు. మీరుమోసపోకుఁ" డని జనులకు బోధించుచుండిరి.

ఇందుచేఁ దానీషా యేమిచేయుటకును దోచక యొకనాఁ డొంటరిగ సౌధోపరిభాగమున నిటునటుఁ బచారుచేయుచు నాలోచనానిమగ్నుఁడై తనలోఁదానిట్లు మాటాడదొడంగెను. "నేనెంతప్రయత్నించినను నాకీపని నెరవేర్చుటకు వశముగాకున్నది. ప్రజలలో నైకమత్యములేకున్న రాజ్యము వినాశమగుటకేసందియములేదు. హిందూమహమ్మదీయ సఖ్య

తక్కై నావలెనే మాదన్న పదుపాట్లుసహితము వ్యర్థములగు చున్నవి. ఆనాఁ డిబ్రహీమును దనపదవినుండి తొలగించినది మొదలు మహమ్మదీయులరౌద్రము మఱింత హెచ్చయినది. కాని యందులో నేనన్యాయముగ నెట్లుప్రవర్తింపఁగలను. ఉ॥ "న్యాయముదప్పునా నృపతి నాఁడు సమస్తముఁ బాడు" యని పెద్దలువచించిన ట్లీసీచులకొఱకై నేనధర్మముగఁ బ్రవర్తింతునా? సైన్యాధిపత్యమునకుఁ దగినమహమ్మదీయుఁడు వేఱొకఁడు లేనందున యక్కన్నగారి కొసంగితిని. కాని యిందేమియుఁ దప్పులేదు. ఈమూర్ఖులకొఱకై తరతరములనుండియు వచ్చుచున్న రాజ్యాంగపద్ధతుల నొక్కమాఱుగ నేనుమాత్ర మెట్లుత్యజింపగలను బ్రాహ్మణులకు మంత్రిపదవులనియా, యీదుర్మార్గులు నన్నునిందించుట! పూర్వకాలమున మంత్రిపదవులలో బ్రాహ్మణులుదప్ప వేరెవ్వరుండిరి. మాపూర్వపు నవాబుల కాలములో నెందఱాస్థానపండితులుండిరి? ఎంతమందికవులుండిరి! వారందఱు బ్రాహ్మణులు కారా? అప్పటిహిందూమహమ్మదీయసఖ్యతనుగుఱించి యించుకచింతించిన మనస్సు నీరయిపోవుచున్నదే! ఆహా! అక్కన్నమాదన్నల బుద్ధికుశలత నేమనిచెప్పవచ్చును! ప్రాణములు పోవుచున్నను న్యాయపథమునుదప్పి వేఱొండుమార్గమున నొకయడుగైన నిడువారుకారుగదా! అట్టివారిని నాముఖ్యమంత్రులుగఁ బెట్టుకొనుటలోఁ బూర్వజన్మమున నే నేదియో సుకృతమును జేసి

యుండాను. అయ్యో! ఆదుర్మార్గులు వారిపై సహితము ద్వేషభావముతోనున్నారు. కానిమ్ము నాజాతికిఁ గళంకము గల్గినగల్గుగాక నేనాదుర్మార్గులనిక మననివ్వను. ఈనీచులకొఱకై అక్కన్నమాదన్నలను విడనాఁడువాఁడనుగాను.

కం. పదనుదొరకొనుడు జెచ్చెర
వదలక వెదవెట్టు హాలికవర్గముకరణిం
బదను దొరకొనుడు జెచ్చెర
వదలక కార్యంబుఁ దీర్పవలయుఁ బతికిన్ ”

అని చెప్పఁబడినట్లు నాకీదుర్మార్గులను బొలియించుటకు మంచి సమయము చిక్కినది. పరరాజును నాపై దాడివంపుటకుఁ బ్రయత్నములా! ఓరీ! రాజద్రోహులారా! ఎంతపని గావించుచున్నారు! ఇకమీపని తెలియఁగలదు. ఉద్యోగములనన్నిటిని హిందువులకేయొసంగెదను. ఇంకను వారియందే పూజ్యభావమును వహించెదను. మీరేమిచేయఁగలరో చూచెదఁగాక. మీదుండగముల నడంప సర్వేశ్వరుఁడు నాకురక్షకుఁడగుఁగాక. దీనదయాళో! మహానుభావా! నీమాయచే నన్నన్యాయపథమునందుమాత్రము ప్రవేశింపజేయవద్దు. నన్ననవరతము రక్షించుచుండుము”ని తనలోఁ దాను గొంతసేపు వఱకు మాటలాడుకొని తానీషా తనస్థానమును వదలిపోయెను.

*

*

# 12 వ ప్రకరణము.

తానీషా తన ప్రధానమంత్రులతో సంభాషించుచుండెను. ఇతరయోధవరులును దండనాయకులును నొకతట్టున నిలిచియుండిరి. ఆదినమున నితరచోటులనుండి యరుదెంచిన వర్తమానములను మాదన్న తానీషా కెఱుకపఱచుచుండెను. అందులకుఁ దానీషా "ఇంగ్లీషువారు కోరినప్రకారము వారికి సహాయమొనరించితిరా"? యనెను.

మాదన్న—పోడేలులింగప్పకు నేడేవర్తమానమంపితిని. మచిలీపట్టణమందుఁ బ్రిస్తుతము వారిపడవల కే హానియుఁ గలుగుటలేదు.

తానీషా—అక్కన్నగారినావల విషయమై యింగ్లీషువారు శ్రద్ధపుచ్చుకొనుచున్నారా?

మాదన్న:—వారుమిక్కిలి శ్రద్ధమొఱఁబనిచేయుట యేకాక మనయందుఁ బూజ్యభావమును వహించియున్నారు.

తానీషా:— పట్టణములోని మహమ్మదీయులస్థితియెట్లున్నది ?

మాదన్న—నేఁడు మనమావిషయమునుగుఱించియే మాటలాడవలసియున్నది. ఇంతకుమున్ను నావద్దసెలవుదీసికొని పోయిన యిబ్రహీము యెక్కడికో వెళ్లియున్నాఁడని తలంచు

చుంటిమి కదా? నిజము బయలు వెడలినది. ఔరంగజేబుకడకు వెళ్ళి మనపైలేనిపోనివి కల్పించిచెప్పి మననగరము పైకి వాడి వెడలవచ్చునట్లును దాను వారికి యుద్ధమున సర్వవిధముల సాయమొనరించునట్లును నతనికిఁ జెప్పివచ్చినట్లు మనయబ్దుల్ రజాకువలన నాకు నేఁడే తెలియవచ్చినది. మఱియు నౌరంగజేబాదులకు సమ్మతించి తనకొడుకువద్దఁ గొంతసైన్యము నిచ్చి పంపునట్లు బ్రాహ్మణులతోఁ జెప్పి హైదరాబాదునకుఁ బరిసరములనున్న గ్రామములను ముందుగ గొల్లగొట్టి జనులను జిత్రవధగావింపఁ గొంతమంది మొగలాయివీరులను బంపియున్నాఁడట. ఇబ్రహీమున కీవార్త తెలియవచ్చినవెంటనే యతఁడు తనస్నేహితులనందఱిని బిలుచుకొనిపోయి వారికి సాయమొనర్చుచు గ్రామములలోనికిఁ జొరఁబడి, ధనమును దోచుకొని తిరుగబడినవారినందఱిని చిత్రవధగావించుచున్నాడట. వారినందఱిని తత్క్షణమే గ్రామములనుండి తఱిమివేసి గ్రామవాసుల యిబ్బందులను దీర్చుటకై కొంతసైన్యముతో మనయక్కన్న గారిని బంపవలయును.

అక్కన్న—నేనిప్పుడే కొంతమందిసైనికులను దీసికొనిపోయి వారిని రూపుమాపివచ్చెదను ఇందులకై మీరు చింతింపనవసరము లేదని చెప్పెను.

తానీషా—అప్పుడే మొగలాయిసైనికులు మనగ్రామములను సమీపించుచున్నారా? అక్కన్నా! నీవీవిషయమై

కడుశ్రద్ధవహించవలయును. నిజాముబలమును రుచిచూచి మొగలాయులికమీఁద హైదరాబాదువంకకు రాకుండునట్లో ర్పుము. ఇబ్రహిము నీతోఁ గయ్యమునరింపవచ్చిన నతనిశిరమును వెంటనే ఖండించివేయుము. అపజయమనువార్త నాచెవులలోఁ బడకుండునటులఁ గావింపవలయు" నని చెప్పుచుఁ దన కావలివైపున నిలిచియున్న దండనాయకులకును, యోధవరులకును, నితరసేవకులకును దమ నివాసంబుల కఱుగవలసినట్లుత్తరువొసంగి యక్కన్నమాదన్నలను బిల్చుకొని వేఱొకరహస్యప్రదేశమునకరిగి వారితో నీక్రిందివిధమున మాటాడఁదొడంగెను.

తానీషా:—భద్రాచలమున దేవాలయములవిషయమై చక్కఁగఁ బనిజరుగుటలేదని మనకిదివఱకు రెండుమూడర్జీలరుదెంచియున్నవి. అచ్చట శిస్తువసూలుచేయువారుసహితేమశ్రద్ధవహించి వారికార్యములను సాంగముగ నెరవేర్చుటలేదు. దేవాలయములయందు సరియైన విచారణలేనందున వేళకుఁ బూజవగైరాలు జరుగుటలేదని హిందువులందఱు నన్ను దూషించుచున్నారు. ఇందులకై యన్నివిషయములలో శ్రద్ధవహించి పనిచేయువాని నొకరి నచట దహశ్శీల్దారునిగ నియమింపవలయును. ఈ యుద్యోగమునకు మహామ్మదీయుని నియమించిన నతఁడు దేవాలయముల విషయమై యంతచక్కఁగఁ బనియొనర్పఁ జాలఁడు. కాన నెవరినైన హిం

దువునే యీపనికి నియమించవలయును. భాషాపరిజ్ఞానము ను జక్కఁగఁ గలిగినట్టియు, రాజ్యవ్యవహారవిషయములలోఁ జోరవగలిగినట్టియు వాఁడెవఁడైన మన పట్టణముననున్నవానికా యుద్యోగము నిప్పింపవలయును. ఇందులకు మీరేమందురు.

మాదన్న:—ఆవిషయమై నేనుసహిత మాలోచించుచుంటినిగాని మనయుద్యోగస్థులయందు దప్ప నితరులలో నట్టి సమర్థుఁ డెవ్వఁడు గన్పట్టనందున నింతకాల మావిషయమై మీతో ముచ్చటింపకుంటిని.

తానీషా:—మాదన్నా! నేలకొండపల్లెలోనున్న మేనల్లుఁడగు గోపన్నవిషయమై మీరునాతో నప్పుడప్పుడు ప్రస్తావించుచుంటిరికదా? అతఁడిందులకు సమర్థుఁడని తలంతును. మఱియు నాతఁడు రామభక్తాగ్రేసరుండనికూడ వినియుంటిని. అందుచేనతఁడు దేవాలయములవిషయమై కడుజాగ్రత్తగఁ బని చేయుచుండును. అతఁడిందులకియ్యకొనునా?

మాదన్న:—మామాటకాతఁడు జవదాటిపోవువాఁడు కాఁడు. మఱియు నాతఁడు భాషాపరిజ్ఞానమం దసమానప్రజ్ఞావంతుఁడే కాక రాజ్యతంత్రములయందు మిగులజాగరూకుఁడై మెలంగునట్టిబుద్ధిప్రభావముగలవాఁడు. అయిన నతఁడు రామభక్తియందెక్కుడు కాలము వినియోగించువాఁడగుటచే రాచకార్యములయందంత శ్రద్ధవహించి పనిచేయునా యని నాకించుక సంశయముగలుగుచున్నది.

గము కాలిసంకెలలవలె మిక్కిలి బాధించును. ఉద్యోగమునఁ బ్ర వేశించిన నిత్యమును భద్రాచలరామునిసాన్నిధ్యమున సేవచే యుచు నానందమున మునిఁగి తేలవచ్చునని సంతోషముగలుగు చున్నది. మిక్కుటములగుఁ గష్టములకు సహించియైనను స్వల్ప ముగనైన భక్తిమార్గమును సంపాదించుట ప్రధానము. కావున, నాయుద్యోగమునఁ బ్రవేశించి భక్తిమార్గమును పీడకుందుగాక. మహాప్రభో! భద్రాద్రిరామా; నేనాచరింపఁబోవు కార్యములలో నెన్ని సంకటములు గల్గినను నన్ను రక్షింపు చుండుము. నీవు నాయండనుండ నాకేకొఱంతయును లేదు.

చ. సిరులిడసీత పీడలెగజిమ్ముటకున్ హనుమంతుఁడాత్మ సో
దరుఁడు సుమిత్రసూతిదురితంబులుమాన్పను రామనామమున్
గరుణదలిర్పమానవులఁ గావగబన్నిన వజ్రపంజరో
త్కరముగదా భవన్మహిమ దాశరథీకరుణాపయోనిధీ.

మరియు నామేనమామలు ప్రస్తుతము మహమ్మదీయులొనరించు దుండగములను బూసగుచ్చినట్లు చెప్పియున్నారు. వారియెడ నే నెట్లువర్తింపవలయునో తెలియకున్నది. కాని, వారు నన్నేమిచేయఁగలరు? న్యాయమార్గమునఁ బ్రవర్తించిన నే హానియు గలుగనేరదు. అయినను భగవంతునియిష్టమెట్లున్నదో యెవరికెఱుక" యని చెప్పుకొనుచు గోపన్న తహశ్శీల్ పనితనకివ్వఁబడినట్లు వ్రాయఁబడియున్న ఫర్మానాను దీసికొని తనమేనమామల గృహమునుండి బయలుదేరి భద్రాచల

మువంక నొకనాఁటిమధ్యాహ్నమునఁ బ్రయాణమైపోవుచుండెను.

గోపన్న దారిసాగించుచున్నాఁడు. భద్రాచలమునకు మార్గమతిదుర్ఘటము. అతఁడు భయంకరమైన యరణ్యములోఁ బోవుచుండెను. ఎచ్చటఁజూచినను మహోన్నత తరుబృందములే. సూర్యరశ్మి సహితము సోఁకుటలేదు. ఏదిక్కునవిన్నను గ్రూరమృగధ్వానములే! ఎంతటిధైర్యవంతుఁడైన నాయరణ్యమున నొంటరిగఁ బోవుటకు జంకుగొనును. గోపన్న రామనామస్మరణ గావించుకొనుచు విపినాంతరాళమున జొచ్చెను. అతనికి గుండె ఝల్లుమనెను. ఘోరాకారులగు దొంగలగుంపొకటి యాతనిఁ జుట్టుకొనెను. ఆగుంపులోనివారిలోఁ గొందఱతనిని బట్టుకొనిరి. ఇంతలోనతఁడు 'పాహిరామప్రభో" యనుచుఁ గ్రిందికొరిగెను. ఆహా! చిత్రము—దొంగలు పలాయనమగుచుండిరి. మహాఘోరమగు బెబ్బులొకటి వారినిదరుముచు భయంకరముగఁ గాండ్రించుచుండెను. గోపన్నగారిచెంత చోరులు లేకుండిరి. అతఁడు ధైర్యమవలంబించి నలుదెసలఁ బరికించి చూచెను. ఒకపర్లాంగు దూరమున నాబెబ్బులియాతని కంటికగపడెను. మఱల నది తనచెంత నున్నట్లతఁడు దెలిసికొనెను. అక్షణముననే వ్యాఘ్రమదృశ్యమయ్యెను. మఱల నది యగపడలేదు. అందులకు గోపన్న విస్మయపరీత చేతస్కుండై "రామా! శ్రీరామా! భద్రాచలరామా! ఏమి నీమాయ! దొంగ లేమై

రి. నన్నురక్షింప నెంచితివా? నీవెన్ని యవతారములనైన నె
త్తఁగలవు. కన్నులకగపడినట్లేయుండి మాయమయితివా?
ఉ. నీలఘనాభమూర్తివగు నిన్ను గనుంగొన గోరివేడినన్
జాలముసేసి దాగెదవు సంస్తుతికెక్కిన రామనామ మే
మూలను దాఁచుకోగలవు ముక్తికిఁబ్రాపది పాపమూలకు
ద్దాలముగాదె మాయెడల దాశరథీ కరుణాపయోనిధీ."
యని" భగవంతునిఁ గీర్తించుచు గోపన్న ప్రయాణమును సా
గించి భద్రాచలమును జేరెను.

## 14వ ప్రకరణము.

మొగలాయిసైనికులను మార్గమునందే కలసికొని వారి
తోయుద్ధమొనర్చి వారిని బారదోలుటకై యక్కన్న తనసైని
కులను దీసికొని వెళ్ళెను. అట్లువారిని దఱిమి వేయుటలో అక్క
న్నకు జయమా, అపజయమా! యనువార్త మాదన్నకింకను
దెలియలేదు. మాదన్న చారులకొఱకై నిరీక్షించుచుండెను.
కాని యేవార్తయుఁ దెలియరానందున నతఁడు మిగుల విచార
పడుచుండెను.

ఇప్పుడపజయము దటస్థించిన మొగలాయులు విజృం
భించి గ్రామములను గొల్లగొట్టి యచిరకాలములో గోలు

కొండపైఁ బడఁగలరని మాదన్నకు బాగుగ తెలియవచ్చెను. అందుచే మాదన్న కేమియుఁ దోచనందున నతడు దనగృహ మున నూరక యిటునటు తిరుగుచుండెను. అంతఁ గొంతసేప టికి అబ్దుల్ రజాకు నలుగురు సేవకులతో మాదన్నకడ కరు దెంచెను. ఆవచ్చినవారి ముఖవిలాసములను వీక్షించిన తో డనే మాదన్న పట్టరానిసంతోషముతో మనకుజయమే చేకూ రెనుగదా" యని యబ్దుల్ రజాకు నడుగ నతఁడు "మనకే విజ యము గలిగినది మొగలులు పలాయనమైరి. ఇబ్రిహీము మోసమునకు మనసైనికు లెవ్వరును లొంగిపోలేదు. అతఁడు దనసహచరులతో నెక్కడికో వెళ్ళిపోయెను మొగలులలో ననేకులు మడిసిరి అక్కన్నగారు తనసైనికులను దీసికొనివచ్చు చున్నార"ని చెప్పెను. మాదన్న యీమాటలను విన్నతోడనే సంతోషాక్రాంత స్వాంతుఁడై విజయవార్తను దానీషా కెఱు కపఱచుటకై యతని యంతఃపురమునకు వెడలిపోయెను.

తానీషాసహితు మీవిషయమై యనేకవిధముల నాలో చించుచుండెను. ఉన్నట్టుండి మాదన్న నతఁడు చూచుటచే నతనికొక విధమైన విభ్రాంతికలిగెను. కాని కడపట నది యు ల్లాసముగఁ బరిణమిల్లినది. మాదన్న రజాకుఁగొనివచ్చిన సందే శమును బూసగుచ్చినట్లు తానీషా కెఱుకపఱచెను. తానీషా యును విజయవార్త చెవిసోకగానే హర్షోత్కర్షంబున దర హాసచంద్రికాసుందరవదనేందుండై యక్కన్నను వేయివి

ధంబులఁ గొనియాడెను, ఇబ్రహీమొనరించుచున్న దుష్కృత్యముల కతఁడెంతయుఁజింతించి "ఆదుర్మార్గుని పట్టణమునుండి వెడలఁగొట్టింపవలయున"ని మాదన్నతోఁజెప్పెను. అందులకు మాదన్న "ప్రస్తుత మిబ్రహీము మనపట్టణమున లేఁడు. మొగలాయిసైనికు లోటమింబొంది పలాయనమైన వెంటనే యతఁడు తనసహచరులతోఁ గలసి యెక్కడికో పరుగెత్తిపోయెనట. అతఁడు మొగలులవద్దకే వెళ్ళియుండనోపును. ఈయపజయ మౌరంగజేబు చెవిసోకగనే యాతఁడు మండిపడి తనసైన్యమును రణశూరుఁడగుముఅజ్జంవెంటఁబంపి గోలుకొండను ముట్టడింప నాజ్ఞయొసగునేమో! కావున నిప్పట్టున మన మతిజాగరూకతను వహించి గోలుకొండకోటను బాగుచేయించి మందుగుండు సామానులను సర్వము సిద్ధముచేయింప వలయును.

తానీషా:—ఈసమయమున మన కింగ్లీషువారేమైన సహాయ మొనర్తురా?

మాదన్న:—ప్రస్తుత మాంగ్లేయులకుఁదగిన యుద్ధభటులు లేరు. వారిటీవల కొద్దిమంది సైనికులను మాత్రము తమ సరకులను సంరక్షించుకొనుటకై చేర్చి పెట్టుకొనియున్నారు. వారు మనకు సాయమొనరించు స్థితిలో లేరు. కాని యిప్పుడు మహారాష్ట్రనాయకుఁడైన శివాజి మనకు వాగ్దత్త మొనరించినట్లు సాయమొనర్చియే తీరఁగలడు. అతఁడు గర్ణాటకముపై దాడివెడలి తనసోదరుఁడగు వెంకాజిని యోడించి రాజ్య

ము:ను స్వాధీనమొనర్చుకొని మఱల రాయఘుర్ కోటను జేరెను. అతఁడచ్చటనే నివసించుచున్నాఁడు. అతని సాయమును వేడిన సైన్యంబులను వెంటఁబెట్టుకొనివచ్చి సాయ మొనర్పఁ గలఁడు.

తానీషా:—ఇటీవలనే దండయాత్రకుఁ బోయివచ్చి విశ్రాంతి దీర్చుకొనుచున్న శివాజి మఱల యుద్ధమునకుఁ దన సైన్యంబులం గదలించుకొని వచ్చునా?

మాదన్న:—అతఁడు స్వరాజ్యస్థాపనైకతత్పరుఁడై మహమ్మదీయుల పెంపునందూలి భూతలంబున నడంగి పడి యున్న హిందువులను మగుడం దమ తొల్లిటియునికిన నెలకొల్ప నెన్ని మహమ్మదీయులను నాశన మొనరించుటకై యావజ్జీవమును ధారవోయ దీక్షవహించి యున్నందున మొగలులతో మఱల సంగర మొనరించుటకు వచ్చియే తీరును. మఱియు నిటీవలనుండియు మనగోపన్నమూలమున నాకును శివాజికిని మఱింత మైత్రి చేకూరినది. అందుచే నతఁడు నామాటను జవదాటి పోవువాఁడు కాఁడు.

తానీషా:—మాదన్నా! శివాజికిని మన గోపన్నకును నెట్లు పరిచయము సంఘటిల్లినది, మనగోపన్న సాధారణముగ సామాన్యులగువారితో మైత్రి నెఱపువాఁడు కాఁడుగదా?

మాదన్న:— రాజా! శివాజి సామాన్యుఁడు గాఁడు పరమభాగవతోత్తముఁడు. మనగోపన్న కబీరునకు శిష్యుఁడు. శివాజి సమర్థరామదాసునకు శిష్యుఁడు.

తానీషా:—ఎల్లన్నా! శివాజి అసహాయ శూరుండనియు, మహారణప్రియుండనియు వినియుంటినిగాని భక్తాగ్రేసరుండని వినియుండలేదు. మాదన్నా! అతని భక్తివిషయమై నాకు సవిస్తరముగఁ జెప్పుము.

మాదన్న:—రాజచూడామణీ! సమర్థరామదాసు కేవలము రామభక్తాగ్రేసరుఁడగుటచే రామరూపమునందే తన మనంబును లీనము చేయుచుండును. ఇతఁడొకపరి పండరీపురమునకరుదెంచి పాండురంగమూర్తిని సేవించి యారూపమునందసంతుష్టుఁడై యెన్నియోవిధముల భగవంతుని వేడి యానాటి శ్రీరామరూపమును జూపుమని ప్రార్థింప బాండురంగమూర్తి తన భక్తునిపైదయగలుగ నతఁడు కిరీటకుండలాదిదివ్యాభరణభూషితుఁడై ధనుష్పాణియై తూణీరయుగధరుఁడై శ్రీసీతాలక్ష్మణ భరతశత్రుఘ్న హనుమత్సమేతుఁడై సుగ్రీవాదివానరవీరపరివేష్టితుఁడై యానాటి తనరూపమును జూపించెను. అంతటి ప్రభావముగల రామదాసొకనాఁడు పండరిపురమునుండి వచ్చుచు మార్గమధ్యమున జేసూరుపట్టణమునకు వచ్చెను. అచ్చట వెలసియుండు పార్వతీరమణుఁడు రామదాసు సాంగత్యము నపేక్షించి రామదాసు శ్రీరామరూపముదప్ప నితర రూపముల నాదరింపడనియు నట్టివాఁడు నాయాలయమున కెట్లు వచ్చుననియు నేనే యాభాగవతునొద్దకుఁ బోయెదననియు నిశ్చయించి యాదేశము నేలు శివాజిరాజు వేషమును ధరించి యశ్వా

సాధుఁడైపోయి రామదాసును జూచినవెంటనే హయంబు నుండిదిగి నడచివచ్చి సమర్థరామదాసునకు వందన మొనర్చి “ భారతాగ్రిణీ ! నేఁడు సుదినము. నీదర్శన మాకస్మికముగ లభించెను. నీవు పండరిపురమునకుఁ బోవునపుడును వచ్చునపుడును నాకిచట సేవఁజేయొసంగవలయును. శ్రీరామభక్తనిష్ఠులు నాకుఁ బ్రాణసహాయులైయుందురు. నన్ను మఱువకు” మని యదృశ్యుఁడయ్యెను. అంత నాసమర్థరామ దా సాశ్చర్యపడి యావచ్చినవాఁడు తారకమంత్రోపాసకుఁడగు శంకరమూర్తియని నిశ్చయించి యచటనుండు కొండపైవెలసియున్న నీలకంఠునిదర్శించి మఱలపోవుచుండగాఁ బుట్టుకతోడనే భగవద్భక్తిఁగల శివాజీరా జీవృత్తాంతమునువిని వేగముగవచ్చి రామదాసుని శరణువేడి యాతనికృపకుఁబాత్రుఁడయి యాతనిచేఁ దారకమంత్రోపదేశమును బొందెను. ఇట్లు శివాజీ సమర్థరామదాసునకు శిష్యుఁడయినదిమొదలు లీతనికి భక్తి మిక్కుటమయ్యెను. ఆవల కొన్నాళ్లకుఁ దుకారామస్వామి యను మఱియొకభక్తుని మహిమ, వికసించిన పుష్పసౌరభము, వాయువశముచే లోకమునందు వ్యాపించునట్లు, వెల్లడికాఁగా శివాజీమహారాజా సంగతినివిని, తాను రాజధానిని విడిచివచ్చుట తన శత్రువులెఱుఁగకుండునట్లు ప్రచ్ఛన్నవేషధారియై యొంటరిగ బయలుదేరి యొకతట్టయందు వరాలను బోసి తీసికొనివచ్చి తుకారామస్వామియెదుట నునిచి సాష్టాంగనమస్కార మొనర్చెను.

ఆస్వర్ణరాశినిఁ జూచినంతటఁ దుకారామస్వామి ప్రకంపమా
నాంగుఁడై రాజునుజూచి "రాజా! నిరపేక్షకుఁడగు నాకీస్వర్ణ
రాసులతోఁ బనియేమి? శ్రీమత్పండరినాథుని చరణారవింద
యుగళముదప్పఁ దక్కిన పదార్థములయందుఁ గోరిక లేదు.
మహాత్ములు మర్మజ్ఞులై సర్వానర్థహేతుభూతంబగు నర్థమును
దూరముగఁ బరిహరించి వైరాగ్యమునే గొప్పధనముగ భా
వింతురు. నన్నుఁ బ్రహ్మప్రాప్తాంతరంగునిగఁ గావింపవలయునన్న
నీయర్థమును దీనులకిచ్చి నాతోఁగూడి భగవంతుని భజిం
పు"మని చెప్పి భగవంతుని భజించుచుండెను. ఆదినము హరివాస
రమగుటచే శివాజియుఁ దుకారామస్వామి చేయుహరిభజనము
వినుచుండెను. అంతటితోఁ దనివిచెందక రాజ్యాంగవ్యవహార
ములను మఱచి రెండుమాసములచట నేయుండెను. ఇట్లుండ
శివాజీరాజునకు విరోధియైన ఔరంగజేబు శివాజీవృత్తాంతము
నెఱిఁగి యతనిని బట్టుకొనివచ్చుటకై రెండువేలయశ్వారోహకు
లను బంపెను. వారందఱొక్కొక్కపెట్టున నేగి తుకారామ
స్వామియింటిని జుట్టుకొనిరి. వారిలో నలుగురు లోపలఁ బ్రవే
శించి శివాజీరాజెచ్చట నున్నాఁడని యడిగిరి. పాపము! భక్తా
గ్రేసరులలో నొకఁడగు శివాజీరాజు వారింజూచి రామభజన
కడ్డుగలిగినందులకు వ్యసనాక్రాంతుఁడై యుండెను. తుకారా
మస్వామి జరిగిన వృత్తాంతము నెఱిఁగి తన భక్తులతో భయము
విడిచి భజన చేయుచుండు'డని చెప్పెను. అంత
రాజభటులందఱెక్కుడై సందున నచటనున్న

సాధువులలోఁ గొందఱు "శివాజీరా జిచ్చటలేఁ"డని నుడివిరి. రాజభటులు దానిని నమ్మక దూసినకత్తులతోఁ దుకారామ స్వామి గృహమును బ్రవేశించిరి. తుకారామస్వామి, శివాజి మొదలగు వారందఱును నిశ్చలభక్తితో శ్రీపాండురంగమూర్తిని ధ్యానించుచుండిరి. అంతటఁ బాండురంగమూర్తి వారి భక్తికిమెచ్చి, శివాజీరాజును సంరక్షింపనెంచి తాను శివాజీ మహారాజువేషమును ధరించి, శ్వేతాశ్వము నధిరోహించి, చేత బల్లెమును బట్టుకొని రణశూరునివలె నాయింటిముందు భాగమునుండి పోవుచుండెను. అంత రెండువేల యశ్వారోహకులును 'రండు; రండు; శివాజి మనలనుజూచి తప్పించుకొని పాఱిపోవుచున్నాఁ" డని శివాజిరూపమును ధరించిన పాండురంగని దఱుముకొనిరి. అంత రాజవేషము ధరించిన నాభగవంతుఁడు కొంతదూరము వేగముగఁబోవుచు, నొక్కొక్కచోట వారికి లోఁబడిన ట్లభినయించుచు వారల నరణ్యమధ్యమున బెక్కుయిక్కట్టులకు లోఁగఁజేసి తానదృశ్యుఁడయ్యెను. అంతనాసైన్యమువారు చూచినదంతయు జగజ్జాలముగ నున్నదనిభావించి, తమరాజగు నౌరంగజేబువద్దకుఁ బోయి జరిగిన సంగతినంతయు విన్నవించిరి. ఈసంగతి తుకారామస్వామికిని శివాజికిని దెలియరాగానే వారానందపరవశులైరి. కావున శివాజీ సామాన్యుఁడు గానేరఁడు. అందుచేఁ బరమభక్తుఁడగు మనగోవన్నపై నతనికి మిక్కుటమగుఁ బ్రేమకలదు. కావున గోవన్నమూలమున నాకును శివాజీకిని సఖ్యమువాటిల్లినది.

తానీషా:—శివాజీ యిట్టిభక్తుఁడని నాకుఁ దెలియదు. అతని చరిత్రమును విని ధన్యుఁడనైతిని. కాని యిట్టిభక్తునికి రాజ్యకాంక్ష యెందులకు? అతఁడేల మొగలులతో నన్ని మాఱులు యుద్ధమొనర్పవలయును?

మాదన్న:—ఇందాతఁడు స్వబుద్ధిచే నొనర్చుటద్ధియు నులేదు. ఆతనికిఁ గొంత పార్వతీదేవి యాజ్ఞకూడఁగలదు. హిందూరాజ్యపునరుద్ధారణకై యామె శివాజికిఁ గలయందుఁ బ్రత్యక్షమై "నాయనా! తురకలశక్తి నడంచి హైందవులను రక్షించుటకై నీక పారమైన బలము నొసంగుచున్నాను. ఈమహామ్మదీయులచేత మిగుల వెతనొందుచున్న నాభక్తులగు హిందువులను రక్షింపుము. లె" మ్మని యదృశ్యురాలాయెను. అప్పటినుండియు హిందూమతద్వేషియగు నౌరంగజేబును హింసింప శివాజి బద్ధకంకణుఁడై యతని సైనికులతో నెన్నిమారులో సంగర మొనర్చెను. మన మౌరంగజేబుతో వైరమూని యున్నందునను, మీరు హిందూమతాభిమానులగుటచేతను మన కాతఁడు సాయమొనర్చియే తీరును. మనకు సాయమొనర్చుటలోఁ బ్రస్తుత మతనికి మించినవారెవ్వరును లేరు. సాయమొనర్చుటకై యతనికి వర్తమానమంపెదను.

తానీషా.—మీరు చెప్పినట్లే యొనరింపుడు. అక్కన్నగారరుదెంచినతక్షణము సైన్యాభివృద్ధికిఁ గావలసిన యేర్పా

టులను జక్కఁగనొనర్చునట్లు చెప్పెఁడు. మాదన్నగారూ! అదే మిచిత్రమేగాని యుద్ధమనిన నాకు గుండెలదరును.

మాదన్న:—మీరు కేవలము పశ్చాత్తాప మనస్కులగుటచే రణరంగమున జరుగు భయంకరోత్పాతమునకు మీ హృదయమింతుక చలించునుగాని వేఱుగా" దని చెప్పి మాదన్న తానీషావద్ద శెలవు బుచ్చుకొని అక్కన్నగారి రాక నెఱుంగుటకై గృహాభిముఖుఁడై పోయెను.

---

# పదునేనవ ప్రకరణము.

సూర్యోదయమైనది. బాలభాస్కరుని లేతకిరణములు మహీరుహములకు బంగారుపోత వోయుచున్నట్లు ప్రకాశించు నొకవింతలావణ్యము నొనగుచుండినవి. ఆసమయమున భద్రాచలమున కుత్తరపుదిక్కునను న్న రస్తాలో నిద్దఱు పురుషులెక్కడికో ప్రయాణమై పోవుచుండిరి. వారిద్దఱికి నీక్రింది సంభాషణ జరిగెను—

మొదటివాఁడు:—మిత్రమా! మాకఱవు తీరిపోయినది. ఏమిధర్మాత్ముఁడయ్యా!

రెండవవాఁడు:—ఎవరు? ఎవరు?

మొదటి:—నీకింకను దెలియదా? క్రొత్తగావచ్చిన

మన తహశ్శీల్దారుగారి నైన నెఱుంగవా?

రెండ.—ఎఱుఁగను—ఎఱుఁగను.

మొదటి:—గోలుకొండ సర్కారుదగ్గర మంత్రిపదవి యందుఁ బ్రఖ్యాతిపడసిన అక్కన్నమాదన్నల మేనల్లుఁడట- నేలకొండపల్లెలోని కంచర్ల లింగన్నగారి కుమారుఁడు గోపన్నగారు. ఈతనికి మనభద్రాచలరామునియందు భక్తి యెక్కుడగుటచే నితని నిప్పుడందఱు రామదాసుగారని పిల్చుచున్నారు. ఈ పేరుసహితము మనగ్రామమున నీవు వినియుండలేదా?

రెండ:—రామదాసుగారను పేరునుమాత్రము విని యుంటినిగాని యతనిని గుఱించి నాకేమియుఁ దెలియదు.

మొద.—మిత్రమా! అతని దైవభక్తియు, నతని యతిథిపూజయు, నతని సద్గోష్ఠియు నొరులకెవ్వనికిని లేదు. అతనియింట నెప్పుడుచూచినను రామభజనలే జరుగుచుండును. భక్తశిఖామణులందఱు నతని గృహమున గుంపుగూడి యుందురు—ఎప్పుడుచూచినను బ్రాహ్మణసంతర్పణలే జరుగుచుండును.

రెండ:—అయిన మనబ్రాహ్మణుల పంట పండినదని చెప్పుము.

మొదటి—భోజనముతో సరిపోయె ననుకొంటివా? ఏమి దక్షిణలు! ఏమి దానములు! పురాణము జెప్పు మన వెంకావధానులుగారికి నాలుగావులు-రెండెకరముల పొలము-చేతులకు మురుగులు-మంచి బహుమానములు వచ్చినవి. మ

ఱియు రామదాసుగారనేక దేవాలయములను జీర్ణోద్ధారణ గావించి నిత్యనైవేద్యంబులు సకాలమునకు జరుగునట్లేర్పాటు చేసెను. భద్రాచల రాములవారి యాలయమును శాశ్వతముగఁ గట్టించెను. అచ్చటినౌకరులకు జీతములను వృద్ధిచేయించెను. మఱియు రెండులక్షల రూప్యములను వెచ్చించి శ్రీసీతారామచంద్రుల కలంకారములను జేయించెను.

రెండు:—ఈఖర్చునకంతయు రామదాసుగారికిఁ బైకమెటనుండి వచ్చును.

మొదటి—రామదాసుగారి భక్తికిమెచ్చి భగవంతుని వినియోగమునకై కొందఱు పౌరులు ధనము నిచ్చెదమని వాగ్దానము చేసిరి. మిగిలినధనమును దన వేతనములోనుండియుఁ గొంత సర్కారుఖజానానుండియుఁ దీసి వెచ్చించుచున్నాఁడు. పౌరులిచ్చెదమన్న ద్రవ్యమింకను జేరలేదు. అందుచే వసూలయిన పైకములోఁ గొంతమొత్తమును నవాబునకంపి, కొంత పైకమును ధర్మకార్యములకు వినియోగించుచున్నాఁడు.

రెండు—ఊరకయిత్తుమన్నవారు సమయమునకిత్తురా? ఇట్లు రామదాసుగారు సర్కారుపైకమును ఖర్చుచేయుచున్న ఋణము మిన్కుటమై యతనిని బాధించునా? ఈవిషయము తానిషాగారికిఁ దెలిసిన రామదాసుగారికి ముప్పు వాటిల్లునేమో?

మొదటి—అట్టిస్థితి తటస్థించిన మృతుఁడైనఁ గుమారునిఁ బ్రతికించిన భగవంతుఁడు రామదాసును మాత్రము రక్షింపకుండునా?

రెండ—ఎట్లెట్లు? ఎవరిపుత్త్రుఁడు మరణించెను? ఎట్లు బ్రతికింపఁబడెను.

మొదటి—మొన్నటిదినము రామదాసుగారొక గొప్ప బ్రాహ్మణసంతర్పణ గావించుచుండిరి అప్పుడు మూఁడేండ్లవయసుగల తనపుత్త్రుఁడు వంటశాలయొద్ద సలసలఁ గాగుచుండు గంజిగుంటలోఁ బడెను. దీనిని నెవ్వరు గమనింపలేదు. కొంతసేపైన వెనుక రామదాసుగారిభార్య దీనిని గనెను—ఆమె దుఃఖము వర్ణనాతీతము—ఆమె శరీరమునుండి ప్రాణములల్లే లేచిపోవుచున్నట్లుండెను. ఆమె వెళ్లి బిడ్డను బయట దీసెనుగాని దేహము బొబ్బలెక్కిపోయి యుండుటచేఁ గొన్ని నిముషముల కాబాలుఁడు మృతినొందెను. అప్పుడు బ్రాహ్మణులందఱు భుజించి లేవఁబోవు సమయముగ నుండెను. పిమ్మట వారిని సంభావింపవలయును. అందుచే నామెధర్మహానికి వెఱచి తనపుత్త్రుని మరణముచేఁ గలిగిన దుఃఖమును వెలిఁబుచ్చక యీవార్తను దనభర్తకుఁ దెలియఁజేయకుండెను.

రెండ—ఆహా! ఆమెభక్తి కేమని చెప్పవచ్చును!

మొదటి—పిమ్మట బ్రాహ్మణులందఱు లేచిరి. వారందఱు దమకుఁదగినట్లు సత్కరింపఁబడిరి. విప్రోత్తములు దమగృహంబు

ఱకటిగిన వెనుక రామదాసు తనభార్యవద్దకువచ్చి 'పొద్దయినది.
ఏవు భోజనమొనరింపుమ" నెను. అప్పుడాతనికిఁ దన పుత్రుని
మరణవార్త చెవి సోకెను. పొంగివచ్చు దుఃఖము
నాపుకొని కడువిలపించుచున్న భార్యంజూచి “ వనితా! నీ
వేల నూరక విలపింతువు. కాలముదీరిన నేమానవుఁడును భూమి
పైనుండఁడుగదా! భద్రాద్రిరాముఁడే మనకు దిక్కు కాఁగలఁ
డు. మృతబాలకునితో నాతని సాన్నిధ్యమునఁ కేఁగుదము ర
మ్మ" నెను. అంతనామె పుత్రుని శవముఁదీసికొని రాఁగా రామ
దాసు రామునివద్దకు వెడలెను. అంత నతఁడు దేవుని సమీ
పించి “రామా! దశరథరామా! అనంతకళ్యాణగుణనిధే! నీ
కసాధ్యమొకటికలదే! ఱాతిని నాతిగఁ జేయలేదా! వానరుల
చే ఱాలను నీటఁ దేల్పలేదా! మృతుఁడైన బ్రాహ్మణపుత్రుని
బ్రతికింపలేదా! శ్రీకృష్ణావతారమునందత్యంతశైశవావస్థ
యందుఁ బూతనాశకటతృణావర్తాదులను సంహరింపలేదా!
దావాగ్నినిమ్రింగి గోపగోపికలను రక్షింపలేదా? మఱియు గు
రువగు సాందీపుని మృతుఁడైన పుత్రుని బ్రతికించి గురుదక్షిణ
నొసగలేదా? శ్రీరామచంద్రా! కరుణాసాగరా! రాక్షస
భీకరా రామా! ప్రభో! కరుణింపుము. కరుణింపుమనుచు
సాష్టాంగదండ ప్రణామము గావించెను. అదేమిచిత్రమోగాని
వెంటనే రామదాసు పుత్రుఁడు కన్నులు నులుముకొనుచు
లేచి కూర్చుండెను. అంత నందఱు శ్రీసీతారాములకు నమ

స్కరించి తమగృహంబునకుఁ జనిరి. కాన, మిత్రమా! రామదాసుగారి కట్టి యిక్కట్టులు సంభవించినయెడల వారామచంద్రమూర్తియే యతనిని గాపాడఁ గలఁడు.

రెండ.—అవును భగవంతుని నమ్మిన వాని కెట్టియిక్కట్టులును రానేరవుగదా! నమ్మినవారికి సొమ్ము నమ్మనివారికి దుమ్ము.

మొద.—అట్లనఁబోకుము. భగవంతుఁడు మొట్టమొదట దనభక్తుని మితిలేని కష్టముల పాలుచేసి యాతని మనస్థైర్యమును గనిపెట్టి పిమ్మటఁ దనదయారసమును దనభక్తునిపై వెదఁజల్లఁ జేయును. ఇప్పుడు రామదాసుగారిపై నెందఱు దుర్మార్గులు కోపమును వహించి యున్నారనుకొంటివి! ఆదుర్మార్గులగు మహమ్మదీయులలోఁ గొందఱు రామదాసుగారి కీయుద్యోగమునిచ్చుటలో నిష్టములేని వారై యాతనిపైఁగొన్ని యర్జీలను వ్రాసి తానీషాగారికిఁ దెలియఁజేయ నిశ్చయించియున్నారఁట. ఆతని నీయుద్యోగమునుండి తొలగింపఁ బ్రయత్నించుచున్నారఁట. వారు తలంచునట్లే దినదినమును సర్కారు ఖజానాలోని డబ్బు వ్యయమయి పోవుచున్నది.

రెండ:—అయ్యో! పాపము! మహమ్మదీయులొకరై రామదాసును కష్టముల పాలుసేయుదురా యేమి? అబ్బా! మహాభక్తుఁడే!

మొదటి:—ఏదియెట్లున్నదో యెవరికెరుక. చాలప్రొద్దయినది. రాములవారి కైంకర్యమునకుఁ బూలకై చేరువగ్రామమునకుఁబోవుచున్నాను. నాకీనడుమ జీతమెక్కువైనది. కాన నాపనియందశ్రద్ధను జూపరాదు. రామదాసుగారికిఁ గోపము వచ్చున”ని చెప్పెను.

పిమ్మట వారిద్దఱు దమతమ కార్యములను జక్కపెట్టుటకై త్వరితముగఁ గాలుసాగించిరి.

# పదునాఱవ ప్రకరణము.

మొగలాయి సైనికులక్కన్నగారిచేఁ దరుమఁగొట్టఁబడినది మొదలిబ్రహీము మిగులఁ జింతాక్రాంతుఁడై యేమి చేయుటకును దోపనందున బరిపరి విధముల నాలోచించుచుండెను. భద్రాచలములోని తహశ్శీల్ పనిసహిత మొక మహమ్మదీయునికైన నివ్వబడక, హిందువును, బ్రాహ్మణుఁడునగు రామదాసున కివ్వఁబడుటచే నిబ్రహీమునకును నతని సహచరులకును గోపము హెచ్చయ్యెను. గోపన్నకుఁ దహశ్శీల్ పని నిచ్చుటలోఁ దానిషా భార్యయగు సితారా కెంత మాత్రమిష్టము లేదు. అందుచే నిప్పుడామెకుఁ దానీషాపైఁ గ్రోధము వృద్ధియగుట కారంభించినది. కాని యామె దానిని వెలిఁబుచ్చ

క తన యభిప్రాయముల నప్పుడప్పుడు తన చెలికత్తెలతోఁ జెప్పుచుండెను. వారిమూలమున నిబ్రహీమునకును నతని యనుచరులకును సర్వవిషయములును దెలియవచ్చుచుండెను. క్రిమక్రమముగఁ దానీషాకు హిందూమతాభిమాన మెక్కుడగుకొలది మహమ్మదీయుల రౌద్రము సహితము దినదినప్రవర్ధమాన మగుచుండెను. వారిక్రూర కర్మముల కంతములేదు. ఇబ్రహీము తనసహచరులతోఁ జేరువనున్న గ్రామములకుఁ బోయి యచట నివసించు హిందువులను బరాభవించుచు వారి నొక్కొక్కప్పుడు దారులయందు దోచుకొనునట్లు తన సేవకుల కాజ్ఞాపించెను. వారును దదాజ్ఞానుచరులై వర్తించుచు హిందువుల నెల్లఁ గడుగ్రూరముగ హింసించుచుండిరి. మఱియు నిబ్రహీము పెక్కు గ్రామముల లోని జనులనందఱినొకటిగఁ జేర్చి యక్కన్న మాదన్నలపై లేనిపోని దురభిప్రాయములను వారికిఁ గలిగించుటకేమేమొ కల్పించి చెప్పుచుండెను. మఱియు నతఁడు భద్రాచలమున కేగి పలుకుబడిగల హిందువులతోఁ జేరి వారి యెడ స్నేహభావముతో నున్నట్లు నటించుచు 'రామదాసు సర్కారు పైకమునంతటిని దేవాలయములకును, బ్రాహ్మణ సంతర్పణములకును, ఖర్చుపెట్టి ఖజానాను ఖాళీచేయుచున్నాఁడని వారికి బోధించి, వారి యభిప్రాయములను మార్చివేసి, రామదాసుగారికున్న గౌరవమును బోగొట్టి వారిచే నతనిపైఁ గొన్ని యర్జీలను బెట్టించెను. ఇంకను నతఁడు రామదాసుగారి

షిఁ గొన్ని యపవాదములను సృష్టించి గ్రామమంతయుఁ బ్రటింపఁ జేయించెను. దైవసంకల్ప మెట్టిదో గాని యిబ్రహిమొనరించు చున్న కార్యము లన్నియు ఫలవంతము లగుచుండినవి. ఆతనికి మంచి కాలము దటస్థించినది. పట్టినదంతయు బంగార మగుచుండెను. అతని మాట కడ్డు లేకుండెను.

"ఉ. వసుఁగుదోమ జేయుఁగుణహీనుగుణోన్నతు జేయుసింహముఁ
బూనియజంబు సేయుమగపొల్ల బరాక్రమశాలిఁ జేయుస
న్మానుని హీనుఁజేయుఁగడుమందునిఁ జాలవివేకిఁ జేయుఁదా
గానధరిత్రి దైవమును గాదనరాదు వివేకభూషణా". యని

పెద్దలు వక్కాణించి నట్లు దైవచిత్ర మతివిచిత్రము గదా! పాపము! రామదాసుగారికెన్ని యాపదలు సంభవించినను, యతని విషయమై యెన్ని యపవాదము లుద్భవిల్లినను, జనులెన్ని విధములఁ దన్నుఁగూర్చి చర్చించు కొనుచున్నను, నతఁడు నిశ్చలమైన తన రామభక్తిని మాత్రము మఱచినవాఁడు కాఁడు. ఎప్పటివలె రామభజనలు జరుగుచుండినవి—బ్రాహ్మణులు సన్మానింపఁబడుచుండిరి. దేవాలయములు మరమ్మతులు గావింపఁబడుచున్నవి. బ్రహ్మోత్సవము లెప్పటివలెఁ గాక యింకను వైభవముతో జరుపఁబడుచుండినవి. మహమ్మదీయుల క్రూరకృత్యములును సందు లేక జరుపఁబడుచునే యుండినవి.

# పదునేడవ ప్రకరణము.

రాత్రి తొమ్మిదిగంటలు కావచ్చుచుండెను. అక్కన్న మాదన్నలకు భోజనమైనది. వారు మామూలుగఁ బదిగంటల రాత్రికిఁ బిమ్మట నిద్రించుచుండుటచే నప్పటికింకను బ్రొద్దుండుటవలన అక్కన్న భాగవతమును జదువుటకుఁ బ్రారంభించెను. వారికథాశ్రవణ ప్రవణహృదయుండైన మాదన్న యతనిచెంతఁ గూర్చుని వినుచుండెను. కొంతసేపైన పిదప అక్కన్న యిట్లు చదువఁదొడంగెను.

"క. ధాత్రిని హలికునకును సు
క్షేత్రము బీజములు నొకటఁ జేకురుభంగిన్
జిత్రముగ దాతకీవియుఁ
బాత్రము సమకూరునట్టి భాగ్యముగలదే".

శా. కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతింబొందరే
వారేరీ సిరి మూటగట్టుకొని పోవంజాలిరే భూమిపైఁ
బేరైనంగలదె శిబిప్రముఖులుం భీతిన్ యశఃకాములై
యీరే కోర్కులువారలన్మరచిరే యిక్కాలమున్ భార్గవా".

మాదన్న:—ఆహా! ఎంతబాగుగఁ జెప్పినాఁడయ్యా! పిమ్మట

అక్కన్న:—"క. ఉడుగని క్రతువుల వ్రతముల
బొడగనఁ జననట్టి పొడవుపొడవునఁ గుఱుచై

యడిగెడినట నను బోటికి
నిడరాదె మహానుభావ యిష్టార్థంబుల్".

శా. ఆర్తిం శ్రీసతికొప్పుపైఁ దనువుపై నం సోత్తరీయంబుపైఁ
బాదాబ్జంబులపైఁ గపోలతటిపైఁ బాలిండ్లపై నూత్నమ
ర్యాదం జెందు కరంబు గ్రిందగుట మీఁదై నాకరంబుంట మేల్
గాదే రాజ్యము గీజ్యముం సతతమే కాయంబు నాపాయమే !

మ. నిరయంబైన నిబంధమైన ధరణీ నిర్మూలనంబైన దు
ర్మరణంబైన కులాంతమైన నిజముం; రానిమ్ము కానిమ్ము; పో
హరుఁడైనన్ హరియైన నీరజభవుం డభ్యాగతుండైన నా
దిరుగన్ నేరదు నాదుజిహ్వ వినుమా ధీవర్య వేయేటికిన్.

మాదన్న:—ఆహా! దానశీలుఁడన్న నామము బలిచక్రవర్తికే తగియున్నది. ఆభావమును పోతరాజుగారెంత సలక్షణముగను, మృదువుగను జెప్పియున్నారు! ఏమి కవిత్వమహహ్వా! ఈతఁడు కవితనంతయుఁ బోతవోసినాఁడు. అందుచేతనే యీతని నామము కూడ "పోతన యని ప్రసిద్ధికెక్కి యుండును.

అక్కన్న—మాదన్నా! "పలికెడిది భాగవతమఁట, పలికించు విభుండు రామభద్రుండఁట" శ్రీరామచంద్రుని కరుణాకటాక్షమీతనిపై సంపూర్ణముగనుండఁ గవిత్వమున కేమిలోపమగును.

మాదన్న:—అవునవును. అక్కన్నా! మనగోపన్న కవిత్వము కూడ మిక్కిలి సరసముగ నుండును. దాశరథిశతకమెంత సొంపుగ వ్రాసియున్నాఁడు చూడు.

చ. జలనిధిలోన దూఁటి కులశైలముమీఁటి ధరిత్రిఁ గొమ్మునం
దలవడఁ గ్రాటి రక్కసునియంగము గీటి బలీంద్రునిన్ రసా
తలమున మాటి పార్థివకదంబముఁగూల్చిన మేటి రామ నా
తలఁపున నాటి రాఁగదవె దాశరథీ కరుణాపయోనిధీ!”.

యని దాశరథి శతకములోఁ దనకుఁ దెలిసియున్న పద్యము నొక దానిని మచ్చునకుఁ జెప్పెను.

అక్కన్న.—అవును. రామచంద్రుని దయారసము చేతనే యాతనికట్టి కవిత్వము లభ్యపడినది.

ఇప్పటికి దాదాపు పదిగంటలరాత్రి కావచ్చుచుండెను అప్పుడు మాదన్నగారి భార్యయచటి కరుదెంచి “మీరింట లేనపుడెవరోవచ్చి మీకివ్వమని యీజాబు నొసగిపోయిరి. ఇంతకుముందే దీనిని మీకొసంగుట మరచి పోయితి”ననెను. పిమ్మట మాదన్న గారాజాబును దీసికొని దానిని జదివి, తనముఖమునం దించుక విషణ్ణభావమును సూచింపుచు అక్కన్న గారి వంకఁజూచి “అక్కన్నా! యీజాబును దానీషాగారు స్వంతముగ వ్రాసినారు. భద్రాచలములోని జనులు రామదాసు పైఁ గొన్ని యర్జీలను బెట్టిరనియు, వాటివిషయమై దీర్ఘముగ నాలోచింపవలసి యందున మనల నెప్పటివలెఁ గాక ప్రాతః కాలమందే కచ్చేరికి రావలసిన ట్లిందు వ్రాసియున్నారు. నేను దలచినట్లే యైనది. గోపన్నా! సర్కారు పైకము విషయమై జాగ్రతగ నుండవలసిన దని యెన్నిమాఱులు చెప్పినను నతఁడా

మాటలను బెడచెవిని బెట్టుచుండెను. ఇబ్రిహాము భద్రాచలములోని జనులను దనకు లోఁబఱచుకొని యుండు సంగతి గూడ నాకుఁ దెలియవచ్చినది. అతఁడే యాయక్కన్నలను వారిచేత వ్రాయించి యుండును. ఆతఁడం దెట్టి యన్యాయమును గల్పించి వ్రాయించియున్నాఁడో తెలియకున్నది.

అక్క——ఖజానాలోని పైకము గూడ ఖర్చయిపోయి యుండునా?

మాదన్న——ఖర్చు కాకేమున్నది. దినదినము బ్రాహ్మణసంతర్పణలట! అడిగినవానికి లేదనక లెక్కలేని దానములట! సీతారాములకు వెలలేని యాభరణములను జేయించి పెట్టెనట! వీటికన్నిటికి ధనమెక్కడనుండి రాఁగలదు. ఇందుఁజూడ సర్కారు పైకము మిక్కుటముగ వెచ్చింపఁబడినట్లే తేలుచున్నది. ఇందులకుఁ దోడు మొన్నటిదినము గోపన్నయింటిలో దొంగలు ప్రవేశించి సర్కారు పైకమును గొంతదొంగిలించుకొనిపోయినట్లు వార్తవచ్చినది. ఎంతమొత్తము బాకీపడెనో తెలియకున్నది.

అక్కన్న——ఏమీ! గృహమున దొంగలును జొరఁబడుటయా! మాతో నీసంగతి నిదివఱలోఁ జెప్పకనేపోతివి. "మూలుగునక్కపై దాటిపండుపడ్డట్లు" సర్కారు పైకమును ఖర్చుపెట్టుటకుఁ దోడు దోపిడికూడ సంభవించెనా? దీనినిబట్టి

చూడ గోవన్న సర్కారునకు నాలుగైదులక్షలవఱకు జవా బియ్యవలసివచ్చునని తోఁచుచున్నది.

మాదన్న—శ్రీరామా! యెంతటికష్టమును దెచ్చిపెట్టితివి? ఇంతకు నాతనిపై నగ్లెట్లు వచ్చియున్నవో?

అక్కన్న—మహమ్మదీయులలోఁ గొందఱు దుర్మార్గులు హిందువులలోఁ గొందఱిని దమకు లోఁబఱచుకొని రామదాసుపై లేనిపోని సంగతులను వ్రాయించి యతనినియుద్యోగమునుండి తొలగింపవలసినట్లు గూడ వ్రాయించియుందరు

మాదన్న—అక్కన్నా? యీవిషయమై మనమన్యాయముగనెట్లు ప్రవర్తింపఁగలము. తురకలు మొదటినుండియు మనపైఁ గక్షవహించియుండ, రామదాసును రక్షింపఁబ్రయత్నించిన వారి క్రోధ మెక్కుడగుటయేగాక జనులందఱు మనలనెత్తిపొడుతురు. విధివశమును దప్పింప నెవరితరము.

అక్కన్న—మాదన్నా! రామదాసుభక్తి యమోఘము-కుమారుని గాపాడిన భగవంతుఁ డతనిని మాత్రము గాపాడకుండునా? రాముఁడే రామదాసును రక్షింపఁగలఁడు. మనమిందు వేఱొక పథము ననుసరించుటకు వీలు లేకున్నదనెను.

మాదన్న చింతాక్రాంతుఁడై యుండెను. అతని భార్య దీనిని గని కారణమును దెలిసికొనఁగోరెను. మాదన్న యామెకంతయును వచించెను. ఆమె మిగులదుఃఖించెను. ఇన్నిటికి

ని దానీషాగారి యభిప్రాయమెట్లున్నదో కనుగొనవలయునని మాదన్న వారితోఁ బల్కెను. భద్రాద్రిరాముఁడే రామదాసును రక్షింపఁగలఁడని దలఁచి వారందఱు శయ్యాలం జేరిరి.

---

## పదునెనిమిదవ ప్రకరణము.

రామదాసుగారు తహాశ్శీల్దారుగ నియమింపఁబడినది మొదలు తానీషా భార్యయగు సితారాకుఁ దనభర్తపైఁ గోపము మిక్కుటమయ్యెను. అంతఃపురమునందామెతన చెలికత్తెలతో నేమేమో చెప్పుచుండెను. ఆమె తన భర్త ముఖమును సహితము జూడ నొల్లకుండెను. స్వమతాభిమానము నందామె ఔరంగజేబునకు సరితూఁగఁగలదు. కాని యిన్ని దినములును నామె తానీషాకు వెఱచి యేమియుఁ జేయఁజాలకుండెను. ఆమె సహచారిణులును వారికిఁదోఁచినట్లెల్ల నామెకు బోధించి యామెకుఁ దనభర్తపై మితిలేనియసూయను గలుగఁజేసిరి. అందుచే నిప్పుడామె తనభర్తవలనిభీతినించుకైన గలిగించుకొనలేదు. రాజ్యమునందుఁ గొంచెమెచ్చుతక్కువగ నన్ని పదవులు హిందువులకే యొసంగఁబడుచుండుటచే నామె హృదయము మండుకొని పోవుచుండెను. ఆమెకేమి చేయుటకును దోపలేదు. మనుష్యహృదయమువంటి రహస్యస్థానమీప్రపంచమునందేదియును లేదు. సితారాతనపై నిట్టిద్వేషబుద్ధితో మె

లగుచున్నదని తానీషా యెఱుంగఁడు. అంతఃపుర పరిచారకులు సహితము దీనిని వెలిఁబుచ్చకుండిరి. కాని కాలక్రమమున నతఁడు సితారా తనపైనించుక కోపమును వహించియున్నట్లు కనిపెట్టెను గాని యందులకుఁ గారణ మతనికిఁ జక్కఁగ బోధపడలేదు.

క. "ఆలినిభృత్యునిఁదగదయ
నేలినపతిపెద్దయగును, నేర్పఱియుంటన్
మాలుదురతఁడొల్లనినాఁ
డాలూర్వశియైనభృత్యుఁడర్జునుఁడైనన్"

అనుసంగతిని తానీషా జ్ఞప్తికిఁ దెచ్చుకొనెను; అందువలన నతఁడు సితారాను శాంతింపఁజేయవలయునని తలంచుచుండెను; రాణిగారును దనభర్తనెట్లైన లోఁబఱచుకొనవలయునని ప్రయత్నించుచుండెను. మానవప్రకృతులయెడసహావాసప్రభావమనంతమగుటచేఁ దాను జేయఁదలఁచుకొన్న కార్యములను గుఱించి తన యంతఃపురవధూజనులకందఱికిని దెలియఁజేయుచు వారాసంగతుల నితరులకెవ్వరికిని దెలియఁజేయఁగూడదని యామె వారికాజ్ఞాపించుచుండెను.

సితారా యిప్పుడేకాంతస్థానమందున్నది. ఆమె తన సౌధమున నొకశయ్యపైఁ బరుండియున్నది. ఆమె హృదయమున నిప్పుడించుకంతయైన శాంతికిఁజోటులేదు. సదాధరింపఁబడునట్టి యాభరణములను సహిత మామెధరించి యుండలే

డు. పండ్రెండుగంటలరాత్రి కావచ్చినను నామెకు నిద్రవచ్చుటలేదు. ఆమె మిక్కిలి ఖిన్నురాలైనట్లు గన్పట్టుచుండెను.

ఇంతలో నామె గదిలోనికిఁ దానీషా యరుదెంచెను. అచట వెలుంగుచున్నదీపపుకాంతిచే నతఁడు దన భార్యవద్దఁ జేరఁగలిగెను. అతఁడామె యవస్థఁ జూచి మిగుల నాశ్చర్యము నొంది యామెతో నిట్లనియె 'తరుణీమణీ! నీవిట్లు విషాదముద్రాంకితముఖంబుతోఁ బరుండియుండుటకుఁ గతంబెయ్యది? సదా ధరింపఁబడు భూషణంబుల సహితము నీవేలధరింపవు? నాపైఁ గోపముచే నిట్లు వర్తించుచున్నావా? లేక విలాసార్థమై యీవిధముగ నటించుచున్నావా? యనియడిగెను.

సితారా—స్వమతాభిమానహీనులకును, హిందూమతమున బక్షపాతముగలవారికిని విలాసముగాక వేఱేమున్నది?

తానీషా—అట్లన్న నాకర్థమగుట లేదు.

సితారా—ఉన్నతోద్యోగములనన్నిటిని హిందువులకే-అందునను బ్రాహ్మణులకే యొసంగిన మీబోటివారి కర్థమగుట కష్టముగదా!

తానీషా—ప్రేయసీ! ఉద్యోగము చేయుట కందఱర్హులగుదురా? రాజభక్తి, స్వామికార్యధురంధరత్వము, తెలివితేటలు, వ్యవహారమునందు సమర్థత మొదలగు గుణములుండ నవసరము లేదా? అట్టివారెవరో వారికే యొసంగితిని.

సితారా—ఇట్టి గుణముల కాకరమైనవారు మహామ్మదీయులలో నెవ్వరును లేరా!

తానీషా—ఉండినను అక్కన్న మాదన్నలవంటి సామర్థ్యముగలవారరుదు వారు తమ విధాయకకృత్యములలో వెనుకంజవేయువారుకారు. వారు రాజభక్తిపరాయణులు.

సితారా—పోనిమ్ము. తహశ్శీల్దారు పనికైనయోగ్యతగలవారు లేరుందురా? గోపన్నకే దానిని నొసంగుటకుఁ గారణమేమి?

తానీషా—తరుణీ! అతఁడు పరమభక్తుఁడు. అందుచే దేవాలయముల విషయమై యతఁడు శ్రద్ధఁబుచ్చుకొని పనిచేయఁగలఁడని యట్లొనర్చితిని.

సితారా—అందుచేతనే యతఁ డాఖులతులనఱకు సర్కారుపైకమును దిగమ్రింగఁగలిగినది. ఏదెల్లుపోయిన నాకేమి. నాకీజీవితముపై నాశలేదు. మతమంతయు నడుగంటిపోయినది. రాజ్యము సహితము వినాశమైపోవుసమయమాసన్నమైనది. ఆదుర్మార్గులగు హిందువులమీఁద మీకు గలప్రేమాతిశయంబే రాజ్యమునిట్టి దుస్థితికిఁ దెచ్చినది. ఱేపు మహామ్మదీయులందఱు నొకటిగఁ జేరి జౌరంగజేబు సైన్యములోఁగలసి పట్టణమును బ్రజలను నాశనమొనరించునప్పుడు మీకండ్లుచల్లగనుండును గాఁబోలును. అట్టిస్థితియే సంభవింపఁబోవుచున్నది. అప్పుడు మీకెవరు సాయపడెదరో చూచెదఁగాక.

నాఁడే మహమ్మదీయులందఱు దౌర్జన్యమొనరించుచున్నారని తెలిసినఁగోడనే అక్కన్న మాదన్నల నుద్యోగమునుండితొలగించియుండిన నెంతమేలుగ నుండెడిది. మఱియు హామీరు ఖాను నేల చెఱయందుంచితిరి. వాఁడెవరికో జాబువ్రాసికొని పోవుచుండ లేనిపోని యర్థములను జేసికొని వానిని జెఱయందుంచితిరి. అది మొదలుగా మహమ్మదీయుల దౌర్జన్యము మిక్కుటమైనది.

తానిషా—అయిన నిప్పుడేమి చేయుమనెదవు?

సితారా—(కోపముతో) ఇంకను నేమి చేయుమనెదవనియా! హామీరుఖానుని జెఱనుండి విడిపింపవలయును— రామదాసు నీకీయవలసిన శేషమంతయుఁ జెల్లింపవలసినదనియు, నట్లు చెల్లింపనిచో గొన్నిరోజులగడువుపై నాతని జెఱసాలయందుంచి పైకము ముట్టనియెడల నాతనికి శిరచ్ఛేదమొనరింపవలసినట్లాజ్ఞాపింపుము.

తానిషా—శాంతింపుము. ఐశ్వర్యమనంతమైనది కాదు. సామ్రాజ్యము నిత్యముగాదు. లోకమున ధర్మాధర్మములు రెండుసుస్థిరముగ నిలుచుచున్నవి. మనమతమునందు ద్వేషబుద్ధితో నేను వర్తించుటలేదు. రెండుమతములకును సఖ్యముంగలుగఁజేయ యత్నించుచున్నాను. మనమతగ్రంథమగు ఖురానును, హిందూ మతమునకు సంబంధించిన వేదములును, ననేకవిషయములలో ననురూపమునుబొందియున్నవి. గా

నధ్యయనముచేయు గ్రంథమని, స్వరయుక్తముగాఁ జదువఁ దగినదనియర్థము, ప్రేయసీ! వేదములెట్లు అనువాకములుగను, సూక్తములుగను, ఋక్కులుగను భాగింపఁబడియున్నవో యట్లేయఖిలలోకకళ్యాణదాయకమైన మన ఖురానుసహితము ముప్పదిజూజు (అనువాకము) లుగా విభాగింపఁబడి ౧౧౪ సూరా (సూక్తము) లుగలిగి, ధర్మశాస్త్ర, న్యాయశాస్త్ర, విజ్ఞానశాస్త్ర, మంత్రశాస్త్రాదిసమస్త ప్రపంచవ్యవహారసంగ్రహము సమగ్రభావగంభీరయుక్తముగ నిర్వచింపఁబడియున్నది. "ఇస్లాం" అనగా నమ్రిత లేక భక్తి అనుమతము—ఇందుపరమేశ్వరుఁడగు "అల్లా" 'లాయిలాఃయిల్లల్లా" అనగా (త్వమేకంశరణ్యం) ఈశ్వరుఁ డొక్కఁడే పూజింపఁదగినవాఁడు. "వహాదహులాషరీకలహు" అనగా (ఏకమేవాద్వితీయంబ్రహ్మ) అల్లా (ఈశ్వరుఁడు) ఒకఁడే; రెండు కాని వాఁడు. అనునిజమును సిద్ధాంతీకరించి యాచరింపఁ జేయుటకై మతమునుమహమ్మదువారు బోధించినది. హిందూమతసిద్ధాంతముసహిత మట్లేయున్నది. మఱియు 'దలిల్' అనగా 'శ్రుతి' యనియర్థము. స్మృతికి హదిస్ అనెదరు. ఇది వేదమువలెనే ప్రభుసమ్మితము. "యధేహూంవాచం"అనునట్లే ఖురానులోనిమంత్రములు"ఖుల్ హుతుల్లాహు అహట్" (ఓమహమ్మద్) భగవంతుఁ డొక్కఁడని నన్నుఁగూర్చి చెప్పుము. అని యాజ్ఞాపించునట్లు ప్రేరణార్థకమునఁ జెప్పఁబడినది. మఱియు ఖురానులో నలుగురు దేవ

తలు నిర్వచింపఁబడినారు. జిబ్రీల్=బ్రహ్మ, మొకాయిల్=ఇంద్రుఁడు, ఇస్రాఫీల్=ఈశానుఁడు, ఇజ్రాయిల్=యముఁడు. ఖురానునకును మానవసృష్టికిని "జిబ్రీల్, యెట్టివాఁడో సృష్టికిని వేదమునకును బ్రహ్మయట్టివాఁడు. మనకు మొకాయిల్ మేఘాధిపతియై యెట్లువర్షమును గురిపించునో యట్లే హిందువులకు "ఇంద్రుఁడు వర్షమున కధినాథుఁడు. "ఇస్రాఫీల్ ప్రళయము నెట్లుకలిగించునో యట్లే ఈశానుఁడు రుద్రుఁడు. మహాకాలో మహానటః, అనునట్లు ప్రళయమును గలిగించును. "ఇజ్రాయిల్ వలెనే యముఁడు ప్రాణములను దీయును. మఱియు ఖురానులో "బియిన్ బిన్ ఉమ్మతిన్ ఇల్లాఖలాఫీ హానజిర్" అనగా ఏమతమును హాదూత(ప్రవక్త) అనగారసూల్ (ఋషి) లేనిదేకాలేదు." అని స్పష్టముగా వాకొనఁబడినది. ఇట్లే వేదమునఁ బేర్కొన్న విశ్వామిత్రాది ఋషులును మహమ్మదు వలెనే మతమును వెల్లడించిరి. మఱియు "లకుందీనకుంవలి యద్దీన్" అనగా "మయ్యేవం సకలం జాతం, మయి సర్వం ప్రతిష్ఠితం"అని లోకసంగ్రహార్థము నిర్వచించిన దీనిలో మతద్వేషమునకు నెంతమాత్ర మవకాశమియ్యలేదు. వనితా! మనమతమునందు వలెనే హిందూమతము నందుఁగూడ నేవో కొన్ని యాచారములుదప్ప తక్కినయాచారములును, విధ్యుక్తములునుగూడ నొక్కటిగనే గన్పట్టుచున్నవి.

సితారా!—మీరాగువచించు మాటలలో నాకించుకైన స

మ్మకము లేదు. మీరనుసరించు పద్ధతియే గొప్పదని వాకు నమ్మకము బుట్టించుట కిట్లు చెప్పుచున్నారు. మఱియు......

తాసిషా!—అటుకాదు. దీనిని వినుము. మనము వాడు ఫరిస్తాయను మాటకే హిందువులు దేవతయందురు. కిరామన్ కాతెబిన్=అనగా చిత్రగుప్తులు, జన్నత్=స్వర్గము, దోజఖ్=నరకము, బుర్రాఖ్=కామధేనువు, జంజం=ఆకాశగంగ, కౌసర్=అమృతము, పరీ=దేవకన్య, షరియత్=కర్మ, వజూ=ఆచమనము, నమాజ్=పూజ, మురాఖేబా=సమాధి, జకాత్=దానము, గోసుల్=స్నానము, హజ్=యాత్ర, వలీ=ఋషి, మస్జిద్=ఆలయము, రోజా=ఉపవాసము, సియ్యత్=సంకల్పము వ్రతము, సున్నత్=నైమిత్తికకర్మ, రూహ్=జీవము, హాఖ్=ఆత్మ లేక బ్రహ్మ, తసవ్వుఫ్=ఆధ్యాత్మికవిద్య, ఈరీతిగనే కార్యము లన్నియు సరిపోలుచున్నవి. మఱియొక విషయమును గమనింపుము. 'మసీదు, ఇంచుమించు శివాలయమును బోలియున్నది. శివాలయములోని లింగము స్తంభాకారముగ నున్నది. దానిని సామాన్యముగ మసీదున కిరుపార్శ్వముల నెత్తబడు స్తంభములుగ బోల్చుచు. మహమ్మదీయులు చంద్రధ్వజులు గదా! అందుచే నా స్తంభములపై జంద్రుని చిహ్నముగ నుంచుకొనెదరు. అట్లే జటాజూటధారియైన ఫాలాక్షుని నెత్తి నత్తిన నెలయును 'స్థాణూరుద్ర ఉమాపతిః" ఉమాపతిని, స్థాణుః స్తంభముగాను పోల్చి చిత్రించినచో నది చంద్రధ్వజమని

వేఱుగ దానిని నిరూపింపనక్కరలేదు. మఱియు వేదమునందు "నీలతోయదమధ్య స్థాద్విద్యుల్లేఖేవభాస్వరా" అను అనుష్టుప్ లున్నట్లే ఖురానులోఁగూడ నగపడుచున్నవి చూడుము. "ఇన్న ఆతో నకల్ కౌసర్ ఫసల్ల్లెర బ్బేకవర్ వార్" ఇట్టి పరిమాణము లెన్ని యోగలవు. దీనినిబట్టి యీరెండును నొక్కే యీశ్వర పరికల్పితమగు శబ్దములని (వేదములని) సమర్థింప వచ్చును. లేనిచో రెండు భిన్నమైన భాష లుదయాస్తాచలముల వంటి యెడమైన భాషలలో నొకలక్షణలక్షితమైన ఛందము లుండుట సాధ్యముగాదు. ఈపద్ధతి అరబ్బీలోఁదప్ప దక్కనయే భాషాగ్రంథమునందును నగపడదు. కావున వేదభాష యెట్టిదో ఖురాను భాషయును నట్టిదేయని నొక్కి వక్కాణింపవలసియు న్నది. కావున మనమతమునకును, హిందూమతమునకును నే భేదము లేదు. హిందూమహమ్మదీయ సఖ్యతకై పాటుపడుచు న్నాను. చక్కగ యోచించిచూడుము. అక్కన్న మాదన్నల వంటి ప్రధానులు గలరా?" అని శాంతముగఁ జెప్పిచూచెను.

సితారా!—(మిగులఁగోపముతో) మీ వేదాంతములఁజా లింపుఁడు—మీశ్రీరంగనీతులు నాకవసరము లేదు. నాకడనుం డక లేచిపొండు. ఎట్లైన నాకు నమ్మకముగలుగుట కేవో లేనిపో నివి కల్పించి పోల్చి చెప్పినంత నేను నమ్మెదానను కాను. ఇక మీభాషాజ్ఞానమును జాలింపుఁడు. పొండు.

తానీషా:—(కోపముతో, ఛి! ఛీ! నీమూర్ఖపుబట్టుద లను మానవా?

క. సతియును బతియును జెలియును
వితథంబుగఁ బలికి రేని విసువగవలయున్
సతియుఁ దిలోత్తమయైనను
బతియిందుఁడైనఁ జెలియుఁ బ్రాణంబైనన్"

అని పెద్దలు సెప్పినట్లు యిట్టి భార్యను త్యజింపనిమానవుఁడు బ్రదుకనేర్చునే?

సితారా—మీరు నన్ను త్యజింప నవసరము లేదు. నే పు వాయసువులే నన్ను త్యజింపఁగలవు. నా యాశ మీ రింక వదలుకొనవచ్చును. నాముఖము సహితము మీ రింకఁ జూడ నవసరము లేదని చెప్పుచు ద్వేషభావముతో—క్రోధావేశముతో సితారా తనభర్త వద్దనుండి లేచి వేఱొక్క చో శయనించెను.

తాసీషా:—(స్వగతము) ఆహా! యిత్తరుణికి కెన్నివిధములఁ జెప్పిచూచితిని! కొంతవఱ కూరడించితి—కొంతవఱకుఁ బ్రబోధించితిని—కొంతవఱకుఁ బ్రేమాలాపములఁ బచరించితిని. కాని, తనమూర్ఖపుబట్టు దలనుమాత్రము వీడకున్నది. ఇత్తన్వికిప్పట్టున వ్యతిరేకముగ నడచుకొనిన ముప్పువాటిల్లఁ గలదు. (పైకి) తరుణీ! కడసారి యొకమాటఁ జెప్పుము.

సితారా:—ఇదియే నాకడమాట. మీరు హిందూమతాభిమానమును వదలి నేనిదివఱకుఁ జెప్పినట్లు వర్తింతునని వాగ్దత్తము గావింప వలయునని చెప్పెను.

పాపము తాసీషా పత్నీవ్యామోహముచే ముగ్ధుఁడై

పోయెను. పిమ్మట నతఁడు "అటులనే యొనరించెదను. నీ వెప్పటి వలె నుల్లాసముగ వర్తించుచుండుము. నేను బోయివచ్చెద" నని చెప్పి తన యంతఃపురమునకు వెడలిపోయెను.

## పందొమ్మిదవ ప్రకరణము.

సితారా శయనించియున్న యంతఃపురమునుండి బయలు వెడలి తానీషా తన శయ్యాగృహమున కరుదెంచెను. అతని డెందంబు డోలాందోళనంబు నొందియున్నందున దన పడకపైఁ బరుండి నిదురించుట కెంత ప్రయత్నించినను నాతనికి నిద్దుర పట్ట లేదు. నాటిసాయంసమయముననే యతఁడు మాదన్నకు జాబు వ్రాసి పంపినది, రామదాసు విషయమై మాదన్నగారితో నెట్లు మాటాడవలయునో యని యాతఁ డూరక చింతించుచుండెను అట్టినిర్దాక్షిణ్యమగుఁ గఠినశిక్షను రామదాసుగారికి విధించుట కాతని కిష్టము లేదు. కాని, రామదాసుపై వ్రాయఁబడి యున్న యర్జీలును, సితారాయొక్క పట్టుదలయు నతనికట్టిశిక్షనే విధింప వలసినట్లు తానీషాను పరిపరివిధముల నిర్బంధపెట్టుచుండినవి. సితారా చెప్పినట్లతఁడు నడచుకొనని యెడల నామె తనప్రాణములను ద్యజించు కొనునని యతఁడు దృఢముగ నమ్మియుండెను. అందుచే నామె యిష్టానుసారమే జరిగించుటకతఁడు కృతనిశ్చయుఁడై యుండెను. రామదాసుపై వ్రాయఁబ

డిన యర్జీలలోని సంగతుల నాతఁడు జ్ఞప్తికిఁదెచ్చుకొని నాటి
పై నేమేమో యూహించుచుండెను. అట్టిశిక్షను రామదాసు
కు విధింపక తీరదని యతఁడుతలంచెను. ఒక్కొక్కప్పుడంను
లకువ్యతిరేకముగ జరిపిన బాగుగ నుండునని యతఁడనుకొను
చుండెను గాని,యది కొనసాగినది కాదు.ఇట్టియాలోచనల కం
తము లేదు. ప్రభాతముననే యక్కన్న మాదన్న లరుదెంచి
తన్ను దర్శింతురని యతఁడు తలంచుటచే నించుక నిద్రించుటకు
మొదలు పెట్టెను.

తెల్లవాఱినది తానీషా నిద్రనుండి లేచెను అతఁడు ప్రా
తఃకాల కృత్యములనన్నిటిని నెరవేర్చుకొని సభామంటపమున
కరుదెంచెను. అక్కన్నమాదన్న లంతకుమున్నే యచటికి వ
చ్చియుండిరి. ఇతర యుద్యోగస్థులెవ్వరు నచట లేరు. అక్కన్న
మాదన్నలు తానీషాను జూడఁగనే యతని ముఖవిలాసము
భేదపడియున్నట్లు కనుగొనిరి. వాడుకచొప్పున వారతని యా
సనముప్రక్కనఁ గూర్చొని యీక్రింది విధమున సంభాషింపఁ
దొడఁగిరి.

మాదన్న—తానీషాగారూ! మీరు పూర్వమువలె
నిప్పుడంత యుత్సాహముగ నుండుటలేదు. కారణమేమో తెలి
యకున్నది. నేఁడేలమీరు మిక్కిలి చింతతోనున్నారు? రామ
దాసువిషయమై మీరాలోచించుచున్నారు గాఁబోలు.

తానీషా—అవును. రామదాసుగారి విషయ మెట్లు

చేయుటకును దోచకున్నది. ఈయర్జీలలోని విషయములను గమనించుడు. (అర్జీలనందిచ్చును.)

మాదన్న—అక్కన్నా! అందులో నొకదానిని దీసికొని చదివి వినుపింపుమనెను. అక్కన్న యర్జీనిదీసికొని యీక్రింది విధమునఁ జదివెను.

శ్రీసుదాత్రిజాధిరాజ కంఠీరవులగుఁ దానీషా బాదుషా గారి దివ్యసముఖమునకు.

ధరాత్రిచలపౌరు లనేక సలాములొనరించి వ్రాసికొన్న మనవి.

అయ్యా!

మాపురమునకు రామదాసుగారు తహశ్శీల్దారుగ నియమింపఁ బడినది మొదలు మాకష్టములిన్నియని చెప్పుటకవకాశము లేదు. వారు కేవలము రామభక్తియుందే కాలముగడపుటచే రయితుల మొర నాలించుటలేదు. బీదల కష్టసుఖములను విచారించుటలేదు. పశువులకు మేతకును నీటికిని వసతులు లేకున్నవి. ఇతరయధికారులతో మనవి చేసికొన్న వారు స్వపోషణార్థము ధనమునభివృద్ధి పఱచుకొనుటయేగాని లంచములిచ్చినవారికిఁదప్ప మిగతవారికి జవాబునైన నిచ్చుటలేదు. రామదాసుగారు ప్రజలసుఖమునకై ధనమును వినియోగింపక, కేవలము దేవాలయములకును, బ్రాహ్మణ సంతర్పణలకును హరిదాసులను బోషించుటకును ద్రవ్యమునంతటిని విని

యోగించి సర్కారుబొక్కసమున రాగిరువ్వ సహితము లేకుండఁ జేసినాఁడు. అయిదువందల గుఱ్ఱములున్న నేడువందల గుఱ్ఱములనియు, రూప్యమునకుఁ బదిమానికల బియ్యమివ్వఁబడిన నెనిమిది మానికలనియు, నేదుమిచ్చి వందుమని వ్రాయించుచు నతఁడు దనయుద్యోగస్థుల నందఱిని లోఁబఱచు కొనుచున్నాఁడు. నవాబుగా రీలెక్కలను స్వంతముగఁ దనికీ చేయవచ్చును. రామదాసుగారు సర్కారున కాఅులకులు బాకీపడినట్లు మామిత్రులవలన మాకు దెలియవచ్చుచున్నది. ఈ యాఅులకులు దేవాలయమునకే వెచ్చింపఁబడినట్లు రామదాసుగారు వ్రాసికొనియున్నారు. కాని దేవాలయములను దిలకించిన నింతటివ్యయము పట్టియుండదని దెలియఁగలదు. ఏబది వేలు పట్టియుండును. లేక లక్ష పట్టియుండును. ఇట్టిఖర్చులకుఁ బ్రభువులు సమ్మతింపరని తలంచుచున్నాము. ప్రస్తుతము వారా పైకమును జెల్లించుస్థితిలో లేరని మాకు తెలియవచ్చుచున్నది. దినదినమును మాకష్టములు వికృట మగుటంబట్టి రాజద్రోహియగు రామదాసు నుద్యోగమునుండి తొలగింపవలయుననియు, నాతనియొద్దనుండి పైకమును రాఁబట్టి యెప్పటియట్ల మాకు సుఖములను గలుగఁజేయ వలయుననియు హిందూమహమ్మదీయులమైన మేము మిమ్ములను బ్రార్థించుచున్నాము. అతని యాధిపత్యముక్రింద మేమొక క్షణమైన బ్రతికియుండ నేరము.

ఇట్లు తమవిధేయులు,

భద్రాచల పౌరులు.

ఇట్లక్కన్నగారు చదివిముగించిన వెంటనే మాదన్న "మిగిలిన సంగతులెట్లున్నను రామదాసు సర్కారునకు బాకీ పడినసంగతి మాత్రము రూఢమగుచున్నది. ఆతాలూకా నుండి యిటీవల పైకము రాకుండుటయే యిందుకునిదర్శనము. మఱియు—

తానీషా—వాస్తవముగ నాఱులక్షల రూపాయలు బాకీయుండునా? లెక్కలను దెప్పించిచూడుడు.

మాదన్న—లెక్కలను జూచితిని. వాయిదా కొకటి న్నరలక్షవంతున నీమూడు వాయిదాలకుఁ బైకమెక్కడ నుండి వచ్చినది? అచ్చటనుండు బొక్కసములోని యొకటిన్నర లక్ష సహితము ఖర్చయి పోయినదట.

అక్కన్న—అయిన నాఱులక్షల రూపాయలను రామదాసివ్వవలసినట్లు తేలుచున్నది.

తానీషా—మాదన్నగారూ! ఈవిషయమై నాకేమిచే యుటకును దోచకున్నది. ఈమూడులక్షలరూపాయలకును రామదాసుగారు విజ్ఞాపన బంపుకొనియున్నాఁడు. కాని దీని నంగీకరించుటకిది తరుణముగాదు. మహమ్మదీయు లిప్పటికే నన్ను మితిలేనట్లు దూషించుచున్నారు. ఇందన్యాయముగ, బ్రవర్తించుట కష్టసాధ్యముగదా?

మాదన్న—అణుమాత్రమైన మీరన్యాయముగఁ బ్రవర్తింప నవసరములేదు. రాజధనాపహారణ మొనరించువారి కేశిక్షతగియున్నదో యాశిక్షను విధించుడు.

తానీషా.—పైకమును జెల్లించువఱకు నతనిఁ జెరసాల యందుంచ వలయును. పిమ్మటఁ జూచుకొందము. రామదాసు గారికిట్టి శిక్ష విధించినచో మహమ్మదీయులు పట్టణమంతయు నల్లకల్లోలము గావింతురు రామదాసుగారెప్పుడు పైకమును జెల్లింపఁగలఁడో జవానులనంపి కనుగొందును. చెల్లింపకున్న జెరసాలకంపెదను. నేనే స్వయముగ నుత్తరువునంపెదను. నేనీ పనిని నామనస్ఫూర్తిగఁ జేయుటలేదు. ఇందుకు మీరు నాపై గినియకుఁడు.

మాదన్న.—మీపై నేల కోపింపవలయును. న్యాయపథమును విడిచి వేఱొక మార్గమున నడువవలయునని నేనెట్లు చెప్పఁగలను. ఇందులకై చింతించినఁ బ్రయోజనముండదు. శ్రీరామచంద్రుఁడే రామదాసును విపత్సముద్రమునుండి రక్షింపఁగలఁడు.

అక్కన్న.—ఆహా! దైవఘటన దప్పింప నెవరితరము !

పిమ్మటఁ దానీషాయక్కన్న మాదన్నలకు సెలవొసంగి తనయంతఃపురమునకుఁ జనియెను. అక్కన్నమాదన్నలును భావికాలదుస్థితులను గుఱించి యోచించుకొనుచుఁ దమనివాసంబుల కఱిగిరి.

# 20 వ ప్రకరణము

తానీషాచేఁ బంపఁబడిన యధికారులును, భటులును భద్రాచలమున కఱిగి రామదాసుకు రాజునాజ్ఞ నెఱింగిచిరి. అతనికడ ధనమేమియును లేదు. అతఁడించుకైన దుఃఖంపలేదు. రాజునాజ్ఞకుఁ దానుబద్ధుడైనట్లును, రామభద్రుఁడే తన్నురక్షించునాథుఁడనియు నతఁడావచ్చిన భటులకు జవాబిచ్చెను. పాపమాతని సతీతిలకము పట్టరానిదుఃఖముతో 'నాథా! నిరంతము రామచరణ సరోజకైంకర్యమునందే కాలముగడపు మీకా కారాగృహప్రాప్తి గలుగుట! మీరారాముని నమ్మి దేహార్థప్రాణమానంబుల నప్పగించి నందులకా యిట్టి ప్రతిఫలము ఘటిల్లుట! రామా! శ్రీరామ!" యనుచు నూరక వలవించుచుండెను.

ఇరుగుపొరుగువారి కీసమాచారము దెలియవచ్చెను. వారందఱు రామదాసుగారి గృహముకడ కరుదెంచిరి. క్రమముగ జనులెల్లరచ్చట గుమిగూడుచుండిరి. రామదాసును జెఱసాలకుఁ బట్టుకొని పోవుచున్నారను వార్త భద్రాచలమంతయుఁ దెలిసిపోయెను. హైందవుల యాందోళనము వర్ణనాతీతము. స్త్రీలు, పురుషులు, వృద్ధులు, బాలురు, బాలికలు, అందఱు తమపనులనుమాని రామదాసుగారి గృహముకడఁ జేరుచుండిరి. వారిలోఁ గొందఱు దేవునినమ్మిన వారికే నిక్క

ముగ లెక్కకు మిక్కుటంబగు గష్టములు గల్గుచుండునని యను
కొనుచుండిరి. మఱికొందఱు దేవుఁడు లేఁడనిరి. మఱికొందఱు
'తానీషాకూడనిట్టి యకృత్యమునకుఁ బాల్పడెనా' యని యా
చ్చెరువొందు చుండిరి. కొందఱు దుఃఖించుచుండిరి. ఎవ రైన
నేమి వారికర్మమును వారనుభవింపక తప్పదని మఱికొంద
ఱనుకొనుచుండిరి. కొందఱు ముందునకుఁ ద్రోసికొనిపోయి
రామదాసును జూచుచుండిరి. ఈవార్తను విన్న మహామ్మదీ
యులసంతస మింతింతయని చెప్పుట కలవికాదు. వారీవిష
యమై దూరమందున్న తమమిత్రులకు వార్తలనంపుచుండిరి.
తమయుద్యమమునందు విజయము గలిగినందునఁ బలువురు
పలువిధములఁ దమయుత్సాహమును వెల్లడి చేయుచుండిరి.
భక్తులగు వారి హృదయములు నీరయిపోవుచుండినవి. వారం
దఱు రామదాసుగారినిఁ జుట్టుకొని రామనామసంకీర్తనలఁ గా
వించుచుండిరి వారినయనంబు లశ్రుపూరితంబు లయ్యెను.
వారిలోఁ గొందఱు దుఃఖము నాపుకొనఁజాలక బిగ్గఱగ నేడ్చు
చుండిరి. రామదాసుగారికి మాత్రము మనస్సు చలింపలేదు.
అతనియుత్సాహమున కించుకైన కళంకము గలుగలేదు.
కాలమాహాత్మ్యమునకు మాత్రమాతఁడచ్చెరువొందుచుండెను.
అతఁడు తన్నుఁ జుట్టుకొనియున్న భక్తులింకను వ్యామోహ
ముచేఁ బీడింపఁ బడుచున్నారని యెఱింగి వారికిఁగొంత వేదాం
తమును బోధించెను. రామదాసు పైకమును జెల్లింపకున్న

మొదల నాదినము న సాయంకాలముననే యతనిని జెఱసాలకు గొనిపో వలసినట్లు ప్రభువులాజ్ఞాపింపఁ బడియుండుటచే రామ దాసుపైకమును జెల్లింపకున్నందున నతని చేతులకు నినుపసం కెలలు దగిలింపఁబడెను. అతని భార్య దీనినంతయుఁ జూచుచు ధారలుగట్టు కన్నీళ్లు విడుచుచుండెను. ఆమెయవస్థను గనిన రామ దాసు "కాంతా! నీవింకను సంసార వ్యామోహమునఁబడి లే పించుచున్నావు. రామచంద్రుని దయ మనపై సంపూర్ణము గనున్నంతవరకు మనకే కొంతయుఁ గలుగనేరదు. శ్రీరా మచంద్ర! మహాప్రభో! సీతాపతే! దశరథరామా! నిన్నే మని పొగడఁగలను. నీప్రభావమును శ్రుతులు వర్ణించుచున్నవి. నీయనంత కల్యాణగుణము లనెడి జలరాశిని వాల్మీకి, పరాశర, వ్యాస, శుకాది మేఘములాశ్రయించి తజ్జలమును బానము చేసి జీవులను సస్యములకు ధారకముగ వర్షించుచున్నవి. బ్రహ్మాది దే వతలును, సనకాది యోగులును, నారదాది దేవఋషులును, ప్ర హ్లాదాది భక్తులును నిన్ననవరతము భక్తిపరవశులై స్తుతించుచు న్నారు. అంతము లేనట్టిదియు' కామక్రోధ మోహాదులనెడి తిమి తిమింగిలాదులచే మిగులభయంకరమునగు సంసారసాగరమును దాటుటకు నావయైయుండు వాఁడవై యుపదేశపరంపరలచే నె ఱుఁగఁబడినవాఁడవై, యనంతశక్తి యుతుఁడవై; నిత్యమై, తేజో మయమై వెలుంగుచుండు దివ్యమంగళవిగ్రహముతోఁగూడి ప్రకాశించువాఁడవు నీవే! నిన్నే మనిపొగడఁగలను! భద్రా

చలరామా! నీసంపూర్ణకరుణాకటాక్షము నాపైనుండ నాకా రాగృహము నన్నేమిచేయఁగలదు—ఈసంకెలలు మాత్రము నన్నుబాధించునా?" యనుచుఁ జేతులనించుక విసరెను. ఇను పసంకెలలు తుత్తునియలైనవి. జనులలోఁ గలవరముదయించెను. అందఱాశ్చర్యపడిరి. శ్రీరామచంద్రుఁడెట్లయిన రామదాసుగారిని జెఱసాలనుండి విడిపింపఁగలఁడని వారందఱునిర్ధారణ చేసిరి. దీనినంతయుఁ జక్కఁగఁ గనుచున్నభటులు నివ్వెరపడిపోయి తమ యపరాధములను క్షమించునటుల రామదాసును వేడిరి. రాజునాజ్ఞ యుల్లంఘనీయము కానందున మఱల రామదాసుగారికి సంకెలలు దగిలింపఁబడెను. తన ప్రభావముచే రామదాసు చెరనుండి తప్పించుకొని పాఱిపోవునా? ప్రబలరాజద్రోహము! దొంగవలెఁదప్పించుకొని పాఱిపోవుటకు రామదాసుగారా సమ్మతించుట! ఏటిమాటలు! అట్టిమహాత్ముగల మహనీయుఁడు తానీషాగారి కాఱులక్షలరూపాయలనుమాత్రము చెల్లింపలేకుండునా? తనపాలిటి దేవుఁడే యామొత్తమును జెల్లించితీరును. భగవంతునికై వెచ్చింపఁబడిన మొత్తమును దేవుఁడివ్వక వేఱెవ్వరిత్తురు? ఇట్టి దృఢనమ్మకము రామదాసుగారి నెప్పుడు నెడబాసియుండినదిలేదు. సంకెలలఁదగిలించినపిమ్మట భటులాతని వెంటఁబెట్టుకొని గోలుకొండకుఁ బయనము సాగించిరి.

# 21వ ప్రకరణము.

రాజునాజ్ఞ ననుసరించి రామదాసు చెఱసాలయందుంచఁబడెను. మహమ్మదీయుల కండ్లుమంట చల్లారినది. వారందఱివలె నిబ్రాహీము మాత్రమంతగ నిందులకు సంతసింపలేదు. ఇంకను నీర్ష్యానలమాతని దహించుచునేయుండెను. సితారా తానీషాకడఁ బట్టిన మొండిపట్టుదల సంపూర్ణముగ సఫలీకృతము కానందుల కాతఁడూరక చింతించుచు సదా రౌద్రాకారమునే వహించి యుండెను. సితారాసహిత మిట్లే తన భర్తపైఁ గ్రోధమువహించి యాతని పరిపరివిధముల వేధించుచుండెను. పాపము! తానీషా యేమిచేయఁగలఁడు? అక్కన్న మాదన్నల నుద్యోగమునుండి తొలగించుటకిది తరుణముగాదు. మొగలాయిసైన్యము నేఁడో రేపో పట్టణముపైఁ బడఁగలదను వార్త యనుదినమును వచ్చుచుండుటచేఁ బెల్లుభయమతని నొకవంక బాధించుచుండెను. కొందఱు మహమ్మదీయులేకమై చుట్టుపక్కలనుండు గ్రామములను గాల్చి జనులను భీభత్సపట్టించుటచేఁ గలిగిన యుపద్రవముల నణచి శాంతిని స్థాపింపవలెననెడి యాతురత యతని వేఱొకవంకఁ గష్టపెట్టుచుండెను. మఱియు సకలవీరాగ్రనంద్య శౌర్యోజ్జ్వలుండగు శివాజీప్రభువు తన మహారాష్ట్రసైన్యంబుల నాయత్తపఱచుకొని వచ్చి సంగరంబున సాయమొనర్చెద నని యిదివఱకే

వాలేఖలనంపియుండెను వీటినన్నిటిని సమర్థించుకొని పనిచేయుటలో అక్కన్నమాదన్నలవంటి నిపుణులెవ్వరును లేరు. అక్కన్నమాదన్నలనిన బ్రాణసమానులుగ నెంచుచుండిన తానీషా యిట్టిసందిగ్ధసమయములందు వారి నుద్యోగమునుండి తొలగించి యేమిచేయఁగలఁడు? అందుచే నతఁడెంతమాత్ర మట్లొనర్పఁగూడదని తీర్మానించుకొనెను. ఈవిషయమున నతఁడు తన భార్యపట్టుదలను సహితము పాటింపలేదు రామదాసును జెఱసాలయందుంచుటచే నామె శాంతించునని యతఁడు దలంచెను. కాని, యామె యక్కన్నమాదన్నల నింకను నుద్యోగమునుండి తొలగింపనందులకుఁ గారణమారయుటకు వేచియుండెను ఇబ్రహీ మొనరించు కార్యముల సారాంశమును దనపరిచారికల వద్దనుండి యామె గ్రహించుచుండెను ఇబ్రహీము బ్రతిదినము జరిగినసంగతులను బూసగుచ్చినట్లు రాణివాసమునకుఁ జెప్పి పంపుచుండెను. అక్కన్నమాదన్నల సహాయమున నాంగ్లేయులు దేశమున మంచిపలుకుబడిని సంపాదించుకొనిరి. ఇప్పుడు వారి వ్యాపారముల కేలాటియభ్యంతరములు గలుగుటలేదు. అందుచే వారక్కన్నమాదన్నలయెడ స్నేహభావమును వహించి వారిని గౌరవించుచుండిరి. వారు తమదేశమునుండి తెచ్చిన వింతవస్తువులను బలుమారు వారికి బహుమానముగ నిచ్చుచుండిరి. మాదన్నగారి కుమారుఁడగు మల్లన్నకు వివాహమైనతఱి చెన్నపట్టణము

లోని యింగ్లీషువారు విశేషబాగారపుగొలుసులను గానుక గఁ బంపిరి. తమకు విరోధులగు నియమాత్యశేఖరులిట్లు గౌరవమును బొందుటనుజూచి మహమ్మదీయు లోర్వఁజాలక పోయిరి ఇబ్రహీము నతని సహచరులును నింగ్లీషువారిని దేశమునుండి వెడలఁగొట్టఁ బ్రయత్నించి పెక్కుకష్టములకు వారిని లోనఁగఁజేసిరి కాని కంపెనివారి పలుకుబడి మిక్కుటముగ నుండుటంబట్టి మహమ్మదీయుల యత్నములన్నియు విఫలములగుచుండెను. ఇవన్నియుఁ జేరి యిబ్రహీమును వెఱ్ఱివానినిగ జేసివైచినవి. అందుచే నతఁడు గుట్టతుద కక్కన్నమాదన్నల యసువులకే యెసరువెట్ట నిశ్చయించి తన సహచరులతో నా విషయమై యాలోచించుచుండెను

ఇది యిట్లుండఁ జెఱసాలలో బంధింపఁబడిన రామదాసు మిక్కుటమగు బాధల ననుభవించుచుండెను. కావలిగాయువారందఱు మహమ్మదీయులే యగుటచే వారందఱిబ్రహీముచేఁ బ్రేరేపింపఁబడి రామదాసును బహువిధములఁగష్టపెట్టుచుండిరి. ఆహా! పరమభక్తాగ్రేసరున కెన్నికష్టములు! కొరడాదెబ్బలకు సందులేదు.—ఎఱ్ఱగగాలిన నినుపసలాకుల వాతలకు విరామము లేదు.—మిడిమిడిగ్రాగు నెండలోనుండ జేయుటకంతము లేదు.—నీళ్ళుచెదిపోయించుటకు సందులేదు. ఎన్నిపనులు,—ఎన్నిదండనలు రామదాసుగారు రామభక్తి

నిమాత్రము మాన లేదు. — అతనికించుకైన బాధ లేదు! కొఱడావాతలతని దేహముపైఁ బడుట లేదు! పడినను వెంట నే జల్లగ మాసిపోవుచుండెను. అగ్నితప్తలోహము సహిత మాతని శరీరముపై మంచువలెఁ జల్లనయిపోవుచుండెను. అతఁడూరక రామునిస్తుతించుచుండెను.—నిద్రలో సహితము గలువరించుచుండెను.—అతఁడొక నాడర్ధరాత్రమున నేడో కలగని వెంటనే మేల్కాంచి "ఆహా! శ్రీరామచంద్రా! నీవెంతమోసగాఁడవు. నేనే యపరాధ మొనరించితిని. అగుపడినట్లే యగుపడి యేలమాయమయితివి? భద్రాద్రివాసా! శ్రీరామచంద్రా! కోసలేంద్రా! రాక్షసభీకరా! కంజనేత్రా! నేను నీకన్యమగు దైవమునుగాని, నీసంకీర్తనకన్న నన్యముగువార్తలనుగాని యెఱుగను. ఓయనంతా! యేభక్తునిరక్షించుచు నన్నుమఱచితివి? నేను నిన్నుతలచుకొని యేడ్చుశబ్దము నారసమై సోకలేదా! భక్తవత్సలా! భక్తపరాధీనా! నేననుభవించునట్టి యీచెఱసాలబాధ నీకన్నులకుఁ బండువగనున్నదా? ఓస్వామీ? నీవు చెవులు లేకయే వినుచున్నాడవు కన్నులు లేకయే చూచుచున్నాఁడవు! కాళ్ళు లేకయే పరుగెత్తుచున్నాఁడవు. చేతులు లేకయే గ్రహించుచున్నాఁడవు! రూపము లేకయే నీకిష్టమగు ననేకరూపములను ధరించుచున్నాఁడవు. మహానుభావా! మహాత్ములకును మహత్తైచూచుటకు సాధ్యముకాని స్వరూపముగలనిన్నుఁజూ

చువానికజ్ఞానము నివర్తియగుచున్నది. నీవేయన్నిటికి నాధారభూతుఁడవు. నీవేసర్వలోకరక్షకుఁడవు. సర్వభూతములందును నీవుండ, సర్వభూతములును నీయందణఁగియున్నవి. శ్రీరామబ్రహ్మమనియుఁ, శ్రీకృష్ణుండనియు, గోవిందుఁడనియు వెలయునీకివే యనంతనమస్కారములు. సర్వలోకశరణ్యా! నీయనంతకల్యాణగుణంబులను వర్ణింపనెవరితరము. మహానుభావా! నాకీకారాగారబాధ నివర్తింపఁజేయుట కింకను మనంబురాకున్నదికాఁబోలు! కరుణాసముద్రా! ఆంజనేయప్రియా! సీతావల్లభా! లక్ష్మణానుజా! దశరథాత్మజా! కౌసల్యానందనా! దుష్టశిక్షకా! శరణాగతరక్షకా! సాధుజనప్రియా! ఆర్తజనరక్షకా! రామప్రభో! ” యనుచు మూర్ఛిల్లెను. కొంతసేపటికతఁడు మూర్ఛనుండి లేచెను.

## 22 వ ప్రకరణము.

పరమభక్తాగ్రేసరుఁడు. మేనల్లుఁడునగు రామదాసునకుఁగారాగారవాసము ప్రాప్తించినందుల కక్కన్నమాదన్నలు మిక్కిలి చింతనొందిరి. కాని వారించుకైన నతృప్తిఁజెందక యెప్పటివలె రాచకార్యములను జక్కఁబెట్టుచుండిరి. ఆహా! కాలవిపరీతమును నేమనఁదగును. ఈశ్వరసృష్టియందు సర్వంబును గాలవశమైయున్నది! అక్కన్న మాదన్నల ప్రభావప్రతి

పత్తియిప్పుడించుకించుక తగ్గిపోవుట కారంభమైనది. పూర్వము తమపక్షముననుండి తమకులోఁబడియున్న మహమ్మదీయులలోఁ గొందఱు పరపక్షమునఁజేరి వారికి సాయమొనర్చుచుండిరి. హిందువులలోఁ గూడఁ గొందఱు వారినిఁ బూర్వమువలె గౌరవపురస్సరముగఁజూచుటకు మానివేసిరి. అమాత్యశేఖరుల కీవిషయము బాగుగఁదెలియవచ్చినది ఇదంతయును మహమ్మదీయులొనరించు దుండగములని వారు బాగుగ నెఱింగిరి. ఇబ్రహీము సమ్మోహనాస్త్రప్రయోగమునందు నిపుణుఁడు. రామదాసు చెఱసాలలో బంధింపబడినది మొదలు వాని బాణము బాగుగ సాగుచుండెను. హిందువులు ద్రోహులని నమ్మనివారికతఁడు నమ్మకమును గలుగఁజేయుచుండెను. ఇట్టి పరిస్థితులవిషయమై యక్కన్న మాదన్న లూరక తలపోసికొనుచుండిరి.

రాత్రిదాదాపుగ నెనిమిదిగంటలు కావచ్చుచుండెను. మాదన్నగారింటిలోఁ గూర్చుని యేవో కొన్ని కాగితములను జూచుకొనుచుండిరి. అక్కన్నగారు బయటికెక్కడికో పని మీఁదవెళ్లియుండి యప్పుడేలోనికరుదెంచి 'మాదన్నా! నేఁడెట్టివార్తవినవలసివచ్చినది! కదనక్రీడావిచక్షణుఁడును, మహారాష్ట్రదేశాధీశుండునునగు శివాజీ పరలోకమున కేగెననియుఁ, దనతండ్రియాజ్ఞానుసారము సర్వసైన్యమును దీసికొనివచ్చి సంగరమున మనకుసాయమొనరించునట్లును శంభాజీ యొకయు

త్తరమును వ్రాసిపంపెను. దానినిప్పుడే మనభటుఁడు వాకొసంగిపోయె"నని చెప్పెను.

మాదన్న.—అక్కన్నా! నేఁడెట్టిదుర్దినము! నిక్కముగ నాకట్టి మిత్రరత్నమిఁక దొరకుటదుర్లభము. తానీషా యెట్టి దురదృష్టవంతుఁడు! రాజ్యమునకుఁ దటస్థించిన చిక్కులలో సాయమొనర్చెదనన్న యుద్ధవీరుఁడగు శివాజిగూడ మృతినొందవలయునా? తానీషా రాజీవార్తను వినిన నతని నిరుత్సాహమునకు మేరయే లేదు.

అక్కన్న:—శంభాజి సాయమొనర్చెదనని వ్రాసియున్నాఁడుగదా ?

మాదన్న:—ఎంతమంది శంభాజీలయిన నొకశివాజి కాఁగలరు. అతని ధైర్యసాహసములెవరికబ్బును. శివాజీయనిన మొదలే భీతిఁజెందియున్న మొగలాయిసేనలతనిని మనసైన్యమధ్యమునఁ జూచిన సింగంబును వీక్షించినమత్తగజంబులవైవడి పలాయనముగాకుండురా? అట్టి తరుణమిఁక రాదు. వార్తనంపిన శంభాజి తగినసమయమునకుఁ దనసైన్యమును దీసికొనిరాఁగలుగునాయనుసంశయము నాకుఁ గలుగుచున్నది.

అక్కన్న.—సాయమొనర్చెదనన్న వాఁడు రాకుండునా? వచ్చియే తీరును. మఱియు శివాజిమరణవార్త మహమ్మదీయులకుఁ దెలియఁగలదు, ఇక వారిదుండగములు గూడ మిగుల వృద్ధికాఁగలవు.

మాదన్న:—అక్కన్నా! భావికాలస్థితులను దలంచుకొన్న నాగుండెలు ఝల్లుమనుచున్నవి. మఱియు మనకుఁగల గౌరవము సహితము దినదినమునకును క్షీణించిపోవుచున్నది. మనయుద్యోగులలోఁ గొంద ఱిబ్రిహిముపక్షము జేరి వారికి సాయమొనర్చునట్లు గూడ దెలియవచ్చినది.

అక్కన్న:—రాణివాసముగూడ నిందుఁ జేరినట్లున్నది. పూర్వమీవిషయము మనకంతవిస్పష్టముగఁ దెలిసినది కాదు. మనయాంతర్యమిత్రుఁడగు రజాకు దానినంతయు బాగుగ వాకెఱింగించెను. రామదాసును జెఱసాలయందుంచుటలో సితారా చాలపట్టుపట్టియుండెనట! ఆమె చాలకాలమునుండియు నిబ్రిహిముపక్షమువారికి రహస్యముగఁ గొన్ని వర్తమానముల నంపుచు నందుకుఁదగిన పన్నాగములనుగూడఁ జెప్పిపంపుచుండెనట! ఆమె ఔరంగజేబుకంటె నెక్కుడుగ మనమతమును ద్వేషించుచున్నదట! కడకు మనయుద్యోగములకుఁగూడ నామెయెసరువెట్టనెంచియున్నదట.

మాదన్న:—ఏమేమీ! అంతఃపురవధూమణులవలన నింతటి దుష్కర్మమొనరింపఁబడుచుండెనా? ఆహా! సితారా యిట్టి విషసర్పిణియై యుండునని నాకుఁ దెలియదు. అయినఁ దానీషా సహితము దీనిని మనకు వెలిఁబుచ్చినవాఁడు కాఁడు.

అక్కన్న—అతనికిఁగూడ నీసంగతి యిటీవలనే తెలియవచ్చెనట. కాని భార్యయొక్క దుష్కృత్యముల నతఁడు బయటఁ జెప్పుకొనునా?

మాదన్న:— ఈకారణముంబట్టియే తానీషా యిటీవల మిగుల ఖిన్నుఁడై పోయెను. ఎటుఁబోవుటకును నతనికిఁదోచకున్నది.

అక్కన్న:— ఏదియెట్లున్నను బ్రస్తుతపరిస్థితులలోఁదానీషా మనలను వదలఁజాలఁడు. 'వినాశకాలేవిపరీతబుద్ధి,' యని పెద్దలు బల్కినట్లు రాజ్యమునకు వినాశకాలమాసన్నమగుటంబట్టి సితారా కంతటి విపరీతమైన భావముత్పన్నమైనది. ఆమె మనలనుద్యోగమునుండి తొలగించుటలో విఫలమనోరథయయ్యెనేని పిమ్మట నామె మనప్రాణములను సహితము దీయయత్నింపఁగలదు. ఆమెయంతటిమూర్ఖురాలనుటకే సందియమును లేదు. మహమ్మదీయులుసహితమామె యాజ్ఞాపించినట్లేయొనర్తురు. ఇప్పట్ల మనము మనయుద్యోగములను వదలుకొనినబాగుండునని తలంతును.

మాదన్న— ఆక్రూరు లంతటివారేయగుదురు. అయినను బ్రస్తుతము మనము మనప్రాణములకాసించి యుద్యోగములను వదలుకొనినస్వామిద్రోహులమగుదుము. విధినిదప్పింప బ్రహ్మకైన వశముగాదు. ఇప్పటికిని దానీషా మనపైఁ దనయభిమానమును మానలేదు. ప్రజాపాలనదక్షుఁడనందగుఁదానీషావంటి మహమ్మదీయప్రభువు ప్రపంచమున నిక జన్మించుటయరుదు. అతనిఋణము మనమెన్నివిధంబులనైనఁ దీర్చుకొనఁజాలము. గోలుకొండరాజ్యలక్ష్మి పరమతద్వేషియగు నౌ

రంగజేబు చేతులలోఁ బడకుండునట్లు గాపాడుటకు మన ప్రాణములనైన నర్పింపవలయును. రణరంగమున శత్రుసంహారము గావించి శాశ్వతకీర్తిని ఘటింపవలయును. ఆభద్రాచలరాముఁ డే మనకు దిక్కగుగాక !

అక్కన్న:—భద్రాచలరాముఁ డేమి చేయఁగలఁడు ? ఎవరికర్మము వారనుభవింపక తీరదు. రామదాసునకుఁ జెఱసాలప్రాప్తియగునని యెవరనుకొనిరి? ఆతనికష్టపరంపరలను లెక్కింప నెవరివశము?

మాదన్న.—భగవంతుఁడు తనభక్తులను మొదట నిడుమలగుడిపి, వారినిశ్చల భక్తి నెఱింగి, పిమ్మట వారికిఁ దోడునీడై మెలంగఁగలఁడు. మనరామదాసన్ననో యరిషడ్వర్గములను జయించినధీరుఁడు. అతనిభక్తి నిశ్చలమైనది. రామభద్రుఁడాతని రక్షించియే తీరును, కారాగృహబంధవిమోచనమాతనికిఁ గలుగఁగలదు. శుభవార్త మనచెవులఁ బడఁగలదని' చెప్పెను.

కొంతసేపు వారిట్లు మాట్లాడుకొని చాలఁబ్రొద్దగుటచే భోజనమునకై తమతావులనుండి లేచి పోయిరి.

## 23వ ప్రకరణము.

అసహాయశూరుండును, మహారణప్రియుండును నగు శివాజి మరణించెనను వార్త తానీషాకుఁ దెలియవచ్చినది మొ

దలాతని మనోవేదనకు మేరయేలేదు. శివాజివంటి యితరరణశూరులెవ్వరాతనికి సంగరంబున సాయమొనర్చుటకు సంసిద్ధులైయుండలేరు. మహమ్మదీయులొనరించు కార్యములవలన నచిరకాలములోనే యుద్ధముదటస్థింపఁగలదని యతఁడుదెలిసికొనెను. క్రమక్రమముగ నెందఱో రాజద్రోహులు రాజ్యమునందు నిండియున్నట్లును, రాజపరివారమునందుఁ గూడ ననేకులావిద్రోహులతోఁ గలిసి పనిచేయుచున్నట్లాతనికి గూఢముగఁ దెలిసి పోవుచుండెను. రాజద్రోహులసంఖ్యయభివృద్ధి నొందుకొలందిని నరహత్యలసంఖ్యకూడఁ బ్రవర్ధిల్లనారంభించెను. రాజద్రోహులందఱును గలిసి యక్కన్న మాదన్నలపై ద్వేషభావమును వహించి వారిని గుదముట్టింపయత్నించుచున్నారనియు నిట్టి ప్రయత్నములలో సితారాసహితమించుకభాగముగొనుచున్నదనియు నతఁడు గనుగొనెను. అక్కన్న మాదన్నలకిట్టి దుస్థితిసంభవించుటకుఁ దానీషామిగులనొచ్చుకొనుచుండెను. ఎల్లపను వారిని గాపాడ నతడు దీక్షవహించెను. వారి కే యాపదగలుగకుండునట్లు ప్రత్యేకభటులను సదా వారివెంటనుండునట్లతఁడేర్పాటు గావించెను. అక్కన్న మాదన్నలును జనులకుఁ దమయెడలఁగలిగియున్న దురభిప్రాయములను బారఁదోలుటకుఁ బ్రయత్నించుచు న్యాయాన్యాయములను నిరూపించుచుండిరి. కాని ప్రయోజనమగుచుడలేదు. సదా వీరివిషయమును దలచుకొనుచుఁ దానీషామిగు

లఁ జింతాక్రాంతుఁడై యుండెను. వీటియన్నిటి నడుమ రాఁ
బోవుసంగ్రామము వలని భీతి యతనిని మఱింత బాధించుచుం
డెను. నిద్రాహారములయందు సహిత మాతనికిఁ బూర్వమువ
లె నిష్టము లేదు. రాత్రులలో నెంత ప్రయత్నించినను నాత
నికిఁ గూర్కు పట్టుట లేదు.

తానీషా యెప్పటివలెఁ దనపడకపైఁ బరుండి నిద్రించుటకుఁ
బ్రయత్నించుచుండెను. కాని యతనికి నిద్రవచ్చినది కాదు.
అతని హృదయవారిధినుండి యోచనాతరంగములుద్భవిల్లు
చు వెంటనే భిన్నభిన్నములై పోవుచుండెను. సితారా తానీ
షాకు వెంబడిగనే వేఱొకశయ్యపైఁ బరుండి గాఢముగ నిద్రిం
చుచుండెను. రాత్రినిశీథసమయమగుటచే రాజప్రాసాదమం
తటను గంభీరనిస్తబ్ధభావము నెలకొనియుండెను. వృక్షా
గ్రంబులయందున్న పర్ణములు సహితము నిశ్చలములై యుండె
ను. ప్రకృతియంతయు నిద్రించునట్లగపడుటచేఁ గాఁబోలు తా
నీషాకు సహిత మించుక కూర్కువట్టినట్లుగన్పట్టుచున్నది

అట్టిసమయమునఁ దానీషా పరుండియున్న గదితలు
పు గుభాలునఁ దెఱవఁబడెను. వెంటనే తానీషాచక్రవర్తీ!
లెమ్మనెడివాక్యము గదియంతయుఁ బ్రతిధ్వనించినది. ఆశబ్దము
నకుఁ దానీషా నివ్వెరపడి లేచి కూర్చుండెను. తత్క్షణమే గదిలోని
కిద్దఱు యువకులు ప్రవేశించిరి. వారిముఖవిలాసములు ప్ర
కాశమానములై శతమన్మథులను సహితము దృణీకరించు

డెను. తానీషా వారిని జూచిన వెంటనే వారెవ్వరో రాజకు మారులని తలంచెగాని వారు ధరించియుండు యుడుపులను బట్టి వారు రాజభటులని యతనికిఁ దెలియవచ్చెను. వారికిట్లు సంభాషణజరిగెను.

తానీషా:—మీరెవ్వరు? ఎచ్చటనుండి వచ్చుచున్నారు?

భటులు:—మేమెవ్వరమైనదియు మా వేషములవలన నీవుగ్రహించలేవా? మేము భద్రాచలమునుండి వచ్చుచున్నాము.

తానీషా:—మీ పేరు లెవ్వి?

భటులలో నొకఁడు:—నాపేరు రాముఁడనియు,నతని పేరు లక్ష్మణుఁడనియు నందురు.

తానీషా:—మిమ్ముల నెవ్వరంపిరి.

రామలక్ష్మ.—రామదాసుగారు పంపగ నిచ్చటికి వచ్చితిమి.

తానీషా—అయిన, మీరు రామదాసుగారి భటులా?

రామ—లక్ష్మ— రామదాసుగారివంటివారికందఱికిని మేముభటులమే.

తానీ—అట్లన నాకర్థము కాలేదు.

రామ—నీవర్థముచేసికొన లేనిస్థితి యందున్నావు నీవంటివారి కది యర్థము కాదు.

తానీషా—అయిన మీ రేల యిటువచ్చితిరి ?

రామ, లక్ష్మ—రామదాసుగారిని చెఱసాలనుండి విడిపించుటకు.

తానీషా—అది మీచే నగునా?

రామ, లక్ష్మ—కాకున్న నిటువత్తుమా?

తానీషా—రామదాసుగా రివ్వవలసిన బాకీ మొత్తమాఱులక్షల రూప్యములను దెచ్చియున్నారా ?

రామ, లక్ష్మ—ముందు విడుదల పత్రికను వ్రాయుము. పిమ్మటఁ బైకమును జెల్లించెదము.

తానీషా—మిమ్ముల నమ్మి విడుదలపత్రికను వ్రాయను. పయికమును ముందుగఁ జెల్లింపవలయును.

రామ, లక్ష్మ—మమ్ముల నమ్మకుండినందున నే నీకీదుర్గతిసంభవించినది.

తానీషా—ఏమంటిరి ? మీపొగరుమాటలను జాలింపుడు.

రామ, లక్ష్మ—ముందుగ నీ వెడగుమాటలను జాలించి విడుదల పత్రికను వ్రాయుము.

తానీషా—పైకమును జెల్లింపుడు.

రామ, లక్ష్మ.—అయిన నీద్రవ్యమును గైకొమ్ము.(సంచులతో ధనమునుంచెదరు.) మమ్ము నీవు నమ్మజాలకున్నను

నిన్ను మేము నమ్మితిమి. రామదాసును జెఱసాలనుండి విడిపింపుము”ని యదృశ్యులైరి.

దీనింతయుఁ గనిన తానీషాకేమియుఁ దోపలేదు. కొంతసేపువఱకాతఁడది కలయని భ్రమపడుచుండెను. కాని నికరముగ నతఁడు మేలుకొనియున్నట్లుకూడఁ దెలిసికొనెను. పిమ్మట నతఁడచ్చటనున్న ధనమును బరిశీలించి వెంటనే విభ్రమచేతస్కుఁడయ్యెను. ఇంతవఱకును గాఢముగ నిద్రించుచున్న దనభార్యను “సితారా! సితారా. యని తత్తరపాటుతో నతఁడు మేల్కొలిపెను. సితారా నిద్రనుండి లేచి” ఏమియని భర్తనుబ్రశ్నించెను!

తానీషా—సితారా! ఏమనివచింతును. ఎవరో రామలక్ష్మణులట వారు రాజభటులవలెఁ గన్పట్టుచుండిరి. రామదాసు చెల్లింపవలసిన పైకమునంతటిని చెల్లించిపోయిరి. విడుదల పత్రికనుసహితము వ్రాయకమునుపే వారు నాకంటి కదృశ్యులైరి.

సితారా—మీరెప్పుడును రామదాసు యొక్కయు, అక్కన్న మాదన్నలయొక్కయు విషయములనుగుఱించియే తలంచుకొనుచుందురు. కలవరించుచుందురు—వారే మీకు గలలయందు సహితము దర్శనమొసగుచుందురు. వెఱ్ఱితలంపులు—పిచ్చిమాటలు—కలగంటిరి.—పండుకొని నిద్రించుడని సితారా మఱల నిద్రించుట కారంభించెను.

తానీషా—సితారా! సితారా! నీవింకను నీవ్యామోహమును వదలలేదా? నీపట్టుదలను విడువలేదా? ప్రాణముపోయినవానిని బల్లెముతోఁ బొడిచినట్లు నీవింకను నన్నేలఁ దూలనాడెదవు? నాపాలిదేవుఁడు నాకుఁబ్రత్యక్షమయ్యెను. ఈనిర్భాగ్యుఁడే యాదివ్యమూర్తిని గనుఁగొనలేకపోయెను. (స్వగతము) మహానుభావా! మిమ్ములననరానిమాటలనెన్నిటినోయంటిని. నాపాలిదేవులని కనుగొనఁజాలకపోతిని. (పైకి) సితారా! లెమ్ము. లెమ్ము. ఈశ్రీరామమాడలనైన దిలకించి నీపాపమును బాపుకొనుమని" చెప్పెను.

ఇప్పట్టునఁ దనభర్త పలుకునది నిక్కమని సితారాగ్రహించినది. ఆమె తనశయ్యపైనుండి లేచి నలువంకలఁబరీక్షించినది. రామలక్ష్మణులు చెల్లించి పోయిన ధనమంతయు నామెకగపడెను. ఆమె ధనమున్నసంచులయొద్దకుఁబోయి నాణెములను బరీక్షించుచుండెను. అంతఁ దానీషా "సితారా! నాణెములను బాగుగఁ బరీక్షింపుము. వాటిపై శ్రీరామా" యని వ్రాయఁబడియున్నది. భద్రాచలమునుండి రామలక్ష్మణులే భటులవేషమును ధరించి తమ భక్తుఁడగు రామదాసును సంరక్షింపనెంచి పైకమునుదీసికొనివచ్చి చెల్లించిపోయిరి. కానిచో నీ నిశీథసమయమున మనయంతఃపురమును బ్రవేశించుటకు మానవమాత్రులకు శక్యమగునా?! ఆహా! రామదాసుగారి నెన్నివిధములనో బాధించితిమి. రేపుదయమున నాతని బంధవిమోచనునిగ నొనరింపవలయును.

తానీషా చెప్పుమాటలకు సీతారామాంబువల్లకనిశ్చేష్టితురాలై నిల్చియుండెను. భద్రాచలమునుండి రామలక్ష్మణులే నిజముగవచ్చి పైకమును చెల్లించిరని యామెదృఢముగనమ్మెను. ఆమహాపురుషులను దర్శించుభాగ్యము దనకుఁ గలుగనందుల కామెమిగులఁ జింతిల్లుచుండెను. సీతారాభావములు వేఱువిధముగఁ బరిణమిల్లుట కారంభమైనవి. ఆమెహృదయాంతరాళమునఁ బశ్చాత్తాపప్రభంజనము వీవ నారంభించినది.

## 24 వ ప్రకరణము

తెల్లవారినది. ఆదినమున రామదాసు చెఱసాలనుండి విడుదలకాఁబడుననువార్త పట్టణమంతయు వెల్లడియైపోయెను భద్రాచలమునకుఁ గూడ నీవార్త యెట్లో తెలిసిపోయెను. రామదాసుకు స్వాగతమొసంగుటకుఁగాబోలు రామభక్తులందఱు గోలుకొండకు రామభజనయొనర్చుచు బయలుదేరిపోవుచుండిరి, రామలక్ష్మణులు తానీషాకుఁ బ్రత్యక్షమై పైకమును జెల్లించిపోయిరను సంగతి పట్టణమంతయు వ్యాపించిపోయినది. జనులందర దద్భుతానందవిభ్రాంతచేతస్కులైరి. కొందఱు రామదాసుయొక్క భక్తిని వేనోళ్ళఁగొనియాడిరి. మఱికొందఱు తానీషాయదృష్టమున కచ్చెరువొందుచుండిరి. మహాత్మ

దీయులందరట్లు జరిగియుండదని నిర్ధారణచేయుచుండిరి. రామదాసును జెఱసాలనుండి విడిచిపుచ్చుటకై తానీషాయిట్టిపన్నాగమును బన్నెనని వారు జనులకుఁ జెప్పుచుండిరి. కొందఱీమాటలను నమ్మిరి. మఱికొందఱు వారినే దూషించుచుండిరి రామదాసుకుఁ గూడ నీవార్త దెలియవచ్చినది కాని యాతఁడు దానిని నమ్మలేదు. ఆవిషయమును నతఁడంతశ్రద్ధతో విచారింపలేదు అతఁడెప్పటివలె శ్రీరాముని భజించుచుండెను. కొంతమందిమహమ్మదీయులు నిజమెఱుంగుటకై తానీషాగారి నగరునకుఁ బర్వెత్తుచుండిరి.

పదిమొన్నున్నను జాముప్రొద్దెక్కునఁకి గోలుకొండలో రామదాసుగారున్న చెరసాలవద్ద వందలకొలది జనులుమూగిపోయిరి భద్రాచలమునకువచ్చిన భక్తశిఖామణులందఱు చెఱసాలను సమీపించి రామభజనము సల్పుచుండిరి. వారెందులకచటికి కరుదెంచినది రామదాసు విచారింపలేదు. కానియతఁడుగూడఁ జెఱసాలయందుండి భక్తులనను సరించి భజనచేయుచుండెను. ఇంతలోఁ దానిషాయును, అక్కన్నమాదన్నలునువచ్చుచున్నారను కేకలు వినవచ్చినవి. జనసమూహాము వారికి దారినొసంగుటకై యించుక యొదిగి నిలువఁబడుచుండిరి. తానీషాయును, అక్కన్న మాదన్నలును జెఱసాలనుసమీపించిరి. రామదాసు తన మేనమామలగు నక్కన్నమాదన్నలకు నమస్కరించి తానీషాకు సలాములొనర్చెను. పిమ్మ

టం దానిషా రామదాసునుద్దేశించి 'రామదాసుగారూ! నే నొనర్చిన యపరాధములను మన్నించి చెఱసాలనుండి వెడలి రండు నేటితో మీకు బంధవిమోచన మైనదనెను.

రామదాసు—నీవేమియపరాధ మొనర్చితివి? నిన్నేల మన్నింపవలయును? నాఋణముదీరిన వెనుకం గదా నేనాకారాగృహమునుండి బయటికిరావలయును?

తానిషా—మహానుభావా! మీఋణముతీరిపోయినది. భద్రాద్రినుండి రామలక్ష్మణు లరుదెంచి మీరివ్వవలసిన పైకమును జెల్లించిపోయిరి. చెఱనుండి బయలువెడలుండు. మీ సంకెలలను దీసివేయింపవలయును

రామదాసు— రామలక్ష్మణులేమి, భద్రాద్రినుండి వచ్చుటేమి ? ఋణ మెట్లుదీరెను? నాకిందించుకైన నమ్మకము లేదు. నాయప్పుదీరువఱకు నేనిందేయుండెదను.

తానిషా—భక్తాగ్రేసరా! మీనిర్మలమగు భక్తినెఱుంగని యీసర్వాభాగ్యుని నేల యింకను నొప్పింతురు. మిమ్ముల నింతకాలము కష్టపెట్టితిని; లెక్కలేనిదుష్కృత్యముల నొనరించితిని. కాన నాయపరాధములనన్నిటిని మన్నించి కారాగృహమునుండి బయటకురండు.

రామదాసు—నాకొక్కటియును దెలియదు. ధనమును జెల్లించినవారిని నాకు జూపుము. పిమ్మట నిక్కమనితలంతును.

మదానుకుఁగల భక్తిప్రభావమున కచ్చెరు వొందుచుఁ దమ నివాసంబుల కఱిగిరి.

## 25 వ ప్రకరణము.

రామలక్ష్మణులు దానీషాకుఁ బ్రత్యక్షమైన వెనుక నతని నడవడిక సంపూర్ణముగ మాఱిపోయినది. రాజజీవనము సర్వదా చింతాకరమైనదనియు, దుఃఖావాసమైనదనియు నతఁడు దలంచెను. అతనికి హిందువులపైఁ బూజ్యభావము హెచ్చినది. అతఁడు సహితము రామనామస్మరణ గావించుకొనుచు రాజ్యాంగవ్యవహారములన్నిటిని యక్కన్న మాదన్నలవశము జేసి, సదా సద్విషయములలోనే కాలముగడపుటకుఁ బ్రారంభించెను. అంతఃపురమున రామలక్ష్మణులు చెల్లించిన పైకమునుజూచినది మొదలు సీతారాగుణములు సహిత మించుక మాఱిపోయియుండుటంబట్టి యామె సహితము హిందూమహాత్మ్యాదికవిషయమునంతగాఁ దానీషాకడఁ బ్రస్తావించుట లేదు. వీటినన్నిటింబట్టి మహమ్మదీయులనేకమై పట్టణములోఁ దామిదివఱకు సంపాదించుకొనియున్న పలుకుబడిసహితము వినాశమైపోవునని యెంచి, రామదాసైంద్రజాలికుఁడనియు నతని యింద్రజాలమునకుఁ దానీషా బెలుపోయెననియు, నట్టిమోసమునకు జనులెల్లరు లోఁబడఁ గూడదనియుఁ బట్టణములోని

వారికి బోధించుచుండిరి. అందువలనఁ గొంతమంది జనులు మఱి ల నిబ్రిహాముపక్షమునఁ జేరుచుండిరి. మఱియు నిబ్రిహాము సత్వరసంగ్రామమే ప్రథమకర్తవ్యమని యెంచి యుంకులకై తన యావచ్ఛక్తిని వినియోగించుచుండెను.

అతఁడు తన సహాచరులనందఱ నొకచోటికిఁ జేర్చెను వారందఱుగూడ నిబ్రిహామువలెనే పాటుపడి పనిచేయు వారగుటచే నతఁడేమి యాజ్ఞాపించునో వానినెల్లఁ జేయుటకు సంసిద్ధులైయుండిరి. పిమ్మట నిబ్రిహాము తనసహాచరులతో "మిత్రులారా! మనమెంత ప్రయత్నించినను దానీషా మనపక్షమునఁ జేరుటలేదు మర్యాదలకు హిందువులపైఁ దనకుఁగలయభిమానముచే లేనిపోని కారణములను గల్పించి యతఁడు రామదాసును జెఱనుండి విడిపించెను. ఇప్పుడతఁడు హిందూమతమునే యవలంబించుచున్నాఁడట!—సర్వాధికారమక్కన్నమాదన్నలకే యొసఁగి యున్నాఁడట' అందుచే వారెల్ల నమనపించ మూర్ఖఁగలరు. సితారాసహితము మనవిషయమై శ్రద్ధవహించి పనిచేయుచున్నట్లు కనుబడుటలేదు. మఱియు నామె యక్కన్నమాదన్నలను ద్వేషభావముతోఁ జూచుట లేదట అందుచే వారికమీఁద నెట్టి కఠినశాసనములనైన నొనర్చి మనయత్నములను సాగనివ్వకుందురు. కావున మనము వారినిముందుగఁ గృతాంతనిశాంతమున కతిథులుగావింపవలయును. పిమ్మట రాజ్యమవలీలగ మనచేతులలోనుండఁగలదు.

వారికి బోధించుచుండిరి. అందువలనఁ గొంతమంది జనులు మఱి ల నిబ్రిహాముపక్షమునఁ జేరుచుండిరి. మఱియు నిబ్రిహాము సత్వరసంగ్రామమే ప్రథమకర్తవ్యమని యెంచి యందులకై తన యావచ్ఛక్తిని వినియోగించుచుండెను.

అతఁడు తన సహచరులనందఱ నొకచోటికిఁ జేర్చెను. వారందఱుగూడ నిబ్రిహామువలెనే పాటుపడి పనిచేయు వారగుటచే నతఁడేమి యాజ్ఞాపించునో వానినెల్లఁ జేయుటకు సంసిద్ధులైయుండిరి. పిమ్మట నిబ్రిహాము తనసహచరులతో "మిత్రులారా! మనమెంత ప్రయత్నించినను దానీషా మనపక్షమునఁ జేరుటలేదు. దుర్మార్గులగు హిందువులపైఁ దనకుఁగలయభిమానముచే లేనిపోని కారణములను గల్పించి యతఁడు రామదాసును జెఱనుండి విడిపించెను. ఇప్పు డతఁడు హిందూమతమునే యవలంబించుచున్నాఁడట! —సర్వాధికారము లక్కన్నమాదన్నలకేయొసంగి యున్నాఁడట! అందుచే వారెల్లై వమనపించమార్పఁగలరు. సితారాసహితము మనవిషయమై శ్రద్ధవహించి పనిచేయుచున్నట్లు కనుబడుటలేదు. మఱియు వారె యక్కన్నమాదన్నలను ద్వేషభావముతోఁ జూచుటలేదట అందుచే వారికమీఁద నెట్టికఠినశాసనములనైన నొనర్చి మనయత్నములను సాగనివ్వకుందురు. కావున మనము వారినిముందుగఁ గృతాంతనిశాంతమున కతిథులుగాఁ బంపవలయును. పిమ్మట రాజ్యమువలీలగ మనచేతులలోనుండఁగలదు.

ఔరంగ జేబు సహితము "బ్రాహ్మణమంత్రులగు నక్కన్న మాదన్నలను వధింపుడు. పిమ్మటఁ దానీషాను సులభముగఁ జెఱపట్టి రాజ్యమును జయింపఁగలమని" నాకిదివఱలో రహస్యముగ వ్రాసియున్నాఁడు. మేమందులకుయత్నించుచున్నామనియు, నింతలో గోలుకొండపైకి సైన్యమును బంపవలసినదనియు సేనాతనికి మఱల వర్తమానము నంపితిని. అందునకు జవాబు కూడ మనకు నేఁడో రేపో రాఁగలదని తలంతును. అక్కన్న మాదన్నలనిన సామాన్యమానవులుగానేరరు. రణరంగమున వారిశౌర్యమును గాంచిన నెట్టి వానికైన గుండెఝల్లుమనకమానదు. కాన, వారిని గడతేర్చుట మిగులఁ గష్టము. ప్రస్తుతము వారెక్కడికి వెళ్లుచున్నను నాత్మసంరక్షణార్థము ఖడ్గములను సహితము వెంటఁగొని పోవుచుందురట. అందుచే సమయము గనిపెట్టి వారింబరిమార్పవలయును. ఈవిషయమున మీరెట్లు ప్రవర్తింతురో నాకుఁదెలియకున్న"దని చెప్పెను. అందులకుఁ దనసహచరులలోఁ గొందఱు "మిత్రమా! ఏవిషయమున నెంతమాత్రమును జింతింపనవసరములేదు. ప్రతిదినమును వారివిషయమై మేమాలోచింపుచునేయున్నాము. కాని తరుణము చిక్కినది కాదు. అచిరకాలముననే మాకది తటస్థింపఁగలదు. ఈవిషయమున మేము మాప్రాణములయందు సహిత మాశపెట్టుకొనము. వారిని గతప్రాణులుగఁజేయుటే మావిధి" యని వారు బదులు చెప్పిరి. అందులకు హామీరుఖానుఁడు 'ఇబ్రిహిమూ! పీరే యూపని యొనర్పుటకు సమ

ధులు; నేను సహిత మీవిషయమున వీరికిఁ గావలసినంత సాయమొనరించెద”నని చెప్పెను. అంత నిబ్రిహాము ‘హమీదు ఖానూ! సితారా తానీషాకడఁబట్టిన మొండిపట్టుదలచే నీవు చెఱసాలనుండి విడిపింపఁబడితివి. కాని యామె మనపై నిప్పుడున్నట్లిప్పుడువర్తించుచుండినఁ దానీషా నిన్నుఁ జెఱనుండి విడిచిపుచ్చియే యుండఁడు. మాయదృష్టమున నీవు మాకిప్పుడ సాయపడవచ్చితివి, నీవు వచించునట్లు మన మిత్రులకండగనుండి యక్కన్న మాదన్నలను వధించుటలో నీవు కడు జాగరూకతతో మెలంగుచుండవలయును. మఱియు నింకొక సంగతి మీకుఁ జెప్పుటకు మఱచితిని. అదేదియనిన మహారాష్ట్రవీరుఁడగు శివాజి మరణించినందులకు నేనెంతయు సంతసించుచున్నాను. కాని యతనిపుత్రుఁడగు శంభాజీ తానీషాకు సహాయమొనర్ప నెంచియున్నాఁడట. అయిన నతఁడు శివాజీవంటిశూరుఁడుగా నేరఁడని వచించునంతలో నొకసేవకుఁడచటికరుదెంచి యిబ్రిహామునకు సలాములొనరించి యతని చేతి కొక జాబునందిచ్చెను. ఇబ్రిహాము దానిని దీసికొని యీక్రింది విధమునఁ జదివెను.

“మహామ్మదీయమతాభిమానులును మిత్రులును నగు నిబ్రిహాముఖాన్ గారికి.

మతాభిమానముచే మీరొనరించు కార్యములు మిగులఁ బ్రశంసనీయములై యున్నవి. మేమెల్లరము సంతసించితిమి.

బ్రాహ్మణాధములగు అక్కన్నమాదన్నల విషయ మెల్లోనర్చితిరి? ముందుగ హైదరాబాదును నాశన మొనర్చి పిమ్మట గోలుకొండను ముట్టడించుటకు నాకుమారుఁడగు ముఅజ్జం వెంటఁగొంత సైన్యమునిచ్చి పంపితిని. అతఁడిక రెండురోజులలో మిమ్ములను గలసికొనఁగలఁడు. మీరెల్లరును శ్రద్ధవహించి మీమీ కార్యములయందుఁ గను జాగ్రత్తతో మెలంగవలయును. నేనచిరకాలములో మిమ్ములను గలసికొందును. ఈవిషయమును గడురహస్యముగ నుంచవలయును.

ఇట్లు మీమిత్రుఁడు,
ఔరంగజేబు.

ఇట్లిబ్రహీము చదివి ముగించి తన సహచరులవంకఁ జూచి "మిత్రులారా! వింటిరిగదా! ఔరంగజేబు తన సైన్యమును ముఅజ్జం వెంటఁబంపి యున్నాఁడఁట. అతఁడింత శీఘ్రముగఁ దనసేనను బంపునని నేను తలంచియుండ లేదు. సైన్యమంతయు రేపే మన పట్టణము జేరఁగలదు. మనకుఁదోడుపడ నెంచియున్న సైనికులనందఱిని రహస్యముగఁ జేర్చి పెట్టుకొనవలయును. ఇఁక జాగుచేసిన ప్రయోజనముగు పడదు. ఔరంగజేబు తన సైన్యమును సూటిగ గోలుకొండపైకిఁ బంపునని తలంచి యుంటిని. కాని యతఁడు ముందుగ హైదరాబాదు పట్టణమునే ధ్వంసము జేయ సమకట్టెను. ఈవిషయము మీరెవ్వరికిని దెలియఁ జేయఁ గూడదు. మన సైన్యములను గూడ హైద

రాజును వద్దనే నిలబడియుండవలయును. రెండు రెండు. మీ మీ కార్యముల నొనర్ప సిద్ధముగనుండుడని. చెప్పెను. అందుల కందఱు సంతసించి యుద్ధసన్నాహము లొనరించుటకుఁ దమ తావుల నుండి లేచి పోయిరి.

## 26 వ ప్రకరణము.

మొగలాయి సైన్యము గోలుకొండ కోటపైఁబడుటకుఁ బ్రయాణమై వచ్చుచున్నదనియు నేఁడో రేపో గోలుకొండను సమీపింపఁ గలదనియుఁ దానీషాకును, అక్కన్న మాదన్నలకును గూఢచారు లెఱింగించిరి. ఇంత త్వరలో నౌరంగజేబు తన సైన్యమును బంపునని వారు తలంపలేదు. యుద్ధము జరుగుటకై నిర్దిష్ట దినమింకను సైనికుల కెఱుక పఱుపఁ బడలేదు. మందు గుండు సామానులింకను బూర్ణముగఁ గోటలోనికిఁ జేర్పింపఁబడలేదు. ఇట్లుండుటంబట్టి యుద్ధ సన్నాహ మతిత్వరలోఁ గావింపఁ బడవలసి యుండెను. ఇప్పుడు మొగలాయిసేన గోలుకొండపైఁ బడుట కరుదెంచుట 'హఠాత్సంభవంబని అక్కన్నమాదన్నలు తలంచిరి. గూఢచారు లీవార్తను సాయంసమయమున వారి కెఱింగించుటచే రాత్రి కాలము సైన్యము నంతటిని నొక్కసారిగఁ బ్రోగుసేయవలయునన్న మిగులఁ గష్టము. కాని వారారాత్రి కెంతమాత్రమును జం

కుఁ గొనలేదు—చీకటిని లక్ష్యపెట్టలేదు. శక్తివంతులును, న
ధికారులును నగువారియాశ్రితములు గార్యరూపముగఁ బరిణ
మిల్లుటకు విశేషకాలము పట్టదు. అక్కన్న మాదన్న లాజ్ఞా
పించినతోడనే దండనాయకులందఱు వచ్చి వారిని దర్శించిరి.
వెంటనేవారికిఁగొన్ని కార్యముల నొనర్చుటకుత్తరువులీయఁబడె
ను. అక్కన్న మాదన్నలయాజ్ఞనుశిరసావహించి దండనాయకు
లందఱు వారి నియమితకృత్యముల నెరవేర్చుటయం దప్రమ
త్తులై యుండుటకు వారివారి ప్రదేశముల కరిగిరి. యుద్ధము
నందు సాయమొనర్చు వారికెల్లరకును దమతమ సైన్యంబులం
దీసికొనితత్క్షణమే బయలువెడలి గోలుకొండను జేరవలసినట్లు
మఱల వర్తమానము లంపఁబడెను. అక్కన్నగారానిశీథసమ
యముననే ఖడ్గమునొకదానిని ధరించి, తనయశ్వము నధిరోహిం
చి రక్షకభటసహితుఁడై యెక్కడికో వెళ్ళిపోయెను. మాదన్న
గారును గొంతమంది భటులను వేర్వేఱుపనులకు నియమించు
చుండెను. అప్పటికి దాదాపు రాత్రి మూడుగంటలు కావచ్చు
చుండెను అప్పుడైన నతఁడు నిద్రించుటకుయత్నింపలేదు.
గోలుకొండ కోటలోనికిఁ గావలసిన సామగ్రులనన్నిటిని యతఁ
డతిత్వరితముగఁ జేర్పించుచుండెను. ఇట్లా రాత్రియంతయు
యుద్ధసన్నాహముననే గడచిపోయినది.

ప్రభాతకాల మాసన్నమగుచుండెను. మాదన్న గోలు
కొండకోటకుఁ బ్రయాణోన్ముఖుఁడై తనయశ్వమును సిద్ధము

గనుంచుటకై తనభటుల కాజ్ఞ నొసగుచుండెను. ఇంతలో స్వామి భక్తిపరాయణుఁడైన అబ్దుల్ రజాకు దన తురగమును గడువేగముగఁ బరుగెత్తించుకొనివచ్చి మిగులఁ దత్తరపాటుతో "మాదన్నగారూ! గోలుకొండకోటను ముట్టడింప నెంచిన మొగలాయిసైన్యము హైదరాబాదు పట్టణమునే సమీపించి నది. చుట్టుపక్కల గ్రామములను నాశనమొనరించి వచ్చిన సైనికులు హైదరాబాదునుగూడఁ గొల్లగొట్ట నెంచినట్లున్న దనెను. మాదన్న విస్మయపరీతచేతస్కుఁడై "ఏమీ! సైన్యము హైదరాబాదువంక వచ్చుచున్నదా? రజాకు! మనమిప్పుడేమి చేయవచ్చును? నాకేమి చేయుటకును దోచకున్నది. నీవీతత్క్షణంబున గోలుకొండకరిగి సర్వసైన్యమును జక్కపఱుచుచున్న అక్కన్నగారి కీవార్త నెఱింగించి కొంతసైన్యమును దీసికొని వెంటనేబయలుదేరి రమ్మని చెప్పుము. నీవును అబ్దుల్లాఖానుఁడును గోలుకొండకోటను సంరక్షింపుచుండుడు. శీఘ్రముగఁ బొమ్ము"ని యాజ్ఞాపించెను.

ఈమాటలను విన్నవెంటనే అబ్దుల్ రజాకు గోలుకొండకుఁ దనవాహనంబును వాయువేగంబునఁ బోనిచ్చెను. మాదన్న కేమియుఁ దోచుటలేదు. సైనికులు గోలుకొండకోట నుండి రావలయును. హైదరాబాదులో నున్న కొద్దిమంది సైనికులు మొగలాయీలను బారఁదోలుట కష్టము. బాగుగ తెల్లవారినది. అరుణకాంతులు జరుగఁబోవు దారుణకృత్య

మునఁ బ్రవహింపఁబోవుచున్న రక్తప్రవాహమువలె నెఱ్ఱఁగ
బ్రసరించుచుండెను. మొగలాయీల క్రూరకర్మములఁ గన్ను
లార దిలకించుటకుఁ గాఁబోలు దినకరుఁ డుదయాద్రినుండి
యొక్కొక్క మెట్టు పై కెక్కుచుండెను.

మొగలాయిసైన్యము పట్టణముపైఁ బడినది—వీధుల
లో నెచ్చటఁ జూచినను రౌద్రాకారమును దాల్చిన మొగలా
యిసైనికులే గన్పట్టుచుండిరి. ఇబ్రహీము దన సహచరులతోఁ
గూడ మొగలులసైన్యముసఁ గలసిపోయెను. జనుల యాక్రందో
ళనము వర్ణనాతీతము! ఎల్లరును దమతమ పనులనుమాని
భయముచే స్తబ్ధులైపోయిరి. వినోదవిలాసము లాకస్మికముగ
నాగిపోయినవి. మొగలాయి సైనికులతోఁ గొందఱిండ్లకు ని
ప్పంటించు చుండిరి. మఱికొందఱు ధనికులయిండ్లలోఁ జొరఁ
బడి దోచుకొనుచుండిరి. 'అగ్నికి వాయువు సాయమైనట్లను
సామెత ననుసరించి దహింపబడుచున్న గృహములలో నుండి
నిప్పురవ్వలు, కాలినకొయ్యలుగాలికి నెగురఁగొట్టఁబడిమఱికొన్ని
యిండ్లనుదగులఁబెట్టుచుండినవి. ఒకగడియకాలములోఁ జేరువ
నున్న యిండ్లన్నియుఁ దగులుకొనగ మంటలుపై కెగసి సంవర్తస
మయభీషణహుతాశనుని పోలికనలు కెలంకులఁజుట్టుకొనియెను.
కాలుచున్న యిండ్లనుండి జనులు తప్పించుకొని బయటికి వచ్చు
టకుబ్రయత్నించుచుండిరి: కాని క్రూరులగు మొగలాయీలు
వారినిదమ కరవాలముల కెరగావించుచుండిరి. మఱికొందఱు

సైనికులు దమకడ్డము వచ్చినవారిని క్రూరముగ భూమికిబలి
పెట్టుచుండిరి. పట్టణము నందెల్లెడలను నల్లకల్లోలము జనించి
నది. ప్రాణసంరక్షణార్థము కొందఱు పుత్రకళత్ర మిత్ర విత్త
పశుగృహముల విసర్జించి పరుగిడఁదొడఁగిరి. రాజకీయోద్యో
గులేమియుఁ దోఁపక యిటునటుఁ బర్వెత్తుచుండిరి. కొందఱు
చేయుచున్న పనుల నట్లేనిలిపి నలుదెసలఁ బరుగెత్తుచుండిరి.
బ్రాహ్మణబృందములు దాళపత్రగ్రంథముల నెత్తిపై బెట్టు
కొని యూపిరియున్న నుప్పుమ్మకొని బ్రతుకవచ్చునని చేరువ
నున్న గ్రామములకుఁ బాఱిపోవుచుండిరి. పరుగెత్తు వారిని
మొగలాయిలు తుపాకులతోఁ గాల్చుచుండిరి. కొందఱినట్లే
పరుముకొనిపోయి నఱికి వేయుచుండిరి. ఆక్రందనధ్వనులు
మిన్నుముట్టుచుండినవి. స్త్రీలందఱు గృహకృత్యములనువదలి
పలాయన మగుచుండిరి. తల్లులుకొందఱు మంచముల పైనున్న
పిల్లలను మఱచిపోయి కొంతదవ్వేగి, మఱల జ్ఞాపకమునకు
రాగాఁ దిరిగివచ్చుచుండిరి వారిలోఁ గొందఱు హతులగుచుం
డిరి. కొంతమంది సైనికులు బిడ్డలను దల్లులయొడినుండి లాగి
కొని క్రూరముగ వధించుచుండిరి. హిందువులకే యిట్టికష్ట
ములు మఱింత యెక్కుడుగ దటస్థించుచుండెను. కాలిపో
యిన మిద్దెలు కూలఁబడిపోవుచుండినవి-సమున్నతసౌధప
ఙ్క్తులు దహింపఁబడుచుండినవి-ప్రకోష్ఠము లన్నియు నేల
పట్టములైనవి-మందిరములు మంటలలో దగ్ధములగుచుండినవి.

వీటిని జల్లార్పవచ్చిన వారందఱు వధింపఁబసుచుండిరి. ఎచ్చట
జూచినను రక్తప్రవాహమే. ఏవంక విన్నను నార్తానినాదములే!
ఏదిక్కు జూచినను సంక్షోభమే! భీభత్సమే!

సర్వసంతాప హేతుభూతంబగు నిట్టి సమయమునఁ
దానీషాచక్రవర్తి యెక్కడనున్నాడు ? అక్కన్నమాదన్న
లేమిచేయుచున్నారు? తానీషాచక్రవర్తి పట్టణమున లేడనువ
దంతి యూరంతయును వ్యాపించిపోయినది. మొగలాయిసేన
హైదరాబాదుపైఁ బడఁబోవునను వార్త యాతనికిఁ దెలిసిన
తోడనే యతఁడు పట్టణమును వదలి గోలుకొండకుఁ బాఱి
పోయెను. పట్టణమిట్టి దుర్గతిపాలు కాఁగలదని యతనికిఁ దెలు
సును. శత్రువులను దఱుమఁగొట్టుటకుఁ దగినంత సేనను సమ
కూర్చుట కవకాశము లేకుండుటను దెలిసికొని పట్టణమునను౦
డి యిట్టి ఘోరకృత్యములను గనులారఁ గావించుటకంటె
స్థలాంతరమునకుఁ బోవుటయే యుచితమని యాతఁడు గను
గొనెను. తానీషా గోలుకొండ కోటను జేరినసంగతి యచ్చట
నుండి యతిత్వరితముగ నరుదెంచిన అక్కన్న చెప్పగా మాద
న్నకుఁ దెలియవచ్చినది.

అక్కన్న మాదన్నలు పట్టణమును నాశనమొనరించు
చున్న మొగలాయి వీరులతోఁ బోరాడుచుండిరి. ప్రస్తుతము
దమవద్దనున్న కొద్దిపాటి సైన్యముతో వారనేకమంది మొగ
లాయివీరులను గతప్రాణులుగ నొనర్చుచుండిరి. కాలుచు

న్నగృహముల వైపుఁ దమగుఱ్ఱములను బోనిచ్చి యనేకమంది జనులను శత్రువుల బాఱిఁబడనియక తప్పించుచుండిరి. తమ కడ్డమువచ్చిన మొగలాయివీరుల నొక్కటే దెబ్బకుఁ జెక్కు మందిని మడియించుచుండిరి. ఇబ్రిహాము దీనినిగని యోర్వఁ జాలక తనసహచరులలో బలిష్ఠులగు వారిసిద్దఱిని అక్కన్న మాదన్నల వైపు బంపెను. వారిద్దఱును క్షణమాత్రమున నే హతులైరి. ఇంతలో నెచటినుండియో యొక ప్రచండ సైన్య మరుదెంచి యక్కన్నమాదన్నలకు సాయమొనర్చుచు నొక వంక మొగలాయీలతోఁ బోరాడఁజొచ్చెను. ఈసేనను జూచి నవెంటనే మొగలాయీలు ధైర్యమును వదలినవారై హైదరా బాదు పట్టణమును గొళ్లగొట్టుటను మానివేసి తమకుఁ జిక్కి నవెంలేసి యాభరణములను ధనమును దీసికొని పరుగెత్తి పోయిరి.

## 27 వ ప్రకరణము.

మొగలాయిసేన హైదరాబాదు పట్టణమును గొళ్ల గొట్టి వెళ్ళునప్పటికి దాదాపుగ రెండుజాముల ప్రొద్దెక్కినది. తెగఁబడుచుండిన యిండ్లన్నియుఁ జల్లార్పఁబడుచుండినవి. భయపడి పరుగెత్తి పోయినవారందఱును మరల మెల్లగఁ బట

ణమును జేరుచుండిరి. వారునివసించు గృహములన్నియు దగ్ధములై యుండుటచే వారికడుపులు భగ్గుమని మండజొచ్చెను. తినుట కాహారములేదు. వండుకొనుటకు వంటసామానులు లేవు వారుగట్టుకొనియున్న బట్టలుదప్ప వారివద్ద నితరవస్తువు లేవియును లేవు. మహాధనసంపన్నులు సహితము నిలువనీడయు దినుటకన్నమును లేక మిడిమిడి గాడ్పులు నెండలోఁ బరితపించుచుండిరి. అక్కన్నమాదన్న లప్పటినుండియు వీరికి సౌకర్యములను గలుగఁ జేయఁ బయత్నించుచుండిరి. అగ్నిదేవుని కాహుతి కాని గృహములలోఁ గొంతభాగమును వసతిజేసి వీరికొసంగుచుండిరి. మరియు వీరికి భోజనసౌకర్యములకై యనేక వసతులను గలుగఁ జేసిరి. అప్పటికి దాదాపు మధ్యాహ్నము రెండు గంటలు కావచ్చుచున్నను అక్కన్నమాదన్నలు భుజించుటకు దమ గృహములకరుగలేదు. జనులయాందోళనము సంపూర్ణముగ నణగువఱకును వారు దమ యాకలిదప్పులను సహితము మఱచిపోయియుండిరి. పిమ్మట వారు తమకు సాయమొనర్ప వచ్చిన మహారాష్ట్రవీరుఁడైన శంభాజికడకరుదెంచి యాతనితోఁ గొంతసేపుముచ్చటించి యతనికిని, యతనిసైన్యమునకును గావలసిన వసతులకై యేర్పాటులుగావించి పిమ్మటఁ దమ గృహమునకుంజనిరి. పట్టణమును మొగలులు దోచుచున్నప్పుడు వీరిభవనముకడఁ బెక్కుమంది సైనికులు గావలిగానుచున్నందున వారి గృహమునకుఁ గాని లోపలనివసించు వారికిఁ గాని యేవిధమగు నపాయమును గలుగలేదు.

అక్కన్న మాదన్నలు దమ భవనమునకరుదెంచిన పిమ్మట స్నానమొనరించి శివపూజచేసికొని వెంటనే భోజనశాలకరుదెంచి భుజించుటకుఁ బ్రయత్నించిరి కాని వారికెంత మాత్రమును నన్నహితవుగలుగలేదు. క్రమపద్ధతిని మొక్క కబళమైన వారి గర్భాంతరాళమునఁ జొరలేదు. ఏకారణముననో వారి గుండియలు ఝల్లుఝల్లుమన వారించుకభీతచేతస్కులగుచుండిరి. వారిద్దఱు నిట్టి యవస్థయందే యుండుటంబట్టి తమ కుదయమునుండియుఁ గలిగిన శ్రమచే నిట్లున్నదని వారు తలంచిరి. కాని వారి సతీమణులు మాత్రము వారి ముఖచిహ్నముల ననుసరించియు, వారి సంభాషణలోనిమాటలధోరణినిబట్టియు వారికేదోయరిష్టము రానున్నదని భావించిరి. అక్కన్నమాదన్న లెప్పటివలె భుజింపక లేచి బయటికరుదెంచిరి వెంటనే వారు నాఁడుదయమున జరిగిన విపత్తులనుగుఱించియు, మఱికొన్ని విషయములను గుఱించియుఁ దానీషాకుఁ జెప్పిపంపుటకును, ఇతర రాచకార్యములను నెరవేర్చుటకును, దివాణమునకరుదెంచిరి. అచ్చట రాజభటులందఱు వీరిరాకకై నిరీక్షించుచుండిరి. వెంటనే మాదన్నగారు కొన్ని కాగితములనువ్రాసి తానిషాగారికంపిరి. మఱునాఁడుదయముననే మొగలాయిసేన గోలుకొండకోటను ముట్టడింపఁబోవుచున్నదను విషయమక్కన్నగారికిఁ దెలిసియుండుటచే నందుకుఁదగిన సన్నాహమును జేయు నతఁడు తన దండనాయకుల కాజ్ఞాపించుచుండెను. ఇట్లక్కన్న మాదన్నలాదినమునఁ

గావింపఁబడవలసిన కార్యములను జక్కఁబెట్టుకొను నప్పటికి రాత్రి దాదాపుతొమ్మిదిగంటలు కావచ్చుచుండెను. అందుచే వారిద్దఱును దివాణమునుండి బయలు దేరి గృహాభిముఖులై వచ్చుచుండిరి. ఆరాత్రి గాఢాంధకారబాధురంబై యుండెను. అందుచే వీథులలో నెవరో యొకరిద్దఱు తప్ప విశేషముగ జనులు నడచుచుండుట లేదు. అక్కన్న మాదన్నలకు దారి తెలియుటకై యిద్దఱు సేవకులు ముందుభాగమున బాగుగ వెలుంగుచున్న రెండుదివ్వెటీలను బట్టుకొని పోవుచుండిరి. వారు దివాణమును దాటి రెండుఫర్లాంగుల దూరము వచ్చినప్పటికిఁ గ్రూరాకారులగు బదిమంది మనుష్యులక్కన్న మాదన్నలను జుట్టిగట్టిగఁ బట్టుకొనిరి. దీనిని గనిన రాజసేవకులు భయపడి పరుగెత్తిపోయిరి. అక్కన్న మాదన్న లేమి చేయఁగలరు? చిమ్మచీకటి—పోవుచున్నవారగ్లై గుభాలున నిలిచిపోయిరి. వారిదక్షిణహస్తములు దమంత తామె కృపాణములకై తడవి చూచుచుండినవి, వెంటనే నలుగురుమనుజులు వారిచేతులను వెనుకకు లాగికట్టివేసిరి. అయినను వారు గట్టిగ నరచుచుఁ గొంతసేపైనఁ బోరాడఁజొచ్చిరి. కాని వెంటనే వారిశిరంబులు ఖండింపఁబడినవి. ఎవరైనదమ్ము గనుగొందురను భీతచే నాద్రోహులాశిరములను గైకొని యెచ్చటికో వెళ్లిపోయిరి. ఇదంతియును గూడ నాలుగైదునిముసములకాలములోనే జరిగిపోయినది—ఓభారత గౌరవమూర్తులారా! అమాత్యశే

ఖరులారా! అక్కన్న మాదన్నలారా! మీరా అంతరించి పోతిరి! మీకా అస్తమయము! ఆహా! కాలమా! నిన్నేల నిందింపవలయును. ఈశ్వరసృష్టియందుండు సర్వమును నీవశమైయున్నది.

## 28 వ ప్రకరణము.

అక్కన్న మాదన్నలు వధింపఁబడిన సంగతి మఱునాఁడుదయమున బట్టణములోని జనులకందఱికిని దెలిసిపోయెను. అమాత్య శేఖరులకుఁ దటస్థించినయకాలమరణమునకుఁ బురజనులందఱు మిగుల దుఃఖించిరి ఆమంత్రివరుల భార్యలిరువురును దమ భర్తలపోకకై రాత్రింబవళ్లుకంటికి మంటికి నేకధారగ నేడ్చుచుండిరి. రామదాసుగారీ వార్తనువిని భద్రాచలమునుండియరుదెంచి వారినోదార్చుచు వారికి వేదాంతమును బోధించుచుండెను. గోలుకొండలోనున్న తానీషా అక్కన్న మాదన్నల మరణవార్తనువిని మిగుల దుఃఖించుచుండెను. అతఁడువారి విషయమై సర్వదాధ్యానించుచుండెను. అంత వారిరువురునుగన్నులయెదుటగనఁబడినట్లుతోఁచుచుండెను. వారి మరణమునకుఁ గారణభూతుఁడగు నిబ్రహీము నతఁడూరక దూషించుచుండెను. మొగలాయీల క్రూరకృత్యములకై పరితపించుచున్న యాతనిహృదయము మఱింతశూలములతోఁ

బాడిచినట్లయ్యెను. అతని కేమిచేయుటకును దోచకుండెను. శోకభయతరంగము లొక్కసారిగ నతనిహృదయమును భేదించి వైచుచుండినవి.

కదనక్రీడావిచక్షణులగు నక్కన్నమాదన్న లంతరించిన వెనుక మొగలాయీలు నిర్భయముగ గోలుకొండకోటను ముట్టడింపగలరని యతడు దలంచెను. రణరంగమున మొగలాయిలం దఱిని క్రూరనారాచంబుల గుప్పుగుప్పునంగుప్పించుచు నరివీరులఁ బరిమార్చ నక్కన్నమాదన్నలవంటి ధీరులెవ్వరాతనికగపడలేదు. ప్రస్తుతము మొగలులతో సంగరంబునకుఁ దలపడినఁ దప్పక యపజయము గలుగఁ గలదని తానీషా యెఱింగెను. శంభాజి సాయమొనర్చుటకుఁ దన సైన్యములతో వచ్చి యున్నను నతడు శివాజీ యంతటి ధీరుఁడు కాఁడనియు నతని సాయము నాధారముగఁ గొని యుద్ధమునకుఁ గడంగుట యంత ప్రశస్తముగాదనియు నతడు తలంచెను. అందుచేనతడు మొగలులతో సంధియొనర్చు టుత్తమ మనితలంచెను. తానీషాకు రామలక్ష్మణులు బ్రత్యక్షమైన వెనుక సితారాగుణములు సహితము మాఱి పోయినవను సంగతి చదువరు లెఱిఁగియేయుందురు. ఇప్పుడామె తన మనఃప్రపంచమున ననేక భయంకర దృశ్యములను గాంచుచుండెను. మొగలులును, మహమ్మదీయులును గలసి పట్టణమందొనర్చిన ఘోరకృత్యముల నామె కనులారగాంచినది. ఆయగ్నిజ్వాలలు—ఆపురజనుల

రోదనధ్వనులు___ఆరుధిరవాహినులింకను నామె హృదయాంతరాళమునఁ బ్రతిబింబితములగుచుండినవి. ఇంతకును మహమ్మదీయులయెడఁ దనకుఁగల పక్షపాతబుద్ధియు, హిందూమతమందు దనకున్న ద్వేషభావమును నేకమైనందునఁ బట్టణమట్టి దుర్గతిపాలైన దనియు, అక్కన్నమాదన్నల కట్టిఘోరమరణము దటస్థించినదనియు నామె బాగుగగనుగొనెను. రామలక్ష్మణులు దానీషాకు బ్రత్యక్షమైన వెనుక తానును దన భర్తవలెనే హిందువులయెడఁ బూజ్యభావమును వహించి మెలంగుచుఁ దనచే బ్రేరేపింపఁబడిన మహమ్మదీయులందఱికిని వారొనరించినదుండగములను మానవలసినట్లువర్తమానములంపినది. కాని వారామె మాటలను బాటింపలేరు. సితారాకు సంబంధించిన స్త్రీలలోఁ గొందఱును నితర చెలికత్తెలును నెప్పటివలెనే హిందువుల యెడ ద్వేషభావము వహించియుండిరి అందుచేఁ దురుష్కులు సితారామాటను బాటింపక అక్కన్నమాదన్నల వధించిరి. మఱియుఁ బట్టణము గొల్లగొట్టఁబడినదినమున సితారా యక్కన్నమాదన్నలధైర్యసాహసములను గనులార గాంచినది. వారు మహాకూలంకష ప్రజ్ఞాశాలులని యామె యెఱింగినది. వారి పోకకై యామె యిప్పుడూరక విలపించుచున్నది. కాని, లాభమగుపడకుండెను. మొగలులు గోలుకొండ కోటను బట్టుకొని రాజ్యమును దమవశము చేసికొందురని యామెకుఁ దెలియవచ్చినది. ఇ

ప్పట్టున మొగలులతో సంధి యొనర్చుటయే యుచితమని యామెతలంచెను. అందుచేఁ దనయభీష్టమును దానీషా కెఱుక పఱుప నామె గోలుకొండకు వర్తమానమంపెను. తానీషాయును మొగలులతో సంధియొనర్చుటకు సంసిద్ధుఁడైయుండుటచే దన భార్యయగు సితారా పంపిన వర్తమానమున కెంతయు సంతసించెను. పిమ్మట నతఁడు గోలుకొండకు సమీపముననే విడిసియున్న మొగలాయిసేన కధిపతియైన ముఅజ్జమునకొక వర్తమానము నీక్రిందివిధమున వ్రాసిపంపెను.

సర్వసేనాధిపత్యమును వహించిన ఔరంగజేబు పుత్రుఁడగు ముఅజ్జంగారికి.

మీ సైన్యము హైదరాబాదు పట్టణముపైఁ బడి యొనరించిన దుష్కృత్యములచే మాకపారమైన నష్టములును కష్టములును గలిగినవి. ప్రస్తుతము మీతో యుద్ధమొనరించుటకు మాకించుకైన వీలు చిక్కకున్నది. హైదరాబాదు పట్టణము విషయమై మేముశ్రద్ధదీసికొని పనిచేసి జనులకపారమైన సౌకర్యములను గలుగఁజేయవలసి యున్నది. కావున మీరు ప్రస్తుతము మా పట్టణము పైకి రాకుండిన మీకు రెండు కోట్ల రూపాయల నొసగి మీతో సంధిగావింపనెంచితిమి. కాఁబట్టి మీయభిప్రాయమును వెంటనే దెలియఁజేయవలయును. జవాబునకై నిరీక్షించుచున్నాము.

ఇట్లు, తానీషా.

ఈజాబును చూచుకొనినముఅజ్జమునకుఁ బట్టరాని సంతసముగలిగెను. తానీషా పిఱికిగుండెఁ గలవాఁడనియు నతఁడు దనకు భయపడి యిట్లువ్రాసినాఁడనియునతఁడుదలంచెను. కాని యాతఁడెట్లును నిర్ధారణ చేయఁజాలకుండెను. అక్కన్న మాదన్నలకు నాఁడు సాయమొనర్పవచ్చిన మహారాష్ట్రవీరుల బాహుబలమును నతఁడు కనులారఁ గాంచియుండెను. కోట ముట్టడియందు సహితము వారు తానీషాకు సాయమొనర్ప గలరని యతనికిఁ దెలియును. మహారాష్ట్రవీరులచేఁ బెక్కుమంది మొగలు లిదివఱకే నిహతులుకాఁబడినందున బ్రస్తుతము మహారాష్ట్రవీరులను దలంచుకొన్న నతనికి గుండియలు ఝల్లుమనుచుండెను. అందుచేనతఁడు తానీషాయొనర్చిన యొడంబడిక గొప్పకొనుటయే శ్రేయంబని తలంచెను. ఒకవేళనతఁడు దానీషాతో యుద్ధమొనరింప నెంచినను శూరాగ్రేసరులగు నక్కన్నమాదన్నలు మరణించినందున విజయలక్ష్మి యతని యక్కునే చేరఁగలదని యతఁడు దలంచెను. కాని జయాపజయము లొకరివని నిర్ధారణ చేయుట కెవరికెఱుక? ఏదియెట్లున్నను ముఅజ్జమెన్నఁడో రాఁబోవు విజయలక్ష్మి కంటె నప్పుడు చేతికందిన ధనలక్ష్మిని మాత్రము వీడఁజాలకుండెను ఒకటిరెండా! నూరుయిన్నూరా! రెండుకోట్లరూపాయలు! కాలుకదిలింపక-జననాశ మించుకైన లేక ముఅజ్జము ధనలక్ష్మిని బొందుటచేఁ దానీషాయొనర్చిన సంధికతఁడియ్యకొనెను.

వెంటనే ముఅజ్జము తాను సంధిఁగొప్పుకొనినట్లు తానీషాకు వర్తమానము నంపెను. తానీషాయును సంధిననుసరించి ముఅజ్జమునకుఁ జెల్లింపవలసిన రెండుకోట్ల రూపాయలను జెల్లించి హైదరాబాదుపట్టణమున కరుదెంచెను. వెంటనే ముఅజ్జము తన సైన్యమును వెంటఁబెట్టుకొని బీజపూరురాజ్యమును వశపఱచుకొనుట కరుదెంచి యుండిన తన తండ్రియగు నారంగజేబు కడకేఁగుటకుఁ బ్రయాణము సాగించెను.

---

## 29వ ప్రకరణము.

---

తానీషా హైదరాబాదున కరుదెంచి తనజనుల దురవస్థను గనులారఁ దిలకించెను. పట్టణములోని జనులందఱు తమ శోకతాపముల నింకను మఱచిపోకుండిరి. తానీషాకుఁ దనజనులిట్టిదురవస్థయందుండుట కెంతమాత్రమిష్టము లేదు. నగరము నందంతటను శాంతిని నెలకొల్పుటకును, జనులందఱు మఱల సుఖసంతోషములచే నుల్లసితహృదయులై సంచరించుచుండుటకును, రాజపుధశోభాపరంపరల నభివృద్ధి గావించుటకును నతఁడు పట్టుపట్టి పనిచేయ నారంభించెను. జనులందఱు మఱల సంతుష్టహృదయులగుచుండిరి. కాని శాంతిప్రియులును, సుఖప్రియులును నగు నగరజనుల హృదయముల యందు

మఱలఁ బ్రళయకాలమేఘగర్జనమువలె రణభేరినినాదము చెవులఁబడుట తటస్థించు నేమోయను సందేహ ముదయించుచుండెను. బీజపూరును జయించుట కరుదెంచియున్న ఔరంగజేబు గోలుకొండపై సహితము బడఁగలఁడని జనులలోఁ గొందఱికి సూక్ష్మముగఁ దెలియవచ్చుటచే వారట్లు సందేహింపవలసివచ్చినది. ఈహేతువు ననుసరించియే తానీషాసహిత మికముందు యుద్ధము దటస్థించు నేమోయను భీతిచే మహారాష్ట్రనాయకుండగు శంభాజీని దనసైన్యముతో హైదరాబాదులోనే కొన్నాళ్లవఱకు నుండునట్లు వేడుకొనెను. శంభాజియు నందుల కియ్యకొని యచ్చటనేయుండెను.

దక్షిణదిగ్విజయార్థమై విశేషసేనాపరివృతుఁడై బీజపురమున కరుదెంచియున్న ఔరంగజేబు బీజపూరును ముట్టడించి స్వాధీనపరచుకొనెను. అంత నతని పుత్త్రుఁడచటి కరుదెంచి తానును తనసైన్యంబులును నొనరించిన కార్యముల నెల్లఁ జెప్పి తానీషాయొనర్చిన సంధికిఁ దానొప్పుకొన్నవిషయమును గుఱించి సవిస్తరముగ నతనికిఁ దెలియఁజేసెను. కాని తనపుత్త్రుఁడట్లు సంధికొప్పుకొనుటచే నౌరంగజేబున కెంతమాత్రమును సంతసము గలుగలేదు. హిందూదేశము నంతటను జయించి, మహోన్నత వైభవమును, నిరంకుశ ప్రభుత్వమును ననుభవింప దీక్షవహించియున్న ఔరంగజేబిట్టి సమాధానమున కొప్పుకొనునా ? అందుచే నౌరంగజేబు తన కు

మారునిఁ జేరఁబిలిచి "కుమారా! నీవు హైదరాబాదుకేగి య
చట నొనరించిన కార్యములన్నియు నాకెంతయు సంతసమును
గొల్పుచున్నవి. కాని ప్రస్తుతము నీవు తానీషాతో సంధి యొ
నర్చుట నాకంత తృప్తికరముగ నుండలేదు. ఇట్టి తరుణము
మన కెన్నఁడును దటస్థింపదు. ఇప్పట్టున గోలుకొండను జయిం
పకపోదుమేని మఱల మన మహారాజ్యమును వశపరుచుకొన
లేము. మనసైన్యమంతయును నిచ్చటికి వచ్చియున్నది. కాన
నీవు తానీషాతో నొనరించిన సంధిని రద్దుచేసి గోలుకొండ
కోటను ముట్టడింప వలసి యున్నది. అవలీలగా విజయలక్ష్మిని
వెంటఁబెట్టుకొని మనము మన రాజ్యమునకు మఱలి పోవచ్చు
నని చెప్పెను తనతండ్రి చెప్పుమాటలకు ముఅజ్జము మిగుల
సంతసించెను. ముఅజ్జము సైన్యములోనే గలసి పనిచేయు చు
న్నయిబ్రిహామునకుఁగూడ నీసంగతి తెలియవచ్చినది. అతని
యుత్సాహమునకు మేరయే లేదు. వెంటనే గోలుకొండ కోట
ముట్టడికి సర్వసన్నాహములు గావింపఁ బడుచుండెను.

ఔరంగజేబు తనసైన్యములను బీజపురమునుండి మఱ
లించుకొని గోలుకొండవంకకు వచ్చుచున్నాడని పట్టణమంత
యు వ్యాపించి పోయినది. అతఁడెందులకిచటికివచ్చుచున్నాడని
కొందఱు కారణ మూహించుచుండిరి. మఱికొందఱతఁడు గో
లుకొండకోటను ముట్టడింపఁబోవునని చెప్పుకొను చుండిరి.
కాని యతఁడు కుల్బర్గాలోనున్న యొకానొక సాధువుయొక్క-

సమాధినిజూచుటకు వెళ్లుచున్నానని జాంకి యీసంగతిని హైదరాబాదు పట్టణమందు వెల్లడి చేయించి తనసైన్యము నంతేటిని దీసికొని గోలుకొండకోటకుఁ బ్రయాణము సాగించెను. తత్క్షణమే యీసంగతి గూఢచారుల వలనఁ దానీషాకుఁ దెలియవచ్చినది. అతని కేమి చేయుటకును దోపలేదు. ఈసమయమున నతఁడేమి చేయఁగలఁడు? ఔరంగజేబు కృపకుఁ దాను బాత్రుఁడగుటయే ప్రథమకర్తవ్యమని యతఁడు దలంచెను. అందుచే నతఁడు సంధివిషయమై కొన్ని యేర్పాటులను గావించి ఔరంగజేబు గోలుకొండకోటను సమీపింపకమున్నే యీ వర్తమానము నతనికిఁ జేరునట్లు తనరాయబారుల నంపెను. వారతిత్వరితముగఁ జని మార్గమధ్యమున నౌరంగజేబును సందర్శించి తానీషాయభిప్రాయము నతని కెఱింగించిరి. వెంటనే యౌరంగజేబు గోపోద్దీపితుఁడై రాయబారులను దిలకించి "దుర్మార్గులారా ! హిందూమతాభిమానియగు మీరాజుతో మఱల సంధియొనర్పవలయునా ? నాపట్టుదల నెఱుంగక, జ్ఞానహీనుఁడై మీరాజు మిమ్ముల నేలపంపవలయును? గోలుకొండరాజ్యమును జయించియే తీరుదు"నని వారితోఁ జెప్పుచుఁ దానీషా కొకలేఖను నీక్రిందివిధముగ వ్రాసి వారికొసంగెను.

తానీషారాజా !

నీవు గోలుకొండరాజ్యసింహాసన మధిష్ఠించినది మొదలు మహమ్మదీయ మతమున కించుకైన పాటువడక, మహా

మ్మదీయుఁడ వయ్యును హిందూమతమునం దభిమానమును వహించితివి. నీవు బ్రాహ్మణులను మంత్రులుగాఁ బెట్టుకొంటివి. పరమతస్థుఁడును నాశత్రువునగు శివాజీతో స్నేహమొనరించితివి. అతని వెనుక నతని కొడుకగు శంభాజీ సాయమును బొందుచున్నావు. మహమ్మదీయమతసిద్ధాంతములకు విరుద్ధముగాఁ బ్రవర్తించితివి. కావున నీతో యుద్ధమొనరించి నీరాజ్యమును గైకొందునేగాని సంధిపొసగదు. ధీరుఁడవైన రణరంగంబున నన్ను జయించి నీరాజ్యమును గాపాడుకొనుము.

ఇట్లు,

ఔరంగజేబు.

ఇట్లు వ్రాయఁబడియున్న జాబును గైకొని రాయబారులు తానీషా చెంతకరుదెంచిరి. తానీషాజాబులోని విషయములను దిలకించి కోపావేశపరవశుఁడై "ఓరీ! నీచా! పరమతద్వేషీ! నీవటరా నన్నాక్షేపించుట! నీవలె స్వమతాభిమానము నాంకెగాలకు? మహమ్మదీయ మతమున సహితము నేను పడినపాట్లెల్ల నీవెట్లు గుర్తెఱుంగఁగలవు? ధీరుఁడవైన రణరంగమున నన్ను జయింపుమనియూ వ్రాసితివి! ఎవరుధీరుఁడైనదియు నీవెఱుంగఁ గలవు. కన్నతండ్రికి విషముపెట్టి చంపి సింహాసన మధిష్ఠింపనెంచిన క్రూరుడవు; నీవా నన్ను వెక్కిరించునది! కానిమ్ము! నీపించమూర్పెద"నని తనలోఁ దాననుకొనుచుండెను. అతనికిట్టి కోపమెప్పుడును గలుగలేదు. అతని హృ

దయమున శాంతి కించుకైన చోటుదొఱకలేదు. యుద్ధమే కర్తవ్యమని యెంచి యతఁడు తనదండనాయకుల నెల్లఁ బిలువ నాజ్ఞాపించెను, గోలుకొండకోటలోనున్న సైన్యాధిపుఁడగు నబ్దుల్లాఖానునికి మిగుల జాగ్రత్తతోఁ గోటను గాపాడ వలసిన ట్లుత్తరువు పంపఁబడెను మహారాష్ట్రనాయకుఁడైన శంభాజీ తానీషావద్దకరుదెంచి యుద్ధప్రయత్నముల నతిత్వరితముగ గావింప వలసినట్లు నొక్కి చెప్పెను. పిమ్మటఁ గొంత సేపటికి దండనాయకులు, యితరవీరులందఱు వచ్చి తానీషాను దర్శించిరి. అచిరకాలముననే గోలుకొండ కోటకుఁ జని, మొగలాయి సైన్యంబులను గలిసికొని, కదనంబొనరించుటకు సిద్ధముగ నుండునట్లు వారికాజ్ఞాపింపఁబడెను. గజతురగ పదాతిగణంబులకు యుద్ధయాత్రానురూపంబులగు వేషభూషణంబుల నలంకరింప వలసినట్లు తానీషా తనసేవకుల కాజ్ఞాపించెను. తానీషాయును శంభాజియు యుద్ధమునకు వెడలుటకు సిద్ధముగ నుండిరి. పట్టణమునందెల్లెడలను శాంతిప్రియులగు వారిహృదయములయందు మఱల నారక్తప్రవాహములు — ఆసంక్షోభము — ఆభీభత్సప్రదర్శనములు ప్రతిబింబితములగుచుండినవి. జనులలోఁ గొందఱు యుద్ధసన్నద్ధులై కోటముట్టడికిఁ బ్రయాణోన్ముఖులైయుండిరి.

---

# 30 వ ప్రకరణము

తానీషా చక్రవర్తియును, మహారాష్ట్రనాయకుఁడైన శంభాజియును మహాసేనాసన్నాహంబును జేసికొని గోలుకొండకోట సంరక్షణార్థమై బయలువెడలిరి. రణదుందుభులు దిగంతములు ప్రతిధ్వనులెసఁగ మ్రోయుచుండఁ దళతళ మెఱయు ఖడ్గములను హస్తములందు దాల్చి కాల్బలములు జయజయధ్వానములొనరించుచు ముందు నడచుచుండెను. ఆవెనుక శ్వేతాశ్వముల నధిరోహించి వాడియైన బల్లెములను గైకొని యాశ్వికులు వెడలుచుండిరి. వారి వెనుక మదగజేంద్రములపై నెక్కి తానీషాయును, శంభాజియునువచ్చుచుండిరి. ఇతర యోధవరులు సహింత మేనుగులపై నెక్కి తానీషా చక్రవర్తి గారికి జయమగుఁగాకయనుచు వారి వెనువెంట వచ్చుచుండిరి, సైనికుల కోలాహలధ్వనులును, జయ జయనినాదములును, హయహేషలును, గజబృంహితములును నేకమై బ్రహ్మాండమును బ్రద్దలు చేయునట్లుండెను. ఈసైన్యమంతయుఁ గోటఁ జేరునప్పటికే ఔరంగజేబు సైన్యమంతటిని వారివారిస్థలములయందుఁ జేర్చి యుద్ధమునకు సిద్ధపడి యుండెను. కోటయందు మందుగుండు మొదలగు సామానులన్నియు నబ్దుల్లాఖానునిచే సిద్ధముగఁ బెట్టఁబడి యుండెను. కోటసింహద్వారమున

నబ్దుల్ రజాకుఁ దన సైన్యమును సిద్ధముగఁ బెట్టియుంచెను అబ్దుల్లాఖానుఁడు మఱియొక ద్వారమునఁ గావలిగాచుచుండెను.

తానీషా సైన్యము కోటను సమీపించిన వెంటనే జోరంగజేబు శత్రువులపైఁ బడుటకుఁ దన సైనికుల కాజ్ఞాపించెను. అందఱును గోళోన్మత్తకృపాణపాణులై యుద్ధమునకు సిద్ధపడి యుండిరి. రెండు సైన్యంబులకును సంకులసమరము ప్రారంభమైనది. ఇరువాగులవారును జండస్వరూపములను ధరించి హోరాహోరిగఁ బోరాడఁగడంగిరి. కరి తురగ పదాతి గణంబులచేఁ బ్రభవించిన రజఃపటలము నల్లని మేఘమువలె నాకాశమును గప్పివైచెను. తళతళమని మెఱయు ఖడ్గకాంతులు మెఱుపుమెఱసిన రీతి కన్నులను మిఱుమిట్లు గొల్పుచుండెను. రణరంగమున శోణితవాహినులు ప్రవహించుచుండెను. విగ్రహారాధకులైన హిందువులను గొఱ్ఱెలవలె నఱికివేయవలయునని మొగలాయీలు మిగుల శౌర్యముతోఁ బోరాడఁ జొచ్చిరి. హైందవులును మిగుల ధైర్యముతోడను మెలఁకువతోడను శత్రువుల నెదిరించి జగడమాడుచుండిరి. శంభాజీ తన మహారాష్ట్ర వీరుల సహాయమున లెక్కలేని మహమ్మదీయులను బొలియించుచుండెను. అతని ఖడ్గమునుండి రక్తము వర్షించుచుండెను. శత్రుసేనల వలన నపాయము లేకుండఁ దానీషా కోటలోసికిఁజొచ్చి తుపాకులను, ఫిరంగీలను నెడతెఱపిలేక మొగలులపైఁ గాల్చుచుండెను. సింహద్వారము కడ

నున్న అబ్దుల్ రజాకు సింహాకిశోరము కైవడి శత్రువులవంకకు దుమికి యనేకమంది వీరులను హాత మొనర్చు చుండెను. శత్రువులు సింహాద్వారమును భేదింపకుండు లాగున మహారాష్ట్ర వీరులు ద్వారమునకు ముందుభాగమున నిలిచి మొగలులతో బోరాడు చుండిరి. దీనిఁగనిన ముఅజ్జము రోషపూరితమగు హృదయముతోఁ గత్తిని ఝళిపించుచుఁ దనయశ్వమును శంభాజీవకంకుఁ బోనిచ్చెను. శంభాజీయుఁగుటిలభృకుటియై బలిష్ఠమగుఁ దన యుత్తమ కరవాలముతో నొక్కొక్క విసురునకు బెక్కుమంది వీరులను యమసదనమున కంపుచు శత్రువీరుల నుండి తప్పించుకొనుచుఁ దనవిశేషఖడ్గసాధన పరిశ్రమము నెల్లరకుఁ దేటపడునట్లు చూపుచు ముఅజ్జమునుదాకఁ దనహాయమును బోనిచ్చెను. వీరిద్దరికిని నొకయరగంట కాలము పోరు ఘోరముగ జరిగినది. ముఅజ్జముపైఁ బడుకత్తివ్రేటుల నెల్ల దప్పించుచు నిబ్రహీము సహితము శంభాజి పైకిదూకెను. వెంటనే శంభాజీ తన దారుణకరవాలమున నాతనిశిరమును ఖండించి వైచెను. ఇబ్రహీము క్రిందఁబడెనను వార్తనువినిన తోడనే :తానీషా సైన్యము జయజయనినాదములఁ గావించెను. రాజద్రోహియు, తానీషా జన్మశత్రువును, అమాత్యశేఖరుల యకాలమరణమునకు హేతుభూతుండును నగు నిబ్రహీముఖానుఁడాటితో యంతరించి పోయెను. ఇబ్రహీము మరణమునుగనిన ముఅజ్జము వెంటనే తనగుఱ్ఱమును గదలించుకొని

వేఱొకవంక కేగెను—ఎక్కడఁజూచిన నశ్వముల హేషారవములే!—ఏవంకఁజూచినను విలవిలదన్నుకొను మొండెములే! ఎగిరిపడుచుండు శిరములే! ఏప్రక్క దిలకించినను వీరరసావతారమూర్తులే కన్నుల కగపడుచుండిరి. వారికన్నులు రక్తసిక్తములై చూపఱులకు మఱింత భయంకరముగ నుండెను. ఔరంగజేబు తన సైన్యములోఁ గొంత భాగమును దీసికొని పడమటి భాగముననున్న కోటగోడలను బడగొట్టింపఁబ్రయత్నించుచుండెను. తనవద్దనున్న ఫిరంగిగుండ్లచేఁ గోటగోడలను గుభాలు గుభాలు మనిపగులఁ గొట్టించుచుండెను. మఱియు నితఁడు కోటగోడలక్రింది నేలలో సొరంగములను ద్రవ్వియందుఁ దుపాకిమందుఁ గూరి దానినంటింపఁ జేయుచు గోడలను బ్రద్దలుచేయుచుండెను. కోటలోనివారు గోడలపైనుండి లెక్కలేనన్ని ఫిరంగీలను దుపాకులను గాల్చుటచే మొగలాయీలలో ననేకులు మడిసినందున నౌరంగజేబాయత్నమును మానుకొనెను. మహారాష్ట్రవీరవరులును దానీషాసైన్యంబులును గలిసి మహాశౌర్యముతోఁ బోరాడుచున్నందున దానీషాసైన్యమునందు కంటె నౌరంగజేబు సైన్యమునందే రెండురెట్లధికముగ సైనికులు నిహతులై యుండిరి. అప్పటికి భానుఁడు సహింత మపరవారాసిఁ జేరుటచే నౌరంగజేబు నాఁటికి యుద్ధమును జాలించెను

# 31 వ ప్రకరణము.

పైప్రకరణమునఁ జెప్పఁబడిన విధమున నౌరంగజే బ నేకపర్యాయములు కోటనుముట్టడించి చూచెను. కాని,హిందూవీరులును దానీషా సేనలోని మహమ్మదీయ శూరులును నందఱు నేకమై లెక్కకు మిక్కిలియని నిక్కుచున్న మొగలాయివీరుల నుక్కడంచుటచే నతనికిఁ గోటలోని కొకయుష్వగైన నిషటకు వశముగాకుండెను. దినములు గతించి పోవుచుండెనవి—వారములు గడచిపోవుచున్నవి—నెలయైనది—రెండు నెలలుపూర్తిగావచ్చినవి. దానీషా సైన్య మించుకైన జంకుఁ గొనక శత్రువులతోఁ బోరాడుచుండెను. మొగలాయి సైన్యములో ననేకమందినిహతులగుటచే నౌరంగజేబించుక ధైర్యమునువీడి యేమిచేయుటకును దోచక పరితపించుచుండెను. సైన్యమున కాహారమునకై తాను వెంటఁగొనివచ్చిన సామానులలో సగముకంటె నెక్కుడు ఖర్చయిపోయినవి. అతఁడెంత ప్రయత్నించినను గోటయతని స్వాధీనముకాలేదు. కష్టపరంపరలలోఁ గాలముగదలుచున్నట్టే గన్పట్టదు. కోటముట్టడి ప్రారంభమయి యిప్పటి కైదుమాసములు పూర్తికావచ్చినను దానీషా సైన్యము మహారాష్ట్రుల సహాయమున మొగలులను గోటలోనికిఁ జొరబడనివ్వలేదు. ఔరంగజేబిట్టి ధీరులన్న దాని

క్కడను జూచియుండ లేదని తలంచెను. ఏయితర రాజ్యమును వశపఱచుకొను నప్పుడు గూడ నతండిట్టి కష్టమును ననుభవింపలేదు. కోటముట్టడినిమాని తన నగరమునకు వెళ్లవలయునని యతఁడు తలంచెనుగాని యాయూహచే నతఁడెంత మాత్రముతృప్తిని జెందలేదు. విస్తారమైన రాజ్యమును జయించి నధీరుఁడౌక గోలుకొండను మాత్రము జయింపక వెనుకకు మఱలినచో లోకమున నంతకంటె నతనికిఁ గలుగు యవమానమేమున్నదని యతఁడు గ్రహించెను. అందుచే నతఁడు ప్రాణములనైన నర్పించి గోలుకొండను స్వాధీనపఱచుకొనవలయునేగాని వెనుకకు మఱలఁ గూడదని గట్టిపట్టుపట్టెను. కాని తనవద్దనున్న సైన్యముతోఁ గోటను స్వాధీనపఱచుకొనుట మిగులఁ గష్టమని యతఁ డెఱింగెను. ఇఁక ఢిల్లీలో మిగిలియుండిన కొద్దిపాటి సైన్యము నతఁడు పిలిపించుకొనవలయును. ఢిల్లీనుండి గోలుకొండకు సైన్యము వచ్చుటకుఁ జాలకాలము పట్టుటచే నౌరంగజేబా ప్రయత్నమును మానుకొనెను. అతఁడేమి చేయఁగలఁడు. భేదోపాయములలో నాఱితేఱినయౌరంగజేబు—కుయుక్తులకుఁ బుట్టినిల్లైన ఔరంగజేబు—కపటాచరణములకు గనియైన ఔరంగజేబెట్టి యిక్కట్టులనైన నవలీలగఁ దప్పించుకొనఁగలఁడు.

అతఁడిప్పుడు తానీషాయొక్క సైనికులలో నొక్కొక్కని జీలఁదీయసాగెను. అతఁడు రాత్రిలలోఁ బెక్కుమంది సైనికులు

విడిసియున్న చోటులకు రహస్యముగ నేగి తానిషాపై నతృప్తిని
గలుగఁజేయువిషయములను. వారికి బోధించి వారి నందఱిని
దన స్వాధీనము జేసికొనుచుండెను. తన వంకఁజేరిన వారికి వి
శేషధన మిచ్చెదనని గూడ నతఁడు ప్రోత్సాహపెట్టెను. కొం
తమందికి డబ్బు నొసంగెను. తానీషాసైన్యమును వదలి ధన
వంతులైన వారిని జూచి మఱికొందఱు తమ యుద్యోగముల
ను వదలి ఔరంగజేబొసంగిధనమును దీసికొని యిండ్ల కేగిరి.
తానీషాతోఁ గలసి యుద్ధ మాడుట లేదని మహమ్మదీయు
లందఱు ఔరంగజేబువద్దధీరముగఁ బ్రమాణ మొనర్చిరి. కాల
క్రమముగ ననేకమందిదండనాయకులును, నితరసేనానాయ
కులును ధనాశావేశపరులై, స్వామిద్రోహులై మొగలుల
తోఁ గలసిపోయిరి. ఇట్లాఱు మాసములు పూర్తియగునప్పు
టికి స్వామికార్యధురంధరుఁడైన అబ్దుల్ రజాకులారీయను
వాఁడును, మఱియొక సేనానాయకుఁడగు నబ్దుల్లా ఖానుఁడు
ను దప్పఁదక్కిన వారందఱును ధనపిశాచముచే నావేశింపఁబ
డి మాంత్రికుఁడగు నౌరంగజేబునకు లోఁబడిపోయిరి. తానీషా
కీసంగతి బాగుగదెలియవచ్చినది. కాని యతఁడేమి చేయఁ గ
లఁడు? దైవమెటులొనరించిన నటుల కాఁగలదని యతడు త
లంచుచుండెను; శంభాజి మాత్రము తన తండ్రియగు శివా
జీ యాజ్ఞననుసరించి తానీషాకుఁ గడపటి వఱకు సాయమొ
నరింపవలయు ననియు, దిన్నను దన తండ్రిని యవమానపెట్టి

వ యౌరంగజేబును సంగరంబునఁ జంపవలయుననియు నెంచి మొగలులతో ధీరముగఁ బోట్లాడుచుండెను, మొగలు లనేక మంది రణరంగమున మడియుచుండిరి. ఔరంగజేబునకుఁ గోట స్వాధీనపడలేదు. అబ్దుల్లాఖానుని. అబ్దుల్ రజాకును దనకు లోబఱచుకొనవలయునని యెంచి, తానీషాతో గలసి యుద్ధము జేయకున్న, దమకపారమైన ధనమిత్తుననియు యుద్ధమున దన కెల్లిన సాయమొనర్పవలయుననియు, ఖానునికిని రజాకు కును ఔరంగజేబు వర్తమానముల నంపెను, స్వామిభక్తిపరాయణుఁడగురజాకిందులకించుకైన నొప్పుకొనకఁ దానీషా కీ వార్త నెఱింగించెను. ఖానుఁడు మాత్రము ధనాశచే నిందులకు సమ్మతించి సంగరంబున సాయమొనర్తునని ఔరంగజేబునకు వార్త నంపెను. ఈసంగతిని విన్న ఔరంగజేబున కింతింత నరాని సంతసముదయించెను. ఇకమీఁద గోలుకొండకోట తన కవలీలగ స్వాధీనము కాఁగలదని యతఁడు దలంచెను. అందుచే నతఁ డొక దినమునఁ దన సైన్యమును దీసికొని యత్యుత్సాహముతోఁ గోటను ముట్టడింపనెంచి తన సైనికులను జేరఁబిలిచి సైనికులారా! ఇప్పటికి దాదాపుగా నాలు మాసములనుండి మన మీకోటను స్వాధీనమొనరించుకొనలేక కష్టపడుచున్నాము. ఏడవమాసము సహితము బూర్తికావచ్చుచున్నది. ఇదియే కడపటిముట్టడియని తలంపుడు. నేడు మన జయాపజయములు దెలిసి పోవలయును. మీ జేనికై రణ

రంగమున మీప్రాణములను ధారవోసి విజయలక్ష్మిని సాధిం
పుడని చెప్పెను. అంత మొగలాయివీరులందఱు జయజయధ్వా
నములు గావించుచు యుద్ధమునకు సిద్ధపడి యుండిరి. పిమ్మట
నౌరంగజేబు కోటను ముట్టడించుటకు వారి కనుజ్ఞ నొసంగెను.
అందుచే సైనికులందఱప్పటివలె సంగరంబునకుఁ దలపడిరి, రెం
డు పక్షముల వారికిని యుద్ధము ప్రారంభమయ్యెను. పూర్వ
మువలె దానీషా పక్షమునఁ బోరాడుటకు సైనికులెవ్వరును
నేఁడు లేకుండిరి. అబ్దుల్ రజాకులారీ యాధిపత్యముననున్న కొం
తమంది సైనికులును, అబ్దుల్లాఖానుని యాధిపత్యము క్రింద
నున్న సైనికులలోఁ గొందఱును, మహారాష్ట్రులును మాత్ర
మే శత్రువులతోఁ బోరాడుచుండిరి. కోటగోడలపైనుండి తు
పాకులను శత్రువులపైఁ గాల్చుట కెవ్వరును లేకుండిరి. కోట
కుఁ దూర్పుభాగమున నున్న బురుజులను రక్షింప సైనికులెవ్వ
రును లేరు. తానీషాకుఁ గోపము హెచ్చయినది, అంతవీరావే
శముచే నతఁడు సింహద్వారముకడ యుద్ధమొనరించుచున్నవా
రిలోఁ గొంతమంది సైనికులను దీసికొని కోటబురుజులకు నిక్కం
టింప యత్నించుచున్న సైనికులపైఁబడి ఘోరముగఁ బోరాడ మొ
దలుపెట్టెను. కోటకుఁ దూర్పు భాగమున నున్న గోడలను బ
డఁగొట్టఁ బ్రయత్నించుచున్న మొగలాయివీరులతోఁ గొంత
మంది మహారాష్ట్రవీరులు పోరాడుచు ననేకమందిని గూల్చు
చుండిరి. అబ్దుల్ రజాకులారీయును శంభాజియు గోటసింహద్వార

ము కడశత్రువులతో హోరాహోరిగఁ బోరాడుచుండిరి. కాని పూర్వముకంటె సైనికులసంఖ్య తక్కువగుటచే వీరివద్దనున్న సైన్యములో ననేకులు మడియు చుండిరి. ఇట్లుండఁ గోటకుఁ బశ్చిమ భాగమున నున్న ద్వారము గాపాడుచున్న నబ్దుల్లాఖానుఁడు ధనాశచే నౌరంగజేబునకు సాయ మొనర్చెదనని చెప్పినమాట ననుసరించి మొగలులతోఁ బోరాడక ద్వారమును దెఱచి శత్రువులను లోపలికి రానిచ్చి మొగలులతోఁ గలిసి పోయెను. మొగలులు జయజయధ్వానములొనరించుచుఁ గోటలోనికిఁ జొరఁబడుచుండిరి. ఈవార్తను విన్న తానీషా గుండెలు గంపమెత్తెను. అతఁడు వెంటనే సింహద్వారమును రక్షించుచున్న అబ్దుల్ రజాకులారీసు యూవంకకుఁ బంపి తాను సింహద్వారమును రక్షించుచు శత్రువులతోఁ బోరాడుచుండెను.

మొగలులు గోటలోనికిఁ జొరఁబడుచున్నారని తెలిసి నతోడనే అబ్దుల్ రజాకు తన హయంబునతిరయంబున నావంకకుఁ బోనిచ్చి వీరావేశముచే నెత్తిన కరవాలమున కేబది మంది వీరులను బరిమార్చుచుండెను. ఆతని ముఖము భీకరాకారమును ధరించియుండెను. అతనికిఁ గోపము హెచ్చు కొలది ననేకమంది మొగలులు మడియుచుండిరి. అతఁడు సహస్రనయనంబులచేఁ దన చుట్టును వీక్షించుచు నడ్డము వచ్చిన శాత్రవులను గన్నుమూసి తెఱచునంతలో నతిచాతుర్యమున దునుమాడుచుండెను. కానియాతఁడొకఁడెంత సేపు పోరాడఁగలఁడు? అతనికి సాయమొనర్చుటకితర యోధవరు లెవ్వరును నచటలే

రు. వేలకొలది శత్రువులు కోటలోనికిఁ జొరఁబడుచుండిరి. ఈ వార్త విన్న మహారాష్ట్రవీరులు భయపడి పరుగెత్తిపోవుచుండిరి. శంభాజియుఁ జేయునది లేక తన వద్దనున్న కొద్దిపాటి సైన్యముతో మొగలులను కోటలోనికిఁ జొరనీక పోరాడుచుండెను. కాని ప్రయోజనముగనబడ లేదు. వేలకొలది శత్రువులు క్రమ్ముకొని అబ్దుల్‌రజాకు పైఁబడిరి. అందఱును జేరి కత్తులతో నాతని మిగుల నొప్పింపసాగిరి. అతఁ డొక్కఁ డేమిచేయగలఁడు? అప్పటికిని దన సామర్థ్యముచే ననేకమంది మొగలాయి వీరులను భూమికి బలివెట్టుచుండెను. మొగలులు మఱింత రోషముతో నాతని నఖశిఖాంతము వఱకు గత్తులతోఁ బొడిచిరి. అతఁడు నిశ్చేష్టితుఁడయ్యెను. అతని హాయమునకు సహితము లెక్క లేనన్ని గాయములు తగిలి యున్నందున దానిదేహము నుండి రక్తము ప్రవహించుచుండెను. వెంటనే యది యచ్చట నిలిచి యుండిన దనకును దనయజమానునికిని మరణము సంభవించునని యెంచి అబ్దుల్‌రజాకును వీపుపై నిడికొని రణరంగమును వీడి యొచ్చటికో పరుగెత్తి పోయెను. రజాకు సహితము వ్రణముల బాధచే బీడింపఁ బడుచున్నందునఁ జేయునది లేక తన గుఱ్ఱము తీసికొని పోయినచోటికిఁబోయెను.

అబ్దుల్‌రజాకు సంగరరంగము నుండి యదృశ్యుఁడైన వెంటనే మహారాష్ట్రు లెల్లరు భయభ్రాంతులై పలాయనమై పోయిరి. శంభాజియు మొగలాయిచక్రవర్తి తన్ను బట్టుకొ

మనసుభీతిచేఁ దన సైనికులననుసరించి యుద్ధభూమినుండి వెడలిపోయెను. దీనినంతయుఁ గని తానీషా క్రోధఘూర్ణితుఁడగుచు వీరావేశముచే నున్మాదుని కైవడి తన ఖడ్గమును దీసికొని రణరంగమున నల్దిక్కులకును బర్వెత్తసాగెను. వెంటనే యౌరంగజేబు తానీషాను బట్టుకొనుడని తన భటులకుత్తరువిచ్చెను. భటులతని యాజ్ఞమేరకుఁ దానీషాను బట్టుకొని యతని యెదుటికిఁ దీసికొని వచ్చిరి. ఇప్పటికి గోలుకొండ రాజ్యము దమ వశమైనదని మొగలు లందఱు జయజయ ధ్వానములఁ గావించిరి. వెంటనే యౌరంగజేబు తన భటులనుజూచి "ఓరీ! మీరీతానీషాను గొనిపోయి దౌలతాబాదు దుర్గమునఁ జెరయుందుంచుడు. పిమ్మట నితనివిషయమై యాలోచించెద"మని చెప్పెను. తత్క్షణమే యతని భటులు తానీషాను గొంపోయి దౌలతాబాదు దుర్గమునఁ జెఱయుందుంచిరి, యుద్ధము పూర్తియైనది. విజయలక్ష్మి చేకూరినందుల కౌరంగజేబెంతయు సంతసించెను. పిమ్మట నతఁడు కోటను స్వాధీనపఱచుకొని తన సైన్యముతు ముఱజ్జము వెంట ఢిల్లీపట్టణమునకుఁ బంపివేసెను.

కాని సంగరంబున నతని మనస్సాక్షి నిపైలీనమై పోయినది. మఱచిపోవలయు నన్నను నతని కావిషయము మఱపునకు రాలేదు. రణరంగమున నబ్దుల్ రజాకు శౌర్యమున కతఁడుమిగుల నచ్చెరు వొందెను. అట్టి ధీరుఁడు మఱియొకఁడు తానీషా

యొద్దనున్న మొదల నతనికి గోలుకొండను దీసికొనుటకు మిగు
లఁగష్టమై యుండెడిదని యతఁడు తలంచెను. అబ్దుర్రజాకు
కొఱకై యతఁడప్పుడు తన చారులనంపెను. వారు తిరిగితిరిగి
తుదకతనిని గుర్తించి ఔరంగజేబు వద్దకుఁ దీసికొని వచ్చిరి.
వెంటనే యౌరంగజేబతనికిఁ జికిత్సఁ జేయింప వ్రణవైద్యుల నిరు
వుర నేర్పాటుచేసెను. వీరాస్వామిభక్తుని గాయములకుఁ జికి
త్సఁ జేయుచు 'మొత్తముమీఁద నాతనికాయమునందు డెబ్బది
గాయములను లెక్కించితి మనియు, నింకనుగాయము లనేక
ములు గలవనియు, గాయముపై గాయముపడినందున లెక్కిం
చుటకుఁ గష్టము"నియు నౌరంగజేబుకు వర్తమాన మంపిరి.
కొంతచికిత్స జరిగినపిమ్మట నబ్దుల్ రజాకు కనులవిప్పి చూచె
ను. ఈసంగతి ఔరంగజేబు విని వెంటనే యచ్చటికివచ్చి రజా
కునుజూచి "అబ్దుల్ రజాకూ! నీశౌర్యమునకు మేమెల్లరమును
సంతసించితిమి. నిన్ను మాయాస్థానమున నుంచుకొని నీకు
గొప్పయధికారము నివ్వఁదలంచితిమి. ఇప్పుడే నీకుమారులను
నాయొద్దకుఁ బంపుము. వారినందఱిని సంరక్షించెదనని" చె
ప్పెను. అందులకా శూరాగ్రేసరుఁడు "అయ్యా! మీరునాకొ
నరించిన యుపకారములకు నేను మీకెంతయుఁ గృతజ్ఞుఁడను.
నేనింక జీవింపఁజాలను. ఒకవేళ జీవించిన నుద్యోగము జేయు
టకు సామర్థ్యముండదు. ఒకవేళ సామర్థ్యముండినను దానీషా
యుప్పుతిన్న వాఁడెవఁడును వానిశత్రువగు నౌరంగజేబు సేవ

జేయఁజాలఁడ"ని ప్రత్యుత్తర మిచ్చెను! ఈమాటలను విన్నవా రందఱతని స్వామిభక్తి కచ్చెరువొందిరి. పిమ్మట సారంగ జేబు విఫలమనోరథుఁడై తనస్థానమునకు వెడలిపోయెను. ఇట్టి స్వామిభక్తి పరాయణులగు వారందఱికిని బూజ్యులే గదా! యుద్ధమునందు విజయము చేకూరినందుల కౌరంగ జేబు మిక్కిలి సంతసించుచు దనపరివారమును దీసికొని ఢిల్లీకిఁ బ్రయాణ మయ్యెను.

# 32 వ ప్రకరణము.

గోలుకొండ రాజ్యలక్ష్మి! మొగలుల సామ్రాజ్యమున నంతరించి పోతివా? నీపవిత్రదేవాలయములు, నీమహోన్నతసౌధములు, నీధర్మసత్రములు, నీయుద్యానవనము లిప్పు డేమై పోయినవి? కొన్ని కాలవాహినీ గర్భమున గలసిపోయినవి! కొన్ని లుప్తములై పోయినవి-కొన్ని భగ్నములై పోయినవి. ఆభగ్నావశేషముల గొన్నిటి నిప్పటికిని జూడవచ్చును. ఓరాజ్యలక్ష్మి! నీగర్భమునందుఁ బుట్టినసత్యసంధు లెక్కడికి వెళ్లిరి? ఆభక్తశిఖామణులంద ఱిప్పు డెక్కడ నున్నారు? ఆ స్వామిభక్తి పరాయణులంద ఱిప్పుడగపడ రేమి? వారందఱు కాలసముద్రమున నంతర్హితులై స్వర్గసుఖముల ననుభవించుచున్నారు.

ఓతానీషాచక్రవర్తీ! నీకుఁ దుద కా చెఱసాలయందే మరణము ప్రాప్తించెనా? రాజచూడామణీ! నీవు హిందూమహమ్మదీయుల నైకమత్యమునకై పడినపాట్లను గుఱించియు నీప్రజలనుభవించుచుండిన సుఖసమృద్ధులను గుఱించియు, దుష్టశిక్షణ శిష్టపరిపాలనాతత్పరతం గూర్చియు, నీహిందూమతాభిమానమును గుఱించియు, నీదైవభక్తిని గూర్చియు నిప్పటికిని భరతఖండమునఁ బూజ్యులగు వారిహృదయాంతరాళములఁ బ్రతిధ్వనులు బయలుదేరుచునే యున్నవి.

ఓయమాత్యశేఖరులారా! అక్కన్నమాదన్నలారా! విద్రోహులచే మీ కకాలమరణము సంప్రాప్తించినను, ఆ రాజభక్తి—ఆప్రజానురక్తి-ఆమహాకూలంకషప్రజ్ఞ-ఆసాహితీగభీరత-ఆసర్వశాస్త్ర సమగ్రజ్ఞాన విశాలత-ఆనిష్పక్షపాతవిమర్శనావిచక్షణత యెప్పటికిని బ్రజాహృదయపీఠమున శాశ్వతపథము నధిష్ఠింపఁగలవుగాక !

రామభక్తాగ్రేసరా ! రామదాసూ ! నిర్మలమై-నిశ్చలమై-దృఢమైన నీభక్తిప్రభావము! నీ దివ్యచారిత్ర మాసేతుహిమాచలపర్యంతముగల మానవులకు మార్గదర్శకంబై నీతిబోధకమై, పుణ్యవిశేషంబై యలరారుచున్నది గదా !

స్వామిభక్తిపరాయణా! అబ్దుల్ రజాకూ! నీస్వామి కార్యధురంధరత్వము నేమని కొనియాడ వచ్చును! నీవు మీరాజును విడిచినచో లక్షలకొలది ధనమును, నున్నతాధికారమును

లంచముగ నొసంగెదననినను సమ్మతింపక ఢిల్లీశ్వరుని మాటలను ధిక్కరించిన మహానుభావుడవు తుద కసంఖ్యాకములగు వ్రణములచే బాధపడుచుఁ బ్రాణావసానకాల మాసన్నమైనను ఢిల్లీశ్వరుని మాయలకు లోఁబడక స్వామియందు దృఢమగుభక్తిభావముతో నుండిన మహావీరుఁడవు! నీచారిత్రమును విన్న ప్రతిమానవుఁడును నిన్ను భువనైక వంద్యుఁడనక మానఁడు.

ఓ స్వామిభక్తిపరాయణా! ఓ రామభక్తాగ్రేసరా! ఓ యమాత్యశేఖరులారా! ఓ తానీషాచక్రవర్తీ! మీరిప్పుడెట్టి పవిత్రలోకమందున్నారో యాలోకమునుండి మీకృపాకటాక్షవీక్షణామృతధారలను మీ మాతృభూమిపైఁ బ్రసరింపఁజేయుచు నీభారతవర్షమును సుస్థిరశాంతి సౌభాగ్యభాసురంబగునట్లాశీర్వదింపుఁడు. మీ పవిత్రచారిత్రము భారతవర్షము నందలిజనుల కందఱకిని మార్గదర్శకంబులై విరాజిల్లుచుండుగాక.

ఓం శాంతిః

సమాప్తము.

## శారదావిజయం

గ్రంథకర్త—కొడాలిసత్యనారాయణరావుగారు

ఇందు శారదా మాధవులు పెక్కుకష్టములకు లోనై చివరకు సౌఖ్యదశ ననుభవించెదరు. యితివృత్తముచక్కగా పోషింపబడినది. పండితపామరులు పఠించతగ్గ సాంఘికనాటకరాజము. వెల 0—12—0

## మహానంద

గ్రంథకర్త:—కొడాలిసత్యనారాయణరావుగారు

భక్తిరసప్రధాన నాటకరాజము. శివస్తోత్రము శ్రవణానందకరము పద్యములు రసవంతములు. శైలిమృదుమధురము భావములత్యద్భుతములు. చక్కనియాదర్శము. ఎందరోరచియించిరి గాని ప్రదర్శనార్థమై యెన్నియో నాటకసమాజములు వీరినాటకమునే యర్థించుచున్నందున యీనాటకప్రభావము మేము వేరుగ వ్రాయనవసరముండదు. అనేకప్రతులు అమ్ముడవుచున్నవి. త్వరపడినగాని ప్రతులు దొరుకుట దుర్లభము అతిశయోక్తి ఎంతమాత్రమునుకాదు. వెల 1—0—0

## రెట్టమతశాస్త్రము

ఇది రెట్టడనునతడు కన్నడభాషలో వ్రాసినగ్రంథమును అయ్యలరాజు అన్నయ్యభాస్కరుడనువాడు 154 సం॥ క్రితము తెనిగించినగ్రంథము సత్యవోలు అప్పారావుగారిచే తప్పులుసవరింపబడి వ్రాసినది మంచికాగితముపై ముద్రింపించబడినది, వెల 1—0—0

టి. వి. రమణయ్య అండ్ బ్రదర్స్
నేషనల్ బుక్కుడిపో, రాజమండ్రి

# నేషనల్ బుక్కుడిపోలో వెలకు దొరకు గ్రంథములు.

## నాటకములు.

| | | |
|---|---|---|
| గయోపాఖ్యానం | 0 | 8 |
| ప్రసన్నయాదవం | 0 | 8 |
| పారిజాతాపహరణము | 0 | 8 |
| పార్వతీపరిణయం | 0 | 6 |
| సం॥ రామాయణం | 1 | 4 |
| సం॥ ఉత్తరరామాయణం | 1 | 4 |
| సం॥ భారతం | 1 | 4 |
| సం॥ భాగవతం | 0 | 12 |
| సం॥ ఆంజనేయం | 1 | 0 |
| సతీసంయుక్త | 1 | 0 |
| వేశ్యాహితబోధిని | 1 | 0 |
| కనకతార | 0 | 12 |
| చింతామణి | 1 | 0 |
| రోషనార | 1 | 4 |
| గులోబకావళి | 1 | 0 |
| పసఙ్బకావళి | 1 | 0 |
| గర్వభంగము | 0 | 10 |
| శ్రీకృష్ణవిలాసం | 0 | 12 |
| జయంతజైపాలం | 0 | 12 |
| పాండవాజ్ఞాతవాసం | 0 | 8 |
| లంకాదహనం | 0 | 8 |
| పాదుకాపట్టాభిషేకం | 0 | 12 |
| భక్తరామదాసు | 1 | 0 |
| భక్తకబీరు | 1 | 0 |
| మాలతీమధుకరము | 1 | 0 |
| శ్రీకృష్ణతులాభారము | 0 | 12 |

## నాటకములు.

| | | |
|---|---|---|
| ప్రహ్లాద | 1 | 0 |
| సౌగంధికం | 0 | 6 |
| బొబ్బిలి | 1 | 0 |
| భూలోకరంభ | 1 | 0 |
| సత్యాబాయి | 0 | 12 |
| సురాజుద్దౌలా | 0 | 8 |
| భీష్మప్రతిజ్ఞ | 0 | 12 |
| పద్మావతీపరిణయం | 0 | 12 |
| చంద్రికాంత | 0 | 12 |
| శతకంఠరామాయణం | 0 | 12 |
| చిత్రకూల | 0 | 12 |
| అనసూయ | 0 | 12 |
| ప్రమదామనోహరం | 0 | 10 |
| రసపుత్రవిజయం | 1 | 0 |
| సుమతీదేవి | 1 | 0 |
| సతీతులసి | 1 | 0 |

## వైద్యగ్రంథములు.

| | | |
|---|---|---|
| ఆయుర్వేదసారసంగ్రహము | 0 | 12 |
| శతరోగసారప్రకాశిక | 0 | 8 |
| నాడీపరిజ్ఞానం | 0 | 6 |
| పానీయకల్పవల్లి | 0 | 4 |
| సుఖరోగచికిత్సారత్నాకరం | 0 | 12 |

## నవలలు

| | | |
|---|---|---|
| రుద్రమదేవి | 1 | 0 |
| తారాబాయి | 1 | 0 |
| తాసీషా | 1 | 0 |

వలయువారు టి. వి. రమణయ్యా అండుబ్రదర్సు,

నేషనల్ బుక్కుడిపో, రాజమండ్రి.